

11

పసిడి @ 73,350

వెండి కిలో రూ.86,300

ఢిల్లీ మార్కెట్లో రికార్డు గరిష్ఠ స్థాయికి ధరలు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గిగ్ వర్కర్ల గుర్తింపునకు
కొత్త యాప్ 14

ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభానికి చర్యలు

'ఆంధ్రజ్యోతి' కథనానికి ప్రభుత్వ స్పందన

శనివారం | 13-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 359 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి మ. 12.05 తదుపరి షష్ఠి; నక్షత్రం: మృగశిర రా. 12.49 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ.6.26-8.02; దుర్ముహూర్తం: ఉ.6.04-7.43; అమృతఘడియలు: సా.4.01-5.37; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తెలంగాణలో వ్యాపారం
చేయలేవ్

ఢిల్లీలోనూ వ్యాపారానికి నష్టం చేస్తానంటూ శరత్ చంద్రారెడ్డిని బెదిరించిన కవిత!

రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపిన సీబీఐ

భూమి కొనుగోలు పేరుతో కవితకు రూ.14 కోట్లు చెల్లించిన శరత్ చంద్రారెడ్డి

మహబూబ్‌నగర్‌లో కవితకు చెందిన భూమిని కొనుగోలు చేసినట్లు ఒప్పందం

ఇప్పటికీ జరగని భూమి బదలాయింపు!

జాగృతి సంస్థకూ రూ.80 లక్షల చెల్లింపు

ఢిల్లీ మద్యం స్కాంలో కవితది కీలక పాత్ర

ఆమె నుంచి నిజాలు రాబట్టేందుకే విచారణ

కస్టడీ రిపోర్టులో వెల్లడించిన సీబీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు ప్రధాన కుట్రదారుల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కీలక వ్యక్తిగా సీబీఐ పేర్కొంది. అరబిందో గ్రూప్‌కు చెందిన శరత్ చంద్రారెడ్డికి ఐదు మద్యం రిటైల్ జోన్లు దక్కడంలో ఆమె కీలకంగా వ్యవహరించారని తెలిపింది. ఇందుకు బదులుగా ఆయన నుంచి కవిత ఆర్థిక లబ్ధి పొందారని న్యాయస్థానానికి వెల్లడించింది. పైగా.. తాను చెప్పిన మొత్తం ఇవ్వకపోతే తెలంగాణలో వ్యాపారం చేయలేవంటూ శరత్ చంద్రారెడ్డిని ఆమె బెదిరించారని, ఢిల్లీలో కూడా ఆయన వ్యాపారానికి నష్టం చేస్తానని హెచ్చరించారని తమ కస్టడీ రిపోర్టులో సీబీఐ పేర్కొంది. కవితను ఎందుకు విచారించాలనుకుంటున్నదీ రౌస్ అవెన్యూ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సీబీఐ వివరించింది. 2021-22 ఢిల్లీ మద్యం విధానం ప్రకారం ఒకే సంస్థకు రెండు రిటైల్ జోన్ల కంటే ఎక్కువ కేటాయించరాదని, కానీ.. మూడు సంస్థలకు ఐదు జోన్లు కేటాయించారని, ఈ మూడు సంస్థలూ

మిగతా 3వ పేజీలో...

సీబీఐ కస్టడీకి కవిత

3 రోజులు విచారించేందుకు కోర్టు అనుమతి

15న తిరిగి హాజరు పరచాలని ఆదేశం

సీబీఐ కస్టడీలోనూ ఆమెకు ప్రత్యేక వసతులు

సోదరుడు కేటీఆర్‌ను కలిసేందుకు అనుమతి

కేసే లేదు.. విచారణేం చేస్తారన్న కవిత 3

తుపాకీ సిద్ధంగా ఉంది
ఒక్క తూటా చాలు

సింహమని చెప్తుర్రు కదా బయటకు రానివ్వండి.. పిల్లులు, కుక్కలతో పోరాడే వాడిని కాదు

జైలుకు పంపిన దానికి ప్రతీకారం మొదలెట్టనే లేదు

కవిత అరెస్టుపై తెలంగాణలో చర్చ కూడా లేదు

కేటీఆర్ సంతోషం రెండు నెలల్లో తేలిపోతుంది

ఐదు సీట్లలో గెలుపునకు బీఆర్ఎస్‌కు బీజేపీ సుపారీ

ఈ ఎన్నికల్లో బీజేపీకి కష్టంగా 240 సీట్లు

400 రావాలంటే పాక్ ఎన్నికల్లోనూ గెలవాలి

నిధులు ఇచ్చి బడేభాయ్ అనిపించుకోమన్నా

మోదీతో సమావేశం ప్రభుత్వాధినేతల భేటీ మాత్రమే

వ్యవస్థలతో పోరాడను.. సత్సంబంధాలే కోరతా

మోదీ అదానీకి దేశాన్ని చౌకగా దోచిపెట్టారు

ఆ డబ్బుల్ని తెలంగాణలో పెట్టుబడి పెట్టించా

పెట్టుబడులకు భరోసా ఇస్తా... దోపిడీ చెయ్యనివ్వ

అధికారం కోసమైతే బీజేపీలో చేరి మంత్రినయ్యేవాణ్ణి

సీఎంగా ఉండి బీజేపీలో చేరాల్సిన అవసరమేంటి?

పోరాడి సీఎంనయ్యా.. ఎవరి దయతో కాదు

ఎన్నికల ముందు కేజ్రీవాల్ అరెస్టు అవసరమా?

మోదీ నాయకత్వంలో బీజేపీ పట్టాలు తప్పింది

మందిర్ పనిచేయట్లేదని అవినీతి ఎత్తుకున్నారు

రాహుల్, ఖర్గే, వేణుగోపాల్‌లలో ఒకరు ప్రధాని

ఇండియా టీవీ ఇంటర్వ్యూలో సీఎం రేవంత్

ఆప్ కీ అదాలత్‌లో ముఖ్యమంత్రికి చప్పట్ల వర్షం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్‌పై ప్రతీకారం తీర్చుకోవడం ఇంకా ప్రారంభించనే లేదు.. తుపాకీ సిద్ధంగా ఉంది. ఒక్క తూటా చాలు.. నేను పిల్లులు, కుక్కలను కొట్టను. కొడితే పులినే కొడతాను" అని సీఎం రేవంత్ రెడ్డి 'ఇండియా టీవీ' సీనియర్ జర్నలిస్ట్ రజత్ శర్మ నిర్వహించే 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్‌ను కొట్టాలంటే అసెంబ్లీలోనే వెళ్లి కొట్టేవాడినని.. అందుకు కుర్చీయే (అధికారమే) అవసరం లేదని చెప్పారు. అలాగే.. కవితను తెలంగాణలో జరిగిన అవినీతికి అరెస్టు చేయలేదని, ఢిల్లీలో జరిగిన అవినీతికి అరెస్టు చేశారని రేవంత్ గుర్తుచేశారు. కేసీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణ ఎన్నికల్లో ఏమైనా ప్రభావం

మిగతా 13వ పేజీలో...

రైతులను మోసం చేసే మిల్లర్లు, ట్రేడర్ల

లైసెన్స్ రద్దు చేయండి

కస్టమ్ మిల్లింగ్ నిలిపేసి బ్లాక్ లిస్టులో పెట్టండి

ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే ఉపేక్షించొద్దు

నీటి సరఫరాకు ఆటంకం కలిగించే వారిపై వేటు వేయండి.. సమీక్షలో సీఎం 14

కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యత ఐపీఎస్‌లకు

జనగామ మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ 13

తెలంగాణకు 8.5, ఆంధ్రప్రదేశ్‌కు 5.5 టీఎంసీలు 13

తాగునీటి అవసరాలకు కేటాయించిన కేఆర్ఎంబీ.. ఇరు రాష్ట్రాల ఈఎన్సీలతో సమావేశం

సాగర్‌లో ఉన్న నీటి నిల్వలపై చర్చ.. 500 అడుగుల పైనున్న నీటి వినియోగానికి నిర్ణయం



అంతరిక్ష టూరిస్ట్‌గా తెలుగు తేజం! 2

ఏపీ వాసి తోటకూర గోపీచంద్‌కు అరుదైన గౌరవం

'బ్లూ ఆరిజన్' మిషన్‌లో అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం

ఈ ఘనత సాధించనున్న తొలి తెలుగు వాడిగా రికార్డు

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద
ధర్నా 3

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్

15 భారీ సభలు

2-3 రోడ్డు షోలు కూడా..

పాల్గొననున్న మోదీ, షా, నడ్డా

సభా స్థలాలపై బీజేపీ కసరత్తు

మోదీ హ్యాట్రిక్‌కు చెమటోడుస్తున్న శ్రేణులు 12



ఐపీఎల్ టికెట్ల గోల్‌మాల్?

విక్రయాల్లో పారదర్శకత ఏది?.. ఆన్‌లైన్‌లో అమ్మకాల పేరుతో మాయం

అభిమానుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు

ఎన్ని టికెట్లు.. ఎప్పటి నుంచి ఎప్పటిదాకా అమ్ముడయ్యాయనేది ఎవ్వరికీ తెలియదు

అంతా ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంఛైజీ ఇష్టారాజ్యమే

ప్రశ్నిస్తే.. వేదికను తరలిస్తామంటూ.. నగర ఇమేజ్ పోతుందంటూ బ్లాక్‌మెయిల్!

ఇష్టారీతిగా టికెట్ల ధరల పెంపు

కొన్ని మ్యాచ్‌లకు 100శాతం దాకా

రాజస్థాన్‌తో మ్యాచ్‌కు రూ.15వేలు

బెంగళూరుతో మ్యాచ్‌కు రూ.30వేల ధర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐపీఎల్‌ను పిచ్చిగా ఇష్టపడే హైదరాబాద్ అభిమానుల్లో ఇప్పుడు లీగ్ నిర్వాహకులపైనే తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ విక్రయాల పేరుతో టికెట్లను తమకు దక్కకుండా క్షణాల్లో మాయం చేస్తున్నారని మండిపడుతున్నారు. టికెట్ల విక్రయాలు మొదలవ్వగానే .. యాప్ తెరిచి బుక్ చేసుకునేలోగా 'సోల్డ్ అవుట్' బోర్డులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు 20వేల పైచిలుకు టికెట్లు అని చెబుతున్నా.. సామాన్య అభిమానులకు దొరకడం లేదంటే అది గప్‌చుప్‌గా పక్కదారి పట్టించడమేనని కన్నెర్ర చేస్తున్నారు. ఇప్పటికే జరిగిన రెండు మ్యాచ్‌ల్లో టికెట్లను క్షణాల్లో గాయబ్ చేశారని.. ఉప్పల్ స్టేడియానికి వెళ్లి అభిమాన క్రికెటర్ల ఆటను

మిగతా 13వ పేజీలో...



వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా
సుధీర్‌కుమార్ 14

హనుమకొండ జడ్పీ చైర్మన్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్

65,000 కోట్లు హెచ్ఏఎల్‌కు భారీ ఆఫర్

97 'తేజస్ మార్క్-1 ఏ' యుద్ధ విమానాల కోసం రక్షణశాఖ టెండర్ 2

ఇప్పటికే 48 వేల కోట్ల విలువైన 83 తేజస్‌లను సరఫరా చేస్తున్న హెచ్ఏఎల్

వాయుసేన ఆధునికీకరణలో భాగంగానే..

పాత మిగ్ విమానాల స్థానంలో తేజస్‌లు

అంతరిక్ష టూరిస్ట్‌గా తెలుగు తేజం!



›› ఏపీ వాసి గోపీచంద్‌కు అరుదైన గౌరవం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: భారత పైలట్, తెలుగుతేజం గోపీచంద్ తోటకూరకు అరుదైన గౌరవం దక్కింది. అంతరిక్షంలోకి వెళ్లే తొలి తెలుగు టూరిస్ట్‌గా గోపీచంద్ రికార్డు సృష్టించనున్నారు. విజయవాడలో జన్మించిన ఆయనను బ్లూ ఆరిజన్ సంస్థ న్యూషెపర్డ్ (ఎన్ఎస్)-25 మిషన్‌లో భాగంగా టూరిస్టుగా రోదసీలోకి తీసుకెళ్లనుంది. బ్లూ ఆరిజన్ వ్యోమనౌకలో పర్యాటకుడిగా అంతరిక్షంలోకి వెళ్లేందుకు గోపీచంద్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా మరో ఐదుగురు కూడా ఎంపికయ్యారు. 1984లో భారత సంతతికి చెందిన రాకేశ్ శర్మ కూడా అంతరిక్ష యానం చేసిన సంగతి తెలిసిందే. అలాగే గతంలో అంతరిక్ష యానం చేసిన కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్, రాజాచారి, శిరీష బండ్ల కూడా భారత మూలాలున్న అమెరికా పౌరులు. భారత్ తరఫున తొలి స్పేస్ టూరిస్ట్‌గా అవకాశం దక్కించుకున్న గోపీచంద్ ప్రస్తుతం అమెరికాలోనే ఉంటున్నప్పటికీ ఆయనకు భారత పాస్‌పోర్టు ఉండడం గమనార్హం. దీంతో అంతరిక్ష యానం చేయనున్న తొలి తెలుగు వాడిగా ఆయన రికార్డు నెలకొల్పనున్నారు.

విజయవాడలో పుట్టి.. పైలట్ శిక్షణ పొంది..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో పుట్టిన గోపీచంద్ (30) ఒక పారిశ్రామిక వేత్త, పైలట్. అమెరికాలోని ఎంబ్రీ రిడిల్ ఏరోనాటికల్ యూనివర్సిటీ నుంచి ఏరోనాటికల్ సైన్స్‌లో బీఎస్సీ చేసిన గోపీచంద్.. పైలట్‌గానూ శిక్షణ పొందారు. గోపీచంద్‌కు సాహస యాత్రలంటే కూడా ఇష్టం. ఇటీవలే ఆయన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. ఆయన ప్రిజర్వ్ లైఫ్ సంస్థ సహ వ్యవస్థాపకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇదొక వెల్‌నెస్ సెంటర్. దీన్ని అట్లాంటా శివారులో మిలియన్ డాలర్లతో ఏర్పాటుచేశారు. బ్లూ ఆరిజన్ సంస్థ ఆయన పేరుని అధికారికంగా ప్రకటించే వరకూ తన కుటుంబానికి సైతం ఈ విషయం తెలియదని గోపీచంద్ మీడియాకు తెలిపారు. అంతరిక్ష రంగంపై ఎనిమిదేళ్ల క్రితమే ఆసక్తి కలిగిందని ఆయన చెప్పారు.

బ్లూ ఆరిజన్ ఏడో మిషన్

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన అంతరిక్ష సంస్థ బ్లూ ఆరిజన్ ఇప్పటికే న్యూషెపర్డ్ మిషన్ పేరిట అంతరిక్ష యాత్రలకు శ్రీకారం చుట్టింది. 2021లో బెజోస్ సహా ముగ్గురు టూరిస్టులు రోదసీయాత్ర చేశారు. దాని తర్వాత చేపట్టబోయే మిషన్ ఈ ఎన్ఎస్-25. దీనికోసం గోపీచంద్ సహా మొత్తం ఆరుగురిని ఎంపిక చేశారు. వారిలో వెంచర్ క్యాపిటలిస్ట్ మాసన్ ఏంజెల్, పారిశ్రామిక వేత్తలు సిల్వియన్, కారోల్ షెల్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కెన్నెత్, ఆస్ట్రోనాట్ ఎడ్ డ్వైట్ ఉన్నారు. వీరి ప్రయాణ తేదీ ఇంకా ఖరారు కాలేదు. బ్లూ ఆరిజన్.. న్యూ షెపర్డ్ ప్రోగ్రామ్ కింద చేపడుతున్న 25వ మిషన్ ఇది. అలాగే మానవ సహితంగా చేపడుతున్న ఏడో ప్రాజెక్టు. బ్లూ ఆరిజన్ ఇప్పటివరకు 31 మందిని అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీరంతా సముద్ర మట్టానికి 80-100 కిలోమీటర్ల ఎత్తులో ఉండే కర్మన్ లైన్ వరకు వెళ్లివచ్చారు.

లోకం తీరు



ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర.. ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మంత్రి ఆతిషి ఆరోపించారు. కొద్ది రోజుల్లో ఢిల్లీలో రాష్ట్రపతి పాలన విధించనున్నారని తమకు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం ఉందని చెప్పారు. ఇటీవల జరిగిన అనేక పరిణామాలు దీనికి బలాన్నిస్తున్నాయని చెప్పారు. "కొన్ని నెలలుగా ఢిల్లీలో సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించలేదు. ప్రభుత్వ శాఖల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఢిల్లీ మంత్రులు నిర్వహించే సమావేశాలకు అధికారులు రావడం లేదు. లెఫ్టినెంట్ గవర్నర్ కేంద్ర హోం శాఖకు ఢిల్లీ ప్రభుత్వం పనితీరుపై లేఖలు రాస్తూనే ఉన్నారు" అని వివరించారు. ఆతిషి ఆరోపణపై బీజేపీ స్పందిస్తూ... 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో 62 మంది ఎమ్మెల్యేలున్న ఆప్‌ని రాష్ట్రపతి పాలన భయం వెన్నాడడం ఆశ్చర్యకరం అని ఎద్దేవా చేసింది.

ఎన్నికల్లో ప్రచారానికి బెయిల్ ఇవ్వండి: సిసోడియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఎన్నికల ప్రచారం చేయడానికి వీలుగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆప్ నాయకుడు మనీష్ సిసోడియా ఇక్కడి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఈ నెల 20లోగా సమాధానం చెప్పాలని ప్రత్యేక కోర్టు జడ్జి కావేరీ బవేజా శుక్రవారం ఈడీ, సీబీఐలకు నోటీసులు పంపించారు. తదుపరి విచారణను ఆదే రోజున చేపట్టే అవకాశం ఉంది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై గతేడాది ఫిబ్రవరిలో అరెస్టయిన సిసోడియా తిహాడ్ జైలులో ఉన్నారు.

సీఏఏపై సంఘ్, బీజేపీల మాదిరే కాంగ్రెస్: విజయన్

తిరువనంతపురం, ఏప్రిల్ 12: కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం కూడా సంఘ్ పరివార్, బీజేపీ మాదిరే ఉందని కేరళ సీఎం, సీపీఎం నేత పినరయి విజయన్ అన్నారు. సీఏఏపై కాంగ్రెస్ మౌనమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని చెప్పారు. సీఏఏని వ్యతిరేకిస్తూ తొలుత వామపక్షంతో గొంతు కలిపిన కాంగ్రెస్ కేరళ యూనిట్ నేతలు ఆ తర్వాత ఆ పార్టీ అధిష్ఠానం సూచనతో తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని ఆరోపించారు. సీఏఏపై రాహుల్‌గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. తన ఎన్నికల ప్రణాళికలో కూడా సీఏఏపై వైఖరేంటో కాంగ్రెస్ వెల్లడించలేదని ఆయన గుర్తు చేశారు.

ఇజ్రాయెల్, ఇరాన్‌లకు ప్రయాణం వద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాలకు ప్రయాణం చేయవద్దని భారత పౌరులకు సూచించింది. భద్రతా పరిస్థితుల దృష్ట్యా తదుపరి ప్రకటన వచ్చే వరకు ఈ సూచనను పాటించాలని అడ్వైజరీలో పేర్కొంది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ప్రస్తుతం నివసిస్తున్న భారతీయులు అక్కడి భారతీయ రాయబార కార్యాలయాలతో టచ్‌లో ఉండాలని, అలాగే తమ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొంది. పౌరులు తమ భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని, బయటకు వెళ్లడాన్ని బాగా తగ్గించుకోవాలని తెలిపింది. కాగా ఇరాన్, ఇజ్రాయెల్, లెబనాన్, పాలస్తీనాకు ప్రయాణించవద్దని తమ పౌరులను ఫ్రెంచ్ ప్రభుత్వం కూడా హెచ్చరించింది.

కశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదా

అక్కడ అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో సమయం లేదు.. రామమందిరం ఎప్పటికీ ఎన్నికల అంశం కాబోదు

›› ఇండియా కూటమి నేతలది మొఘలుల మనస్తత్వం: మోదీ



ఉధంపూర్, ఏప్రిల్ 12: జమ్ము కశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో సమయం లేదని చెప్పారు. శుక్రవారం జమ్ము కశ్మీర్‌లోని ఉధంపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఉగ్రవాదం, రాళ్ల రువ్వడం, సీమాంతర కాల్పుల భయం లేకుండా లోక్‌సభ ఎన్నికలు కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని తెలిపారు. 'గత పదేళ్లలో ఈ ప్రాంతం పూర్తిగా మారిపోయింది. ఇక్కడి ప్రజల దీర్ఘకాలిక బాధలకు ముగింపు పలుకుతామని ఇచ్చిన హామీని నెరవేర్చా' అని మోదీ చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని దమ్ముంటే తిరిగి తీసుకురావాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలకు ఆయన సవాల్ విసిరారు. ప్రజల మనోభావాలంటే ఇండియా కూటమి సభ్యులకు లెక్కలేదు' అని ఆర్జేడీ నేత తేజస్విని ఉద్దేశించి మోదీ ధ్వజమెత్తారు. బిహార్‌లో వసంత నవరాత్రుల వేళ తేజస్వీ మాంసాహారం తినడం, ఆ వీడియోను సోషల్ మీడియాలో పంచుకోవడంపై వివాదం రేగిన నేపథ్యంలో మోదీ ఇలా స్పందించారు. 'తమకు నచ్చినది తినకుండా చట్టం, మోదీ ఎవరినీ అడ్డుకోరు. కానీ వారి ఉద్దేశం వేరు. మొఘలులు దేశంపై దాడి చేసినప్పుడు వారు రాజులను ఓడించడంతోనే సంతృప్తి చెందలేదు. ఇక్కడి ఆలయాలను ధ్వంసం చేస్తే గానీ వారికి తృప్తి కలగలేదు. ఆ చర్యను వారు ఆస్వాదించారు. ఆదేవిధంగా ఇలాంటి వీడియోలు పోస్టు చేయడం ద్వారా వారు మొఘలుల కాలం నాటి ఆలోచనలను ప్రదర్శిస్తున్నారు' అని మోదీ ఆరోపించారు. ప్రజలు తల్చుకుంటే రాకుమారులు సైతం తమ సింహాసనాలను వదిలిపెట్టాల్సి వస్తుందని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. అయోధ్యలో రామమందిరం బీజేపీకి ఎన్నికల అస్త్రంగా మారిందని ఇండియా కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలపై మోదీ మండిపడ్డారు. ఇది దేశ ప్రజల విశ్వాసానికి సంబంధించిన అంశమన్నారు. అది ఎప్పుడూ ఎన్నికల అంశం కాదని, ఇకపై కూడా కాబోదని చెప్పారు. బీజేపీ పుట్టక ముందే రామమందిర ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

అంబేద్కరే వచ్చినా..

రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను రాజస్థాన్‌లోని బార్మర్‌లో నిర్వహించిన ర్యాలీలో మోదీ తోసిపుచ్చారు. బీజేపీ ప్రభుత్వానికి దేశ రాజ్యాంగమే సర్వస్వం అని, ఇప్పుడు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్వయంగా వచ్చినా కూడా దానిని రద్దు చేయలేరని స్పష్టం చేశారు. దేశంలో ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని, ఇప్పుడు రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని మోదీని దూషిస్తోందని మండిపడ్డారు.

సమస్యలపై మాట్లాడరు: తేజస్వి

ఉధంపూర్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై తేజస్వీ యాదవ్ స్పందించారు. ప్రధాన సమస్యలపై మాట్లాడటానికి బదులు... ప్రజలు ఏం తింటున్నారు, ఏ దుస్తులు ధరిస్తున్నారనే విషయాలపైనే బీజేపీ దృష్టి పెడుతోందని ఆరోపించారు. బిహార్‌లో సమస్యలపైనా, వలసలను ఎలా ఆపుతారో, అధికారంలోకి వస్తే రాబోయే ఐదేళ్లలో ఏం చేస్తారో అనే దానిపై మాత్రం ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదన్నారు. పదేళ్లుగా కేంద్రంలో, 17ఏళ్లుగా బిహార్‌లో వారు చేసిందేమీ లేదని మండిపడ్డారు.

మోదీ... రాముడిపై ప్రమాణం చేస్తారా?

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి పైకి కనిపించని ప్రజా మద్దతు ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఆ భయంతోనే ఎన్నికలలో మోదీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని ఆయన తెలిపారు. తానిచ్చిన హామీల మేరకు దేశ ప్రజల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ చేశామని, నల్లధనాన్ని వెనక్కి తెచ్చామని, రైతుల ఆదాయం రెట్టింపు చేశామని, కనీస మద్దతు ధర అమలు చేశామని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించామని అయోధ్య రామునిపై ప్రధాని మోదీ ప్రమాణం చేయగలరా అని ఖర్గే సవాలు విసిరారు. ధరల భారం మోపి ప్రజలను పీడిస్తూ రామనామ స్మరణ చేస్తున్నారంటూ ప్రధానిపై ఆయన ధ్వజమెత్తారు. కలబుర్గిలో తన అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి నామినేషన్ సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. ఇతర పార్టీల్లో ఉన్న అవినీతి నేతలు బీజేపీలోకి మారగానే ఎలా పునీతులై పోతున్నారని ఖర్గే ఎద్దేవా చేశారు. ఈడీ, ఐటీ, సీబీఐలతో అందరినీ మోదీ బెదిరిస్తున్నారంటూ ఆయన ధ్వజమెత్తారు.

సిద్ధాంత పోరులో 'ఇండియా'దే విజయం

›› తిరునల్వేలి ప్రచార సభలో రాహుల్



చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మతతత్వవాద పార్టీలకు, లౌకిక వాద పార్టీలకు మధ్య సైద్ధాంతికపరమైన పోరే ఈ లోక్‌సభ ఎన్నికలని, ఇందులో ఇండియా కూటమి ఘనవిజయం సాధిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. పెరియార్, సామాజిక న్యాయానికి - ప్రధాని మోదీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు మధ్య పోరాటంగా ఈ ఎన్నికలను రాహుల్ అభివర్ణించారు. తిరునల్వేలి పార్లమెంటు నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటు చేసిన సభలో రాహుల్ ప్రసంగించారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి శ్రీమంతులకు దేశంలోని ప్రధాన హార్బర్లు, విండ్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు అప్పగించడం వల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయారని రాహుల్ తెలిపారు. రైతుల రుణాలను మాఫీ చేయని మోదీ, తనకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు సంస్థల యజమానులకు సంబంధించిన రూ.14 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని ఆరోపించారు. జీఎస్టీ వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు మూతపడ్డాయని వ్యాఖ్యానించారు. సీబీఐ, ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ తన జేబు సంస్థలుగా మార్చి ప్రత్యర్థుల గొంతు నొక్కేస్తోందన్నారు. నీట్ పరీక్ష పేదలకు వ్యతిరేకమైనదని, ఈ వ్యవహారాన్ని ఆయా రాష్ట్రప్రభుత్వాల నిర్ణయానికే వదిలేయడమే ఇండియా కూటమి లక్ష్యమన్నారు.

కాశీలో ఖాకీ బదులు కుర్తా-ధోతీ



వారాణసీ, ఏప్రిల్ 12: ఉత్తరప్రదేశ్‌లోని కాశీ విశ్వనాథ ఆలయం వద్ద విధులు నిర్వర్తించే పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త డ్రెస్ కోడ్ ప్రకటించింది. ఇకపై, పోలీసులు ఖాకీ దుస్తుల్లో కాకుండా సంప్రదాయ వస్త్రధారణలో ఆలయం వద్ద విధులు నిర్వర్తిస్తారని వెల్లడించింది. వారాణసీ పోలీసు కమిషనర్ ఇందుకు సంబంధించిన ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో పోలీసులు ధోతీ-కుర్తా ధరించి మెడలో రుద్రాక్ష మాలలు వేసుకుని ఆలయం వద్ద విధులు నిర్వర్తించారు. ఈ వస్త్రధారణలో పోలీసులు పూజారుల్లా ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. కాగా, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు అర్చకుల్లా దుస్తులు ధరించి విధులకు హాజరవ్వడం ఏ పోలీసు మాన్యువల్ ప్రకారం సబబు? అని ప్రశ్నించారు. పోలీసు డ్రెస్ కోడ్‌పై ఈ ఉత్తర్వులు ఇచ్చిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల విషయంలో తీసుకున్న ఈ నిర్ణయాన్ని దొంగలు ఎవరైనా అవకాశంగా తీసుకుని భక్తులను మోసం చేస్తే ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందన్నారు. కాగా, డ్రెస్ కోడ్ విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని వారాణసీ పోలీసు కమిషనర్ మోహిత్ అగర్వాల్ సమర్థించుకున్నారు. ఆలయంలో విధులు నిర్వర్తించే పోలీసులు అర్చకుల్లా కనిపిస్తే భక్తులు నుంచి తమకు మరింత సహకారం లభిస్తుందనే డ్రెస్‌కోడ్ మార్చామని పేర్కొన్నారు.

హెచ్‌ఏఎల్‌కు 65 వేల కోట్ల కాంట్రాక్టు!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ప్రభుత్వరంగ రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు రక్షణశాఖ రూ.65 వేల కోట్ల విలువైన భారీ టెండర్‌ను విడుదల చేసింది. స్వదేశంలో తయారైన 97 'తేజస్ ఎల్‌సీఏ మార్క్ 1 ఏ యుద్ధ విమానాల' కోసం ఈ టెండర్‌ను ఇచ్చింది. హెచ్ఏఎల్ చరిత్రలోనే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అతిపెద్ద కాంట్రాక్టు ఇది. దీనిపై స్పందించటానికి హెచ్ఏఎల్‌కు మూడు నెలల సమయం ఉంది. రూ.48 వేల కోట్ల విలువైన 2021 నాటి ఒప్పందం ప్రకారం హెచ్ఏఎల్ ఇప్పటికే వాయుసేనకు 83 తేజస్ మార్క్-1 ఏ విమానాలను సరఫరా చేస్తోంది. ఈ మేరకు తాజాగా తయారైన బ్యాచ్‌లోంచి ఒక మార్క్ ఏ 1ను ఇటీవలే బెంగళూరులో 18 నిమిషాలపాటు గగనతలంలో తిప్పారు. ఈ కొత్త విమానాలను వాయుసేనకు మరో మూడు నాలుగు నెలల్లో అందించనున్నారు. వాస్తవానికి తేజస్ విమానాల సరఫరా 2016లో మొదలైంది. అయితే, అప్పట్లో తేజస్ మార్క్-1 విమానాలను హెచ్ఏఎల్ అందించింది. వాయుసేనకు 40 విమానాలను సరఫరా చేసింది. ఈ మార్క్ 1 విమానాల్లో దాదాపు 40 చిన్నా, పెద్ద మార్పులు చేసి మార్క్ 1 ఏ విమానాలను రూపొందించారు. రక్షణశాఖ తాజాగా ఇచ్చిన టెండర్ ద్వారా.. హెచ్ఏఎల్ ఉత్పాదక సామర్థ్యం ఇప్పుడున్న ఏడాదికి 10-12 యుద్ధవిమానాల నుంచి 24 విమానాలకు పెరిగే అవకాశం ఉంది. దీనిపై ఆ సంస్థ అధినేత సీబీ అనంత కృష్ణన్ హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బెంగళూరు, నాసిక్‌లలో ఉన్న తమ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 2025-26 నాటికి ఏటా 24 విమానాలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, దానిని సాధించిన తర్వాత ఏటా 30 యుద్ధ విమానాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంటామన్నారు. వాయుసేన ఆధునికీకరణలో భాగంగా పాతబడిన మిగ్ విమానాలను తొలగిస్తూ.. వాటి స్థానాన్ని అత్యాధునిక తేజస్‌లతో భర్తీ చేస్తున్నారు.

ఆస్తులు కాదు.. వృద్ధుల సంరక్షణే లక్ష్యం

›› సీనియర్ సిటిజన్స్ యాక్ట్‌పై బాంబే హైకోర్టు స్పష్టీకరణ

ముంబై, ఏప్రిల్ 12: పిల్లలకు తాము బహుమతిగా ఇచ్చిన ఇళ్లల్లో వృద్ధ తల్లితండ్రులు నివసించేలా చూడడమే సీనియర్ సిటిజన్స్ యాక్ట్ ప్రధాన ఉద్దేశమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. అంతేతప్ప తల్లిదండ్రులు ఇచ్చిన గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయించడం ఈ చట్టం అసలు లక్ష్యం కాదని తెలిపింది. దీన్ని పరిగణనలోకి తీసుకొని ట్రైబ్యునళ్లు నిర్ణయాలను వెలువరించాల్సి ఉంటుందని పేర్కొంది. ముంబైకి చెందిన వృద్ధుడిని సక్రమంగా చూసుకోవడం లేదన్న కారణంతో ఆయన కుమారుడ్ని శిక్షిస్తూ మెయింటనెన్స్ ట్రైబ్యునల్ ఫర్ సీనియర్ సిటిజన్స్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కారణంతో ఆ కుమారునికి తండ్రి ఇచ్చిన మూడు గిఫ్ట్ డీడ్‌లను ట్రైబ్యునల్ రద్దు చేసింది. తండ్రి సంపాదించిన ఇల్లును ఖాళీ చేయాలని కూడా ఆదేశించింది. హైకోర్టు మాత్రం.. ఇలాంటి సందర్భాల్లో వృద్ధ తండ్రి సంరక్షణే ప్రధాన అంశంగా ఉండాలి తప్ప, గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేయించడం కాదంటూ ట్రైబ్యునల్ ఆదేశాలను పక్కన పెట్టింది. అదే సమయంలో తండ్రి విడిగా నివసించవచ్చని, ఆయన పోషణకు కుమారుడు భృతి చెల్లించాల్సి ఉంటుందని ఆదేశించారు.

పెట్స్ తప్పిపోతే ఇక 'స్విగ్గీ' వెతికిపెడుతుంది!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పెట్ లవర్స్ కోసం ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ.. 'స్విగ్గీ పాలీస్' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. తప్పిపోయిన పెంపుడు కుక్కలు, పిల్లులను వెతికి తెచ్చివ్వడమే ఈ యాప్ ఉద్దేశం. వినియోగదారులు తప్పిపోయిన తమ పెంపుడు కుక్కలు, పిల్లుల ఫొటోలను 'స్విగ్గీ పాలీస్' యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. స్విగ్గీలో దాదాపు 3.5 లక్షల డెలివరీ బాయ్స్ పనిచేస్తుండటంతో స్థానికంగా తిరుగుతుండే బాయ్స్‌కు ఆ మెసేజ్‌లు వెళతాయి. ఫుడ్ ఆర్డర్ల డెలివరీ కోసం వివిధ మార్గాల్లో బాయ్స్ తిరుగుతున్నప్పుడు ఆ ఫొటో పోలికలతో పెంపుడు జీవాలు కనిపిస్తే వారు స్విగ్గీకి చెందిన ప్రత్యేక బృందానికి లొకేషన్‌తో కూడిన సమాచారం చేరవేస్తారు. తర్వాత సదరు ప్రత్యేక బృందం యజమానులను అప్రమత్తం చేస్తుంది.

పాక్‌లో మైనార్టీ మహిళలకు రక్షణ కరవు: ఐరాస

జెనీవా, ఏప్రిల్ 12: పాకిస్థాన్‌లో మైనార్టీ వర్గాలకు చెందిన హిందూ, క్రైస్తవ మహిళలకు రక్షణ కరవయిందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. వారికి భద్రత కల్పిస్తామంటూ పాక్ చేసుకున్న అంతర్జాతీయ ఒప్పందాలను అమలు చేయాలని డిమాండు చేశారు. నిపుణులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఐరాస మానవ హక్కుల హైకమిషన్ కార్యాలయం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. హిందూ, క్రైస్తవ బాలికలను బలవంతంగా అపహరించి వివాహాలు చేసుకుంటున్నారని, మత మార్పిడి చేస్తున్నారని పేర్కొంది.

అమెరికాలో భారత విద్యార్థుల మరణాలపై విచారణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: అమెరికాలో ఇద్దరు భారత విద్యార్థుల మృతిపై విచారణ జరుగుతున్నట్లు భారత విదేశాంగ శాఖ శుక్రవారం వెల్లడించింది. సంబంధిత అధికారుల దృష్టికి భారత విద్యార్థుల మృతి విషయం తీసుకువెళుతున్నట్లు తెలిపింది. భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌దీప్ జైశ్వాల్ శుక్రవారం మాట్లాడుతూ... అమెరికాలో దురదృష్టకర పరిస్థితుల్లో జనవరి నుంచి 10 మంది భారత విద్యార్థులు మృతి చెందారని చెప్పారు. వారి మరణాల వెనుక అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. అమెరికాలో వివేక్ సైని అనే విద్యార్థి ఒక సంచార వ్యక్తి చేతిలో హత్యకు గురయ్యాడని, మరో విద్యార్థి కాల్పుల్లో మృతి చెందాడని చెప్పారు. ఈ రెండు ఘటనలపై విచారణ జరుగుతోందన్నారు. క్లీవ్‌లాండ్ నగరంలో గత నెల నుంచి కనిపించకుండాపోయిన మహమ్మద్ అబ్దుల్ అరాఫత్(25) మృతదేహం ఏప్రిల్ 9న లభించింది. హైదరాబాద్‌లోని నాచారానికి చెందిన ఇతడు గత ఏడాది క్లీవ్‌లాండ్ వర్సిటీలో మాస్టర్స్ చేసేందుకు వెళ్లాడు. అలాగే గద్దె ఉమా సత్యసాయి అనే తెలుగు విద్యార్థి క్లీవ్‌లాండ్‌లోని ఓ కాలేజీలో ఉన్నత విద్య కోసం వెళ్లి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు.

57 లక్షల ఎకరాల్లో తగ్గిన పచ్చదనం!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: దేశంలో పచ్చదనం క్రమేపీ తగ్గుతోందని గ్లోబల్ ఫారెస్ట్ వాచ్ (జీఎఫ్‌డబ్ల్యూ) ఆందోళన వ్యక్తం చేసింది. 2000 సంవత్సరం నుంచి 57 లక్షల ఎకరాల భూభాగంలో పచ్చదనాన్ని కోల్పోయినట్లు.. ఇది 6% తగ్గుదలకు సమానమని ఆ సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. 2001-2023 మధ్యకాలంలో పచ్చదనం కోల్పోయిన భూభాగంలో 60%.. ఈశాన్య రాష్ట్రాలైన అస్సోం, మిజోరం, అరుణాచల్, నాగాలాండ్, మణిపూర్‌లోనే ఉందని వివరించింది. 2002-23 మధ్య 10.23 లక్షల ఎకరాల్లో అడవులను కూడా కోల్పోయినట్లు తెలిపింది. పచ్చదనం కోల్పోవడమంటే అటవీ నిర్మూలన కాదని.. మానవులు, అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు తదితర కారణాలతో చెట్లను నష్టపోవడమని పేర్కొంది. 2013-23 మధ్యకాలం సహజ అడవుల్లోనే 95% పచ్చదనం కోల్పోయినట్లు నివేదికలో స్పష్టం చేసింది.

రామేశ్వరం కేఫ్ బాంబు పేలుళ్ల కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

బెంగాల్‌లో తలదాచుకున్న నిందితులు

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో సంచలనం కలిగించిన రామేశ్వరం కేఫ్ బాంబు పేలుళ్ల కేసులో సూత్రధారి సహా ఇద్దరు ప్రధాన నిందితులను ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు. ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న ముసావిర్ హుసేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహాను పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ అధికారులు శుక్రవారం ప్రకటించారు. ఐఈడీని షాజిబ్ కేఫ్‌లో పెట్టగా.. ఈ పేలుడు ప్రణాళిక, అమలు వెనుక ప్రధాన సూత్రధారి తాహా అని ఎన్ఐఏ అధికారులు తెలిపారు. కేఫ్‌లో బాంబు పేలుళ్ల తర్వాత పరారీలో ఉన్న నిందితులను గుర్తించడంలో ఎన్ఐఏ విజయవంతమైంది. కోల్‌కతా సమీపంలో తప్పుడు గుర్తింపు పత్రాలతో అజ్ఞాతంలో ఉన్న వారిని ఈ నెల 12న అదుపులోకి తీసుకున్నాం' అని ఎన్ఐఏ అధికారి ఒకరు వెల్లడించారు. ఎన్ఐఏ, కేంద్ర నిఘా సంస్థలు, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, కేరళ పోలీసు ఏజెన్సీల సహకారం, సమన్వయంతో వారిని పట్టుకున్నామని ఆయన చెప్పారు. కాగా.. షాజిబ్, అహ్మద్ తాహాలకు సాయం చేసిన ముజామిల్ షరీఫ్ అనే వ్యక్తిని ఇప్పటికే అరెస్టు చేశారు. పేలుళ్లు జరిగిన తర్వాత పరారీలో ఉన్న షాజిబ్, తాహాలను గుర్తించేందుకు ఎన్ఐఏ అధికారులు దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో గాలించారు. తమిళనాడు, ఉత్తరప్రదేశ్, తెలంగాణతోపాటు 18 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో ఇద్దరినీ అరెస్టు చేసి కోల్‌కతా ఎన్ఐఏ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని బెంగళూరుకు తరలించారు. ఈ ఏడాది మార్చి 1న బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటన జరిగింది. 8 మంది గాయపడ్డారు. దీనిపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది.



నిందితుడిని కోర్టులోకి తీసుకువెళ్తున్న దృశ్యం

ఉగ్రవాదులకు బెంగాల్ స్థావరం: బీజేపీ

బాంబు పేలుళ్ల కేసులో ఇద్దరు నిందితులు పోలీసులకు చిక్కడం పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ దుమారానికి కారణమైంది. మమత బెనర్జీ నేతృత్వంలోని బెంగాల్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఉగ్రవాదులకు సురక్షిత స్థావరంగా మార్చిందని అక్కడి ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. దీనిపై టీఎంసీ నేతలు, పశ్చిమ బెంగాల్ పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంగాల్ పోలీసుల సాయంతోనే ఎన్ఐఏ నిందితులను అరెస్టు చేసిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని టీఎంసీ నేత కునాల్ ఘోష్ బదులిచ్చారు. ఈ కేసులో నిందితులను గుర్తించేందుకు ముసావిర్ షాజిబ్ ధరించిన టోపీ సహాయపడింది. పేలుళ్లు జరిగిన తర్వాత ఎన్ఐఏ ఆ క్యాప్‌ను స్వాధీనం చేసుకుంది. చెన్నైలోని ఒక మాల్‌లో షాజిబ్, తాహా ఈ క్యాప్‌ను కొనుగోలు చేసినట్లు తొలుత గుర్తించారు. అప్పుడు రికార్డయిన సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా తాజాగా నిందితులను గుర్తించారు.

భారత జీడీపీ వృద్ధి రేటుకు బ్రేక్

›› ఈ ఏడాది 6.1% మించదు: మూడీస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: మూడీస్ అనలిటిక్స్ సంస్థకు భారత ఆర్థిక వ్యవస్థపై నమ్మకం సడలుతోంది. 2023లో 7.7 శాతంగా నమోదైన భారత జీడీపీ వృద్ధి రేటు.. 2024లో 6.1 శాతం మించదని స్పష్టం చేసింది. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ)తో పాటు ఫిచ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలన్నీ ఈ ఏడాది కూడా భారత జీడీపీ వృద్ధి రేటు 6.5 నుంచి 7.5 శాతం మధ్య ఉంటుందని ప్రకటించాయి. ఆర్‌బీఐ కూడా ఈ ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి తగ్గదని ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడీస్ అనలిటిక్స్ సంస్థ ఒక్కటే ఈ ఏడాది భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.1 శాతానికి కుదించడం విశేషం. కాగా, భారత్‌లో ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగానే ఉన్న విషయాన్ని మూడీస్ గుర్తు చేసింది. చైనాలోనూ ఇదే పరిస్థితి అని మూడీస్ తెలిపింది.

దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ డైరెక్టర్లకు హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్ఎల్), కంపెనీ డైరెక్టర్లు వెంకట్రామ్ రెడ్డి, వినాయక్ రవిరెడ్డిలకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. చెల్లని చెక్కులు ఇచ్చి ఐసీఐసీఐ, యాక్సిస్, కెనరా బ్యాంకులను మోసం చేసిన వ్యవహారానికి సంబంధించిన క్రిమినల్ కేసులు కొట్టేయాలని పేర్కొంటూ వారు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. డీసీహెచ్ఎల్ ఆస్తులను తనఖా పెట్టి పిటిషనర్లు పలు బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. ఆ రుణాల చెల్లింపుల కోసం వివిధ బ్యాంకులకు పిటిషనర్లు జారీచేసిన చెక్కులు రిటర్న్ కావడంతో ఆయా బ్యాంకులు పలు మేజిస్ట్రేట్ కోర్టుల్లో ఫిర్యాదులు చేశాయి. ఈ కేసులను కొట్టేయాలని పేర్కొంటూ వెంకట్రామ్ రెడ్డి, వినాయక్ రవి రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ (సీఐఆర్‌పీ) కింద ఈ వివాదం ఎన్‌సీఎల్‌టీలో పరిష్కారమైనందున ఈ కేసులను కొట్టేయాలన్న పిటిషనర్ల వాదనలను హైకోర్టు తిరస్కరించింది.

భద్రాద్రి రామయ్య ముత్యాల తలంబ్రాలు @ రూ.30

» దేవస్థానం ఆధ్వర్యంలో విక్రయం

భద్రాచలం, ఏప్రిల్ 12: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ ధర రూ.30గా ఉండనుంది. కల్యాణమనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు దేవస్థానం ఆధ్వర్యంలో విక్రయించనున్నారు. గత ఏడాది ఇదే ధరకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు విక్రయించగా ఈసారి ముత్యాల ధరలు పెరగడంతో ఒక ప్యాకెట్ ధర రూ.50కి పెంచాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలను దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుకు పంపారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ముత్యాల తలంబ్రాలు ప్యాకెట్ ధర పెంచడానికి సాంకేతిక అవరోధాలు తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈసారి ఏప్రిల్, మే నెల వరకు ముత్యాల తలంబ్రాల ప్యాకెట్ ధర రూ.30 వరకు ఉండే అవకాశం ఉంది. జూన్‌లో ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్యాకెట్ ధర రూ.50 అయ్యే అవకాశం ఉందని తెలిసింది.

కేసీఆర్ ఫాం హౌస్ వద్ద ధర్నా

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని వేడుకోలు


కేసీఆర్ ఫాంహౌస్ వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

మర్కుక్, ఏప్రిల్ 12: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. అధికారులు లక్కీ డ్రా పద్ధతి ద్వారా 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ ఇంతవరకూ ఇళ్ల పట్టాలు కానీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కానీ ఇవ్వలేదని సుమారు 50 మంది బాధితులు కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కేసీఆర్‌ను కలిసేందుకు వెళ్లగా అనుమతి లేదనడంతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్కీడ్రా పద్ధతి ద్వారా ఇళ్లను కేటాయించి ఇంతవరకూ తమకు ఇళ్లు కానీ, ఇళ్ల పట్టాలు కానీ ఇవ్వలేదన్నారు. ఇళ్లకోసం అధికారుల చుట్టూ తిరిగి ఓపిక నశించిందని, మాకు న్యాయం కావాలని కేసీఆర్‌ను కలవడానికి ఫాంహౌస్‌కు వస్తే అనుమతి లేదనడం ఏంటని, గజ్వేల్ ప్రజలకు కలవడానికి పర్మిషన్ తీసుకోవాలా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యే కేసీఆర్ ఇంతవరకు గజ్వేల్ ప్రజలను కలవలేదని, ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించి తమకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, లేకుంటే ఎక్కడివరకైనా వెళ్లేందుకు సిద్ధమని లబ్ధిదారులు స్పష్టం చేశారు.

జూలై 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్(ఏఐ) సదస్సు జూలై 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. అంతర్జాతీయంగా 150 ప్రసిద్ధ ఏఐ కంపెనీల ప్రతినిధులు దీనికి హాజరుకానున్నారు. రాష్ట్రంలో ఏఐ సిటీ ఏర్పాటు కోసం 200 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఏఐ టెక్నాలజీలో ప్రపంచంతో పోటీ పడేలా హైదరాబాద్‌ను తయారుచేస్తామని ప్రభుత్వం పేర్కొంది.

తెలంగాణలో వ్యాపారం చేయలేవ్

(మొదటి పేజీ తరువాయి)

శరత్‌చంద్రారెడ్డి డైరెక్టర్‌గా ఉన్న అరబిందో ఫార్మా గ్రూప్‌కు సంబంధించినవేనని సీబీఐ వెల్లడించింది. ఈ ఐదు జోన్లు తనకు దక్కినందుకు బదులుగా కవిత నుంచి రూ.14 కోట్ల విలువైన వ్యవసాయ భూమిని శరత్ చంద్రారెడ్డి కొనుగోలు చేసినట్టుగా ఒప్పందం జరిగినట్లు తెలిపింది. మహబూబ్‌నగర్‌లో ఉన్న ఈ భూమిని కొనుగోలు చేసేందుకు సేల్ అగ్రిమెంట్ కుదుర్చుకోవాల్సిందిగా శరత్‌చంద్రారెడ్డిపై కవిత ఒత్తిడి చేశారని పేర్కొంది. ఆ భూమిని కొనడం తనకు ఇష్టంలేదని, దాని విలువ ఏమిటో కూడా తనకు తెలియదని శరత్ చంద్రారెడ్డి చెప్పినప్పటికీ.. వెంటనే రూ.14 కోట్లు చెల్లించాలని ఆమె డిమాండ్ చేసినట్టు వెల్లడించింది. దీంతో అరబిందో గ్రూపునకు చెందిన మహిరా వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఈ మొత్తం చెల్లించి భూమి కొనుగోలు చేయక తప్పలేదని శరత్ చంద్రారెడ్డి చెప్పినట్లు సీబీఐ వివరించింది. ఇందులో రూ.7 కోట్లు 2021 జూలైలో, మరో రూ.7 కోట్లు నవంబరులో చెల్లించినట్లు ఆధారాలు లభించాయని తెలిపింది. అయితే తర్వాత ఆ భూమి బదలాయింపు జరగలేదని వెల్లడించింది. మరోవైపు శరత్ చంద్రారెడ్డికి చెందిన ఐదు రిటైల్ జోన్ల కోసం ఒక్కో జోన్‌కు రూ.5 కోట్ల చొప్పున రూ.25 కోట్లు చెల్లించాలని కూడా కవిత ఆయనకు తెలిపారని సీబీఐ పేర్కొంది. ఒక దశలో ఈ మొత్తం చెల్లించేందుకు శరత్ చంద్రారెడ్డి విముఖత వ్యక్తం చేశారని, అయితే తాను చెప్పినట్టు వినకపోతే తెలంగాణలో వ్యాపారం ఎలా చేస్తావని, ఢిల్లీలో కూడా వ్యాపారానికి నష్టం చేస్తానని ఆయనను కవిత బెదిరించినట్టు సీబీఐ వెల్లడించింది. అంతేకాకుండా కవితకు చెందిన తెలంగాణ జాగృతి సంస్థకు కూడా సీఎస్ఆర్ కింద శరత్ చంద్రారెడ్డి రూ.80 లక్షలు బదిలీ చేశారని తెలిపింది.

కవితకు వ్యతిరేకంగా అనేక సాక్ష్యాలు..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు వ్యతిరేకంగా అనేక సాక్ష్యాధారాలు వెల్లడయ్యాయని సీబీఐ పేర్కొంది. కవితను ఈ సాక్ష్యాధారాల గురించి జైలుకు వెళ్లి ప్రశ్నించామని, అయితే ఆమె సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వనందువల్లే తమ కస్టడీలో విచారణ చేయాలని నిర్ణయించామని వివరించింది. దర్యాప్తులో భాగంగా తాము సేకరించిన మౌఖిక డాక్యుమెంటరీ సాక్ష్యాలకు భిన్నంగా ఆమె జవాబులు ఉన్నాయని, ఆమె వాస్తవాలను వెల్లడించకుండా తప్పించుకున్నారని తెలిపింది. ఆమెకు మాత్రమే తెలిసిన ఆధారాలకు సంబంధించి సాక్ష్యాలను చూపించినా నిజాలు దాచేందుకు యత్నించారని పేర్కొంది. ఈ కేసు సరైన విధంగా ముగింపునకు రావాలంటే కవిత నోటి నుంచి నిజాలు రావాల్సి ఉందని తెలిపింది. తొలుత 2024 ఫిబ్రవరి 26నే తాము 41ఏ సీఆర్పీసీ కింద నోటీసు ఇచ్చినప్పటికీ ఆమె విచారణకు హాజరు కాలేదని సీబీఐ గుర్తు చేసింది. అందుకే కస్టడీకి తీసుకుని సాక్ష్యాలను చూపించి ఇంటరాగేట్ చేస్తే తప్ప.. ఆమె ద్వారా మొత్తం కుట్ర ఎంత విస్తృతంగా జరిగిందో, ఎక్కడెక్కడికి అక్రమ నిధుల మళ్లింపు జరిగిందో, ఇతర నిందితులు, ప్రభుత్వ అధికారుల పాత్ర ఎంతో తేలే అవకాశాలున్నాయని పేర్కొంది. కనీసం ఐదురోజుల కస్టడీకి ఇవ్వాలని కోరింది.

అనేక పత్రాలు లభించాయి..

నిందితుడు బుచ్చిబాబు గోరంట్ల మొబైల్ ఫోన్లలో లభించిన వాట్సాప్ సంభాషణలు, సాక్షులు, అప్రూవర్ల స్టేట్‌మెంట్ల తర్వాత కవిత పాత్ర బయటకు వచ్చిందని సీబీఐ తెలిపింది. భూమి కుంభకోణం పేరుతో డబ్బు మళ్లింపునకు సంబంధించిన పత్రాలు కూడా తమకు లభించాయని వెల్లడించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి విజయ్ నాయర్, ఇతర నిందితుల ద్వారా రూ.100కోట్లు మళ్లించడం, ఆ డబ్బును ఇతరుల నుంచి వసూలు చేయడంలో కవిత పోషించిన పాత్ర వెల్లడైందని తెలిపింది. సీబీఐ తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణాదికి చెందిన మద్యం వ్యాపారి మాగుంట శ్రీనివాసులురెడ్డి 2021 మార్చి 16న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. ఢిల్లీలో మద్యం వ్యాపారం చేయడానికి తాను సుముఖంగా ఉన్నానని చెప్పారు. ఈ విషయంలో ఎమ్మెల్సీ కవిత మిమ్మల్ని సంప్రదిస్తారని, తమ పార్టీకి కావాల్సిన నిధులు ఎలా మళ్లించాలో కూడా చెబుతారని కేజ్రీవాల్ ఆయనకు చెప్పారు. ఆ తర్వాత శ్రీనివాసులురెడ్డి హైదరాబాద్‌లో 2021 మార్చి 20న కవితను ఆమె నివాసంలో కలుసుకున్నారు. దీంతో.. తాము కేజ్రీవాల్‌తో మాట్లాడుతున్నామని, ఆయన బృందం ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందిస్తోందని కవిత తెలిపారు. తనతో, బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ పిళ్లైతో మాట్లాడుతూ ఉండాలని సూచించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్లు ముడుపులుగా చెల్లించవలసి ఉందని, మద్యం వ్యాపారంలో భాగస్వామ్యం కావాలంటే ముందుగా రూ.50 కోట్లు చెల్లించాలని అన్నారు. ఆ తర్వాత కవిత సీఏ బుచ్చిబాబు 2021 మార్చి 21న శ్రీనివాసులురెడ్డిని కలుసుకుని రూ.50 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత శ్రీనివాసులురెడ్డి తన కుమారుడి ద్వారా కవిత సహచరులు బుచ్చిబాబు, అభిషేక్ బోయినపల్లికి రూ.25 కోట్లు చెల్లించారు. దాంతో ఆయన కుమారుడికి ఇండో స్పిరిట్ హోల్‌సేల్ వ్యాపారంలో రూ.32.5 శాతం వాటాను ఇచ్చారు. మరోవైపు పెర్నాడ్ రికార్డు ఇండియా ద్వారా ఇండో స్పిరిట్‌కు నిబంధనలకు భిన్నంగా హోల్‌సేల్ వ్యాపారం లభించేలా విజయ్ నాయర్ కీలకపాత్ర పోషించారు. అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఒత్తిడి మేరకు ఇండో స్పిరిట్‌కు ఈ అక్రమ వ్యాపారం కేటాయించారని సీబీఐ తెల్పింది.

> **ఇండో స్పిరిట్‌కు చెల్లించాల్సిన డబ్బు.. కవితకు!**
>
> 2022 ఆగస్టు 31న ఢిల్లీ మద్యం విధానాన్ని ఉపసంహరించుకున్నప్పుడు ఇండో స్పిరిట్‌కు రూ.60 కోట్లు చెల్లించాల్సి ఉందని సీబీఐ పేర్కొంది. అయితే ఆ డబ్బును ఆ సంస్థకు కాకుండా కవితకే చెల్లించాలని శరత్ చంద్రారెడ్డికి అరుణ్ పిళ్లై చెప్పినట్టు తెలిపింది. తాను చెల్లించిన రూ.100 కోట్లను తిరిగి సంపాదించుకోవాలని కవిత భావిస్తున్నట్లుగా శరత్ చంద్రారెడ్డి చెప్పారని వెల్లడించింది. 2022 డిసెంబరు 11న హైదరాబాద్‌లో కవితను తాము విచారించామని, అయితే అప్పటికి రాఘవ మాగుంట ఆయన తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి, శరత్ చంద్రారెడ్డి తమ స్టేట్‌మెంట్లను రికార్డు చేయలేదని సీబీఐ తెలిపింది. వీరి స్టేట్ మెంట్ల తర్వాతే కవిత పాత్ర స్పష్టంగా తేలిందని పేర్కొంది.

ఇండో స్పిరిట్‌లో కవితకు భాగస్వామ్యం..

విజయ్ నాయర్‌కు రూ.90-100కోట్లు చెల్లించామని, అందులో రూ.30 కోట్లు హవాలా ద్వారా మళ్లించామని అభిషేక్ బోయినపల్లి తనకు చెప్పినట్టు అప్రూవర్ దినేశ్ అరోరా వెల్లడించారని సీబీఐ తెలిపింది. గోవా అసెంబ్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్న చారియట్ మీడియా సంస్థకు చెందిన రాజేష్ జోషి ఈ డబ్బు తీసుకున్నారని, ఢిల్లీ నుంచి ఈ డబ్బును హవాలా ద్వారా మళ్లించినట్టు హవాలా ఆపరేటర్లు కూడా ఒప్పుకొన్నారని వెల్లడించింది. అభిషేక్ బోయినపల్లి ఆదేశాల మేరకు తాను పెద్దఎత్తున నగదును మళ్లించినట్టు కవిత పీఏ అశోక్ కౌశిక్ చెప్పిన విషయాన్నీ సీబీఐ వెల్లడించింది. అశోక్ కౌశిక్ ద్వారా రూ.25 కోట్ల పంపిణీ జరిగినట్టుగా ఆధారాలు లభించినట్టు తెలిపింది. తన బినామీ అరుణ్ పిళ్లై ద్వారా ఇండో స్పిరిట్ హోల్ సేల్ లైసెన్స్‌లో కవితకు భాగస్వామ్యం ఉందని, సీఏ బుచ్చిబాబు, కవితకు మధ్య మొబైల్ ఫోన్లలో జరిగిన సంభాషణ ద్వారా ఈ విషయం తేలిందని సీబీఐ పేర్కొంది. ఎయిర్‌పోర్టు జోన్‌లో మాగుంట రాఘవ కంపెనీ పిక్సీ ఎంటర్ ప్రైజెస్ సంస్థకు ఎన్‌వోసీ లభించేందుకు కూడా కవిత సహాయ పడ్డారని వెల్లడించింది. 2021 సెప్టెంబరు 20న ఢిల్లీలోని హోటల్ తాజ్ మాన్‌సింగ్‌లో పెర్నార్డ్ రికార్డు ఇండియా నిర్వహించిన సమావేశంలో శరత్ చంద్రారెడ్డి, బుచ్చిబాబు, సమీర్ మహేంద్రో, అరుణ్ పిళ్లై, అభిషేక్ బోయినపల్లి పాల్గొన్నట్టు తేలిందని పేర్కొంది. ఇందుకు సంబంధించి పెర్నార్డ్ రికార్డుకు చెందిన మనోజ్‌రాజ్ మొబైల్ ఫోన్లో ఫొటోలు లభించాయని తెలిపింది.

సీబీఐ కస్టడీకి కవిత

3 రోజులు విచారించేందుకు అనుమతి.. కేసే లేదు.. విచారణేం చేస్తారన్న కవిత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న కవితను మూడు రోజులు కస్టడీకి తీసుకుని విచారించేందుకు సీబీఐకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న కవితను గురువారం అరెస్టు చేస్తున్నట్టు సీబీఐ తెలిపింది. ఈ మేరకు కవిత భర్త అనిల్‌కు సమాచారం అందించింది. శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కవితను సీబీఐ ప్రవేశ పెట్టింది. కవితను ఈ నెల 6న తిహాడ్ జైలులోనే విచారించామని, ఆమె విచారణకు సహకరించలేదని సీబీఐ తరఫున ప్రత్యేక న్యాయవాది కోర్టుకు తెలిపారు. మద్యం వ్యాపారులను, అరవింద్ కేజ్రీవాల్‌కు కలిపిందే కవిత అని, కేసులో కవిత కీలక సూత్రధారి, పాత్రధారి అని, అందుకే కవిత స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉందని చెప్పారు. కవితను 5 రోజుల కస్టడీకి అనుమతి ఇవ్వాలని కోరారు. కవిత తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి వర్చువల్‌గా వాదనలు వినిపించారు. కవితను సీబీఐ విచారణకు అనుమతి ఇవ్వడంపై పిటిషన్ పెండింగ్‌లో ఉందని, అటువంటి సమయంలో ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. కవితను విచారించాలనుకుంటే ముందే సమాచారం ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఉన్నాయని, వాటిని సీబీఐ పట్టించుకోలేదని చెప్పారు. దీనికి సీబీఐ తరఫున న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ఒకరోజు ముందే సమాచారం ఇచ్చామని చెప్పారు. కవితను అరెస్టు చేసిన విషయం భర్తకు గురువారం మధ్యాహ్నం మెసేజ్ చేశామని వెల్లడించారు. కోర్టు అనుమతితోనే కవితను అరెస్టు చేసినట్టు సీబీఐ తరఫు న్యాయవాది తెలిపారు. సీబీఐ రిమాండ్ రిపోర్టులు, ప్రస్తావించిన విషయాలు చాలా పాతవని, వాటి ఆధారంగా అరెస్టు చేయాల్సిన అవసరం విక్రమ్ చౌదరి ఏముందని ప్రశ్నించారు. వాదనలు విన్న న్యాయమూర్తి కావేరి భవేజా సీబీఐ ప్రశ్నించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌తో పాటు, అరెస్ట్‌ను సవాల్ చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లను కొట్టివేశారు. కవితను 3 రోజులు సీబీఐ కస్టడీకి అనుమతి ఇస్తూ తీర్పు వెల్లడించారు. ఆమెను ఈ నెల 15న కోర్టులో హాజరు పరచాలని సీబీఐని ఆదేశించారు.

అసలు కేసే లేదు... విచారణ ఏం చేస్తారు?

కోర్టు హాలు లోపలికి వచ్చేటప్పుడు, బయటికి వెళ్లేటప్పుడు కవిత మీడియాతో మాట్లాడారు. "సీబీఐ అరెస్టు అక్రమం. సీబీఐ చేస్తున్నది తప్పు. అసలు కేసే లేదు. విచారణేం చేస్తారు?" అన్నారు. కోర్టు లోపల కూడా కవిత తన వాదనను న్యాయమూర్తి ఎదుట వినిపించారు. నిబంధనలను అనుసరించే కవితను అరెస్టు చేశామని సీబీఐ తరఫున న్యాయవాది కోర్టులో తెలిపినప్పుడు కవిత అభ్యంతరం తెలిపారు. సీబీఐ చెబుతున్నట్టు తన అరెస్టుపై ముందస్తు సమాచారం ఇవ్వలేదన్నారు. బుధవారం రాత్రి 10.30 నిమిషాలకు సీబీఐ తనను అరెస్టు చేసే అవకాశం ఉందని జైలు సిబ్బంది ద్వారా చూచాయగా సమాచారం అందిందని పేర్కొన్నారు. గురువారం ఉదయం తనను సీబీఐ అరెస్టు చేసిందని, దీనిపై న్యాయ సలహా తీసుకుంటానని, తన న్యాయవాదులతో మాట్లాడేందుకు అనుమతివ్వాలని జైలు అధికారులను కోరారనని తెలిపారు. రోజూ తన భర్తతో 5 నిమిషాలు మాట్లాడేందుకు కోర్టు అనుమతి ఉందని, అందుకే గురువారం ఈ విషయాన్ని తన భర్తకు తెలియజేశానని వెల్లడించారు.

> **అనిల్, కేటీఆర్‌లకు అనుమతి**
>
> కవితను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు నుంచి సాయంత్రం నేరుగా సీబీఐ కార్యాలయానికి తీసుకెళ్లారు. మూడు రోజుల పాటు సీబీఐ కస్టడీలో ఉండనున్న కవితను రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య నలుగురు కలిసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. కవిత న్యాయవాది మోహిత్‌రావుతో ప్రతి రోజూ 30 నిమిషాలు భేటీ కావొచ్చని ఉత్తర్వుల్లో న్యాయమూర్తి తెలిపారు. కవిత భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, వ్యక్తిగత సహాయకుడు శరత్ రోజూ 15 నిమిషాల పాటు కవితను కలిసి మాట్లాడవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోజూ ఇంటి భోజనం చేసేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. కవిత కోరిక మేరకు సీబీఐ కస్టడీలో ఉండే మూడు రోజులు జపమాల, దుస్తులు, పరుపు, దుప్పట్లు, దిండు, టవల్స్ ఉంచుకొనేందుకు అనుమతి ఇచ్చింది. ప్రతి 48 గంటలకు ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించాలని చెప్పింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే కవితను విచారించాలని సీబీఐని కోర్టు ఆదేశించింది.

రాష్ట్రానికి బీజేపీ చేసిందేంటి?

» పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలపై 14న దీక్ష: పొన్నం

» త్వరలో 30 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు: చిన్నారెడ్డి

హైదరాబాద్/మహేశ్వరం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణ రాష్ట్రానికి ఏం చేసిందంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 7 మండలాలు, విద్యుత్తు ప్రాజెక్టును ఆంధ్రాకు అప్పజెప్పిన ఆ పార్టీ.. విభజన హామీల్లో ఒక్కదాన్ని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఏ ముఖం పెట్టుకుని తెలంగాణలో ఓట్లు అడుగుతుందని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనా వైఫల్యాలపై కరీంనగర్‌లో ఈ నెల 14న తాను దీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో పొన్నం మాట్లాడుతూ.. దేశాన్ని అంబానీ, అదానీలకు అమ్మడం తప్ప.. ప్రధాని మోదీ చేసింది ఏమీ లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవహేళన చేస్తూ మాట్లాడిన మోదీ.. అమరులను అవమానించారని మండిపడ్డారు. 'పదేళ్లు మంత్రిగా పని చేసిన హరీశ్‌రావు బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా? బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగ భృతి హామీని అమలు చేశారా? మిషన్ కాకతీయ నీళ్లు ఎటు పోయినయి?' అంటూ ప్రశ్నించారు. ఇటు నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా విస్తరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నాయీ బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం నేతలు కోరారు. నాయీ బ్రాహ్మణులకు గవర్నర్ కోటాలో ఒక ఎమ్మెల్సీ సీటు, అలాగే రెండు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలంటూ సంఘం నేతలు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది యువతకు త్వరలో ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించనుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి వెల్లడించారు. భూదాన్ పోచంపల్లి శివారులోని జలాల్‌పూర్‌లో ఉన్న రామానంద తీర్థ గ్రామీణ సంస్థను ఆయన సందర్శించి అక్కడి సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సంస్థను స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం యువతకు గొప్ప వరమన్నారు. దీని ద్వారా యువతకు ఉచిత శిక్షణతోపాటు స్టైపెండ్‌ను కూడా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్క్యూటీ సరే...!

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ప్రతిచరాస్తి వివరాన్ని కచ్చితంగా తెలియచేయాలన్న నియమమేమీ లేదని సుప్రీంకోర్టు ఇటీవల ఓ తీర్పు సందర్భంగా తేల్చేయడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. పోటీచేస్తున్న అభ్యర్థికి సంబంధించిన సమస్త సమాచారం తెలుసుకోవడం ఓటరుకు కచ్చితమైన హక్కేమీ కాదని కూడా కోర్టు ఈ సందర్భంలో వ్యాఖ్యానించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని తేజు ప్రాంతం నుంచి 2019లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన కరిఖో క్రి అనే వ్యక్తి ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన కేసులో తీర్పు చెబుతూ సర్వోన్నత న్యాయస్థానం ఓటరుకూ, అభ్యర్థికీ మధ్య ఉన్న సంబంధం మీద లోతైన వ్యాఖ్యలు చేసింది. కరిఖో తన నామినేషన్‌తో పాటు సమర్పించిన అఫిడవిట్‌లో కుటుంబీకుల పేరిట ఉన్న మూడు వాహనాల వివరాలు వెల్లడించలేదని, ఈ చరాస్తి వివరాలు దాచిపెట్టినందుకు అతడిని అనర్హుడుగా ప్రకటించాలని ప్రత్యర్థి కేసువేశాడు. గువాహటి కోర్టు కరిఖో ఎన్నికను రద్దుచేసింది. కానీ, అభ్యర్థి ప్రతీ చరాస్తినీ అఫిడవిట్‌లో చూపాలన్న నియమం ఏమీ లేదని, వివరాలన్నీ వెల్లడించకపోవడం తప్పుకాదని సుప్రీంకోర్టు అతడిని కాపాడుకొచ్చింది. ఆస్తి అత్యంత విలువైనదై, సదరు అభ్యర్థి విలాసవంతమైన జీవితాన్ని ప్రతిబింబిస్తే తప్ప జాబితాలో ప్రతీదీ రాయనక్కరలేదన్నది ఈ తీర్పు సారాంశం.

తీర్పులో భాగంగా చేసిన వ్యాఖ్యలు విస్తృత చర్చకు దారితీశాయి. అభ్యర్థికి సంబంధించిన వివరాలు తెలుసుకొనే హక్కు ఓటరుకు ఏ పాటిది, అభ్యర్థి ఎంతమేరకు గోప్యత పాటించవచ్చు అన్న ప్రశ్నలు ఉదయించాయి. ఖరీదైన జీవనశైలి అన్నదానిని ఎలా నిర్వచించాలన్న అనుమానాలను అటుంచితే, ప్రతీ ఆస్తివివరం చెప్పనంతమాత్రాన అది మోసం కాబోదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్య రాజకీయనాయకులకు ఇకపై ఎంతో స్వేచ్ఛనిస్తుందన్న భయాలూ మొదలైనాయి. కోర్టు ఇచ్చిన ఈ మినహాయింపు దాదాపు ప్రతీ ఏటా ఏదో ఒక ఎన్నిక ఎదుర్కొనే ఈ దేశంలో కొత్త సమస్యలు తెచ్చినా తేవచ్చు. తాను ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించి పుట్టుపూర్వోత్తరాలనుంచి ఆస్తులు, కేసుల వరకూ సమస్తమూ తెలుసుకొనే హక్కు ఓటరుకు ఉన్నదని, ఎంపిక వాటి ఆధారంగానే జరుగుతుందని అంటున్నప్పుడు ఆవగింజంత ఆస్తిని కూడా దాచకుండా తనకు ఎరుకలో ఉన్న ప్రతీ వివరాన్నీ అభ్యర్థి చెప్పాల్సిందే. కానీ, రాజకీయనాయకులకు కూడా ఇతరుల మాదిరిగానే గోప్యత హక్కు ఉన్నదని, ఓ చిన్న స్కూటీ గురించి చెప్పనంతమాత్రాన అతడు ఓటరును మోసం చేసినట్టు కాదని కోర్టు భావిస్తోంది. అభ్యర్థులు అన్నీ చెప్పనక్కరలేదు, పౌరులకు అన్నీ తెలియనక్కరలేదు అన్నది తీర్పు సారాంశం. పైగా, అఫిడవిట్ ద్వారా అభ్యర్థి వెల్లడించిన తన మొత్తం ఆస్తిపాస్తుల్లో, ఇలా చూపకుండా వదిలేసిన ఆస్తివిలువ ఆవగింజంత కూడా లేనందున దానిని పట్టుకొని అది ఉద్దేశపూర్వకంగా చేసినదిగా భావించలేమని, విస్మరించదగ్గదని కోర్టు వ్యాఖ్యానించడం విశేషం.


కరిఖో తన అఫిడవిట్‌లో చూపని చరాస్తులు ఒక స్కూటీ, ఓ మోటార్‌బైక్, ఓ చిన్నవ్యాన్ కావడం, వాటికారణంగా దిగువకోర్టు అతడిని అనర్హుడుగా ప్రకటించడం సుప్రీంకోర్టుకు బాధ కలిగించి వుంటుంది. అతడు ప్రకటించిన మొత్తం ఆస్తులు ఓ ఎనిమిదికోట్ల వరకూ ఉన్నందున ఆ మేరకు పోల్చిచూస్తే ఈ వాహనాల విలువ బాగా తక్కువే. కరిఖోవరకూ బాగున్నది కానీ, అదే సూత్రం ప్రకారం వేలాదికోట్ల ఆస్తిపాస్తులున్న ఓ అభ్యర్థి తన హెలికాప్టర్‌నో, ఇతరత్రా విలువైన వాహనాలనో అఫిడవిట్‌లో పేర్కొనకుండా వదిలేయవచ్చునా? అని కొందరి అనుమానం.

అభ్యర్థి గోప్యత హక్కును గుర్తిస్తూ, తన అభ్యర్థిత్వానికీ, ఓటరుకు సంబంధం లేని వివరాలు విప్పనక్కరలేదనీ, సమస్తం చెప్పనక్కరలేదనీ అన్న మినహాయింపు రాజకీయనాయకులకు ఎంతో ఆశ్వాసననిస్తుంది, ప్రత్యర్థులనుంచి రక్షిస్తుంది. కానీ, ఐదేళ్ళకోమారు మళ్ళీ ఎన్నికల్లో నిలబడి, తిరిగి అధికారం సాధించడం కోసం నాయకులు విధిలేక సమర్పించాల్సి వస్తున్న ఈ అఫిడవిట్లలో వారు సంపాదించినదంతా తెలియచెబుతున్నారన్న భ్రమలు ఎవరికీ లేవు. కానీ, తాము ఎన్నుకోబోయే వారి వివరాలు తెలుసుకొనే హక్కు ఓటరు ఎంతో కష్టపడిసాధించుకున్నది. అది సంపూర్ణమైనది కాదు అని సర్వోన్నతన్యాయం తేల్చేయడం బాధాకరం. రాజకీయపార్టీలకు విరాళంగా వచ్చే ప్రతీరూపాయి ఎక్కడనుంచి వస్తున్నదో పౌరులకు తెలియాల్సిందేనని ఎన్నికలబాండ్ల గుట్టు విప్పిన సుప్రీంకోర్టు ఈ కేసులో గట్టిగా నిలబడివుంటే బాగుండేది.

ప్రజాస్వామ్యం డొల్లతనాన్ని నాడే పసిగట్టిన అంబేడ్కర్

'ప్రజాప్రభుత్వం అని చెప్పుకునే హంగులెన్ని ఉన్నా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిజానికి వంశపారంపర్య పాలక వర్గాలతోనూ, వంశపారంపర్య పాలిత వర్గాలతోనూ కూడిన ప్రభుత్వమే' – ఇవి అంబేడ్కర్ మాటలు. 1943 సెప్టెంబర్‌లో 'ఆలిండియా ట్రేడ్ యూనియన్ వర్కర్స్ స్టడీ క్యాంపు'లో ముగింపు ఉపన్యాసంలో అంబేడ్కర్ ఈ మాటలన్నారు. వంశపారంపర్య పాలననీ కుటుంబ పార్టీలనీ ఓడించటానికే ఈ ఎన్నికలు అని మోదీ రోజూ చెప్పుకు తిరుగుతున్న తరుణంలో దీని మూలకారణాలేమిటో తెలుసుకోటం అవసరం. 1943 అంటే స్వతంత్రం ఇంకారాలేదు. కానీ అప్పటికే అంబేడ్కర్ 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గూర్చి ఇండియా చర్చలు సాగిస్తున్నది' అంటూ ఇలా చెప్పారు: 'తస్మాత్ జాగ్రత్త! పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పైకి కనిపించినట్టుగా అత్యుత్తమ వ్యవస్థేమీ కాదని భారతీయులకు చాటిచెప్పగల ధైర్యవంతుడి అవసరం ఉంది.' ఈ ఉపన్యాసంలోని అనేక భావనల్ని పాలకవర్గ పండితులూ, అంబేడ్కర్ వాదులే కాదు, వామపక్షీయులు కూడా తెలిసో తెలియకో ఉటంకించరు. తెలిసినవారూ మరుగుపరుస్తుంటారు. నేటి పార్లమెంటు ఎన్నికల తరుణంలో ఈ ఉపన్యాసంలోని భావనల క్లుప్త పరిచయమే ఈ వ్యాసం.

'అన్ని రాజకీయ సమాజాలూ పాలక, పాలిత వర్గాలుగా చీలిపోయి ఉన్నాయి. ఇదొక దుర్లక్షణం. ఈ దుర్మార్గం అక్కడికి ఆగితే అంతగా పట్టించుకోనక్కర్లేదు. కానీ ఇంకా దౌర్భాగ్యం ఏమిటీ అంటే ఈ చీలిక ఒక మూస లాగా తయారై, వర్గాల దొంతరగా ఘనీభవించి పోయింది. ఎంతగా అంటే పాలకులు ఎల్లప్పుడూ పాలకవర్గాల నుంచే ఉంటారు, పాలితులు ఎప్పటికీ పాలకవర్గాలు కాజాలరు. ప్రజలు తమ్ముతాము పరిపాలించుకోరు. ప్రభుత్వం ఏర్పాటవుతుంది, దాన్ని పాలకవర్గాలకు వదిలేస్తారు. ఇది తమ ప్రభుత్వం కాదన్న విషయాన్ని ప్రజలు మర్చిపోతారు. కాబట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం 'ప్రజల యొక్క – ప్రజల చేత' ప్రభుత్వం ఏనాడూ కాదు, ఫలితంగా 'ప్రజల కొరకు' ప్రభుత్వంగా ఎన్నడూ లేదు. రాజకీయ జీవనం ఇలా దుర్మార్గంగా నిర్మితమై ఉన్నందున ఈ ప్రజాస్వామ్యం ఘోర వైఫల్యంగా మిగిలిపోయింది,' అని తీర్మానించారు అంబేడ్కర్.



'తస్మాత్ జాగ్రత్త! పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పైకి కనిపించినట్టుగా అత్యుత్తమ వ్యవస్థేమీ కాదని భారతీయులకు చాటి చెప్పగల ధైర్యవంతుడి అవసరం ఉంది' అని హెచ్చరించారు అంబేడ్కర్. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం 'ప్రజల యొక్క – ప్రజల చేత' ప్రభుత్వం ఏనాడూ కాదు, ఫలితంగా 'ప్రజల కొరకు' ప్రభుత్వంగా ఎన్నడూ లేదు' అని తీర్మానించారు.

యూరప్‌లో నిరంకుశ ఫ్యూడల్ రాజరికాలు ప్రజాస్వామిక విప్లవాల్లో పతనమైపోయాయి. ముఖ్యంగా ఫ్రెంచి విప్లవ పర్యవసానమే 'స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' అన్న ప్రజాస్వామిక భావనలు. అయితే అవి చాలా పరిమితమైనవనీ, ఆధునిక పెట్టుబడిదారీ దోపిడీకి ఆలంబనలనీ తర్వాత (రష్యాలోనూ, చైనాలోనూ వచ్చిన శ్రామిక విప్లవాల ద్వారా) రుజువైంది. పెట్టుబడిదారీ (బూర్జువా) ప్రజాస్వామ్యం స్థానంలో ప్రజలకు చెందిన 'జనతా ప్రజాస్వామ్యం' అన్న పద్ధతికి అవి నాంది పలికాయి. దారుణ దోపిడీ పద్ధతుల్ని రద్దు చేసిన విప్లవాలుగా, మానవాళి మహాప్రస్థానంలో చారిత్రక మైలురాళ్లుగా అవి నిలిచాయి. సామ్రాజ్యవాదం ఎంత నిర్దాక్షిణ్యంగా, విధ్వంసకారిగా ఉంటుందో 1943 సెప్టెంబర్ నాటికి ప్రపంచ యుద్ధంతో తేటతెల్లమైంది. ఆధునికయుగ విహంగ వీక్షణం చేస్తూ అంబేడ్కర్ ఇలా అంటారు: 'నిరంకుశ రాజరికాలకు వ్యతిరేకంగా సుదీర్ఘమైన, రక్తపాతంతో కూడిన పోరాటాల తర్వాత వాటి స్థానంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నెలకొన్నది. పాలనా వ్యవస్థలో 'ఇదే ఆఖరి మాట' అని తొలుత భావించారు. ప్రతి మానవుడికీ స్వేచ్ఛ, ఆస్తి, సుఖ సంతోషాలూ లభించే కొత్త సహస్రాబ్దిలోకి అడుగుపెడుతున్నాం అని నమ్మారు. అయితే ఆశ్చర్యకర పరిణామాలు సంభవించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సార్వజనీనంగా ఆమోదించి శతాబ్ది కూడా కాకుండానే ఆ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు వచ్చింది. ఫాసిజం ఉన్నచోటే కాక, ఇతర దేశాల్లోనూ తిరుగుబాటు వచ్చింది' అని అంబేడ్కర్ ఎత్తి చూపారు. అలాంటి తరుణంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కావాలని ఇండియా బ్రిటన్‌తో చర్చలు జరుపుతున్నదంటూ, 'పైకి కనిపించినట్టుగా ఇదేమీ అత్యుత్తమ వ్యవస్థ కాదని వారికి చెప్పే ధైర్యం ఎవరైనా చేయాలి' అని అంబేడ్కర్ కోరారు! పెట్టుబడిదారీ దేశాల్లోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు వర్గస్వభావాన్ని అంబేడ్కర్ చర్చించారు కానీ, ఇండియాలో అది మరింత వికృత రూపాలు దాల్చింది. భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి దున్నేవారికే భూమిని పంచకుండా, నిజమైన ప్రజాస్వామ్యానికి పునాదైనా పడదు. అయినా అర్ధవలస, అర్ధఫ్యూడల్ పునాదుల్ని అలాగే ఉంచి ఉపరితల వ్యవస్థగా, పై మెరుగుగా మనదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇక్కడా బ్రిటిష్ పాలనా పద్ధతులే కావాలని మన దళారీ పెట్టుబడిదారీ పాలకవర్గాలూ, వారి రాజకీయ ప్రతినిధులూ కోరుకున్నారు.

1942 క్విట్ ఇండియా మూలంగా ఆగ్రహించిన బ్రిటీష్ వారితో బేరసారాల ప్రక్రియ ఆగిపోయిన తరుణంలో టాటాబిర్లాలు బ్రిటిష్ పాలకులతో మంతనాలు జరిపి, వారితో రాజీకీ, 'కామన్వెల్త్'కి లోబడిన డొమినియన్‌లో బ్రిటిష్ నమూనా పాలన'కూ పునాదులు వేశారు. 1935 రాజ్యాంగ నకలుగా, బ్రిటిష్ పాలకులిచ్చిన రెండు ముసాయిదాల ఆధారంగా రూపొందినదే 1950 రాజ్యాంగం. ఈ వైరుధ్యాలన్నీ అంబేడ్కర్‌కు బాగా తెలుసు. అందుకే తుదిముసాయిదా ఆమోదం సందర్భంగా 1949 నవంబర్ 25 నాటి రాజ్యాంగ సభ ఉపన్యాసంలో ఇలా హెచ్చరించారు: '1950 జనవరి 26 నాడు మనమొక వైరుధ్యాల మయమైన జీవనంలోకి అడుగుపెడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక-ఆర్థిక జీవనంలో అసమానత అలాగే ఉంటుంది. ఈ వైరుధ్యాన్ని సాధ్యమైనంత తొందరగా పరిష్కరించి తీరాలి. లేకపోతే ఈ రాజ్యాంగ సభ ఎంతో కష్టపడి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థని అసమానతలకు బలైన వర్గాలు విధ్వంసం చేస్తారు.' వంశపారంపర్య పాలకులతో కూడిన మన దేశ కుహనా ప్రజాస్వామ్యం నెహ్రూ గాంధీ కుటుంబాల కోరిక మేరకే ఏర్పడలేదనీ, దానికి మన వ్యవస్థలో చాలా లోతైన పునాదులున్నాయనీ పై వివరణ తెలియజేస్తున్నది.

నిజానికలాంటి కుటుంబాలు కాంగ్రెసుకే పరిమితం కాలేదు. గ్వాలియర్ రాజమాత సింధియా మొదలైన ఫ్యూడల్స్ దేశవ్యాప్తంగా నాటి జనసంఘ్ పార్టీకి పునాదులు వేసి రాజపోషణ చేశారు. ఇందిరమ్మ రాజభరణాలు రద్దుచేస్తే వాజపేయీ వారిపక్షానే పార్లమెంటులో వ్యతిరేకించారు. మనది అనాదిగా ప్రజాస్వామ్యమేనని సంఘీయులు చెప్తుంటారు: భరతుడు పద్నాలుగేళ్ల పాటు చెప్పులు సింహాసనంపై పెట్టి ఏలిన రామరాజ్యమూ, వారసత్వ హక్కుకై పోరాడిన ఝాన్సీరాణీ మన ఆదర్శం. అనేకమంది మాజీ ముఖ్యమంత్రుల్నీ కాదని, కర్ణాటకలో యడ్యూరప్ప కొడుకుని రాష్ట్ర బీజేపీ నేతగా నియమించారు; అవినీతి అంటూ తామే పార్టీ నుంచి బహిష్కరించిన నేత ఆయన. అవినీతి అవసరం గుర్తించిన మోడీ-షాలు గనుల రారాజులైన గాలి జనార్దనరెడ్డి సోదరులకు బళ్ళారి రాజ్యాన్ని మళ్లీ ఈ మధ్యే అప్పగించారు. మైసూరు మహారాజా మనవడిని లోక్‌సభకు అభ్యర్థిగా నిలబెట్టారు. ఇన్ని చెప్పిన అంబేడ్కర్ తర్వాత ఆ వ్యవస్థతోనే రాజీ పడ్డారు కదా అంటే – నేనొక కిరాయి రచయితని (hack), ఇష్టంలేని పనులన్నీ చేసాను, ఈ రాజ్యాంగాన్ని తగులబెడుతాను అన్న మాటలే ఆయనిచ్చిన సమాధానం.

■ **ఎమ్. జయలక్ష్మి**
రిటైర్డ్ ఏజీఏం, ఆప్కాబ్

(రేపు అంబేడ్కర్ జయంతి)

పేదల ఆకాంక్షలకు అద్దం కాంగ్రెస్ మానిఫెస్టో

ప్రగతిని, అభివృద్ధిని ఆశిస్తున్న వ్యక్తులు, సంస్థలు నిర్దిష్ట సందర్భాలలో విధిగా కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సంకల్పాలు చెప్పుకోవడం, మనోరథాలు వెల్లడించడం కద్దు. ఎన్నికలు అనే ప్రజాస్వామిక ప్రక్రియ రాజకీయ పక్షాలకు విధిగా వచ్చే ఒక ప్రత్యేక సందర్భం. ఎన్నికలలో గెలిచి అధికారాన్ని చేపట్టడమనేది ప్రతి రాజకీయపక్షానికి ఒక పరమ లక్ష్యంగా ఉంటుంది. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మన రాజకీయ పక్షాలు అన్నీ మానిఫెస్టోలను విడుదల చేస్తున్నాయి. సంబంధిత రాజకీయ పార్టీ లక్ష్యాల లిఖితపూర్వక ప్రకటనే ఒక మానిఫెస్టో. అది ఆ పార్టీ సంకల్ప పత్రం. ప్రజలకు సంబంధించిన వివిధ అంశాలపై సదరు రాజకీయ పార్టీ భావాలు, అభిప్రాయాలు ఆ పార్టీ మానిఫెస్టోలో ఉంటాయి. 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటన, ఆగస్టు 14–15, 1947న జవహర్‌లాల్ నెహ్రూ ప్రసంగం 'భవితవ్యంతో భేటీ' అన్నవి లక్ష్యాల ప్రకటనకు చరిత్రాత్మక ఉదాహరణలు. వాటిని తప్పక గుర్తు చేసుకోవలసి ఉన్నది. జూలై 24, 1991న, భారత ఆర్థిక వ్యవస్థను ఒక మౌలిక మలుపు తిప్పిన తన చరిత్రాత్మక ప్రసంగంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ విఖ్యాత ఫ్రెంచ్ రచయిత విక్టర్ హ్యూగో మాటలను ఉటంకించారు. 'ఒక భావం, ప్రపంచాన్ని ప్రభావితం చేసే సమయం ఆసన్నమయినప్పుడు ధరిత్రిపై ఏ శక్తి కూడా ఆ భావ గమనాన్ని, పురోగతిని నిరోధించలేదు' అని విక్టర్ హ్యూగో ఉద్ఘోషించాడు. ఆ ప్రకటనలు, లక్ష్యాలు స్వాతంత్ర్యం సాధించుకున్న దేశాల కొత్త పాలకుల ఉద్దేశాలు, ఆశయాలను స్పష్టంగా, సకల మానవాళిని ప్రభావితం చేసేలా ప్రకటితమయ్యాయి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఒక ప్రకటన, దాన్ని ప్రకటించిన వ్యక్తి నిజ ఉద్దేశాలనూ దాచిపెట్టగలదు. మిథ్యా ప్రవక్తలు మోసపూరిత ప్రకటనలు చేస్తారు. నరేంద్ర మోదీని వెన్నాడే ప్రకటనలు: 'ప్రతి భారతీయుని బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తాను'; 'ఏటా 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తాను'; రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాను' మొదలైనవి. ఆయన సహచరులే ఆ ప్రకటనలను పరిహసించారు. అవన్నీ ఎన్నికల జుమ్లా (వంచన)గా వాటిని కొట్టివేశారు.

ఆసేతు హిమాచలం భారత ప్రజలను విశేషంగా ప్రభావితం చేయగల రెండు ప్రధాన రాజకీయ పక్షాలు: భారత జాతీయ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ. బీజేపీ తన మానిఫెస్టో కమిటీని మార్చి 3న ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ తన మానిఫెస్టోను ఏప్రిల్ 5న విడుదల చేసింది. నిజానికి ఈ కాలమ్‌లో ఆ రెండు మానిఫెస్టోలను తులనాత్మకంగా పరిశీలించాలని అనుకున్నాను. అయితే కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టో మాత్రమే అందుబాటులో ఉన్నది. కాంగ్రెస్ మానిఫెస్టోలోని ప్రముఖ అంశాలను క్లుప్తంగా, నిశితంగా పేర్కొంటాను. బీజేపీ మానిఫెస్టో అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ రెండు పార్టీల మానిఫెస్టోలను పాఠకులు, ఓటర్లు తులనాత్మకంగా పరిశీలించగలరని ఆశిస్తున్నాను.

తొలుత భారత రాజ్యాంగం గురించి కాంగ్రెస్ ఏమి చెప్పిందో చూడండి: 'ఎప్పటికీ ముగియబోని మా ప్రస్థానంలో భారత రాజ్యాంగమే మాకు ఏకైక మార్గదర్శిగా, సహవాసిగా ఉంటుంది'. మరి బీజేపీ సైతం ఆ రాజ్యాంగానికి నిబద్ధమై ఉంటుందా లేక మౌలికంగా దాన్ని సవరించి వేస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి భారత ప్రజలు ఆతురత పడుతున్నారు. బీజేపీ నిబద్ధత విషయమై ఈ ప్రశ్న ఎందుకు తలెత్తింది? 'ఒకే జాతి, ఒకే ఎన్నిక; ఉమ్మడి పౌర స్మృతి, పౌరసత్వ సవరణ చట్టం తదితర విచ్ఛిన్నకర భావాలు దేశ ప్రజలను కలవరపరుస్తున్న సందర్భం కదా ఇది. భారత రాజ్యాంగం ఔదలదాల్చిన వెస్ట్ మినిస్టర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య సూత్రాలకు తాను కట్టుబడి ఉండేది లేనిదీ దేశ ప్రజలకు బీజేపీ స్పష్టం చేయాలి.

సామాజిక-ఆర్థిక విధానాలు, కులాల వారీ జనగణన, రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ తన ఉద్దేశాలను స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం దేశ వ్యాప్తంగా సకల ప్రజల సామాజిక– ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తుంది. కులాల వారీ జనగణనకు కాంగ్రెస్ దృఢ సంకల్పంతో ఉన్నది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేసేందుకై రాజ్యాంగాన్ని సవరించేందుకు కాంగ్రెస్ సుముఖంగా ఉన్నది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా ఉద్యోగాలలో కల్పిస్తున్న 10శాతం రిజర్వేషన్లను అన్ని కులాల వారికి, సామాజిక సమూహాలకు కూడా వర్తింపచేసేందుకు కాంగ్రెస్ సంసిద్ధంగా ఉన్నది. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో సకల సామాజిక వర్గాల వారికి స్థానం కల్పించేందుకు ఒక డైవర్సిటీ కమిషన్ నేర్పాటు చేసేందుకు కాంగ్రెస్ సంకల్పించింది. ఆ రంగాలలో సామాజిక వైవిధ్యం ఏ స్థాయిలో ఉన్నదో కూడ ఎప్పటికప్పుడు అంచనా వేయడం ఆ కమిషన్ కర్తవ్యంగా ఉంటుంది. బీజేపీ తన సందిగ్ధతను విడనాడి, ఈ ప్రస్తావిత అంశాలపై తన ఉద్దేశాలు, లక్ష్యాలను స్పష్టం చేయాలి. సమానవకాశాల కల్పన ద్వారా సమానత్వ సాధన అనే విస్తృత అంశంపై కాంగ్రెస్, బీజేపీ వైఖరులు ఏమిటో ప్రజలకు విశదమవుతాయి.

భారతదేశంలో మతపరమైన, భాషాపరమైన మైనారిటీలు అధిక సంఖ్యలో ఉన్నారు సొంత విశ్వాసాలను ఆచరించడంతో సహా మానవ హక్కులను సమరీతిలో పొందేందుకు సమస్త భారతీయులు అర్హులే అని కాంగ్రెస్ దృఢంగా విశ్వసిస్తోంది. మెజారిటేరియనిజం లేదా నిరంకుశత్వ వాదాలకు ఎటువంటి తావు లేదు. బహుళత్వం, వైవిధ్యం భారతీయ సంస్కృతి విశిష్ట విలువలు. మైనారిటీలను కాంగ్రెస్ 'బుజ్జగిస్తుందని' బీజేపీ ఏనాటి నుంచో ఆరోపిస్తూ వస్తోంది 'బుజ్జగింపు అనేది బీజేపీ మైనారిటీ వ్యతిరేకతకు ఒక సంకేత నామం. పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలుపరచడం, ఉమ్మడి పౌర స్మృతికి పార్లమెంటు ఆమోదాన్ని పొందే విషయమై బీజేపీ తన దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటించగలదా? ఆ రెండు చట్టాలు పూర్తిగా వివక్షాపూరితమైనవని కలవరపడుతున్న మైనారిటీలు బీజేపీ మానిఫెస్టో కోసం ఉత్కంఠ, వ్యాకులతతో ఎదురు చూస్తున్నారు.



'ఎప్పటికీ ముగియబోని మా ప్రస్థానంలో భారత రాజ్యాంగమే మాకు ఏకైక మార్గదర్శిగా, సహవాసిగా ఉంటుంది' అని భారత జాతీయ కాంగ్రెస్ తన ఎన్నికల మానిఫెస్టోలో స్పష్టం చేసింది. మరి బీజేపీ సైతం ఆ రాజ్యాంగానికి నిబద్ధమై ఉంటుందా లేక దాన్ని మౌలికంగా మార్చివేస్తుందా అనే విషయాన్ని తెలుసుకోవడానికి భారత ప్రజలు ఆతుత పడుతున్నారు.

భారతదేశ 'జనాభా లబ్ధి' (డెమోగ్రాఫిక్ డివిడెండ్) క్రమంగా తగ్గిపోతోంది. ఆర్థిక వ్యవస్థ సగటు వృద్ధిరేటు (5.9 శాతం) సంతృప్తికర స్థాయి కన్నా తక్కువగా ఉండడం వస్తూత్పత్తిరంగం (స్థూలదేశీయోత్పత్తిలో 14 శాతం) పురోగతి స్తంభించిపోవడం, నిరుద్యోగిత (గ్రాడ్యుయేట్స్‌లో 42 శాతం) అంతకంతకూ పెరిగిపోవడమే జనాభా లబ్ధి తగ్గిపోయేందుకు ప్రధాన కారణాలు. కేంద్ర ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, రైట్ టు అప్రెంటిస్‌షిప్ ఆక్ట్‌ను ఆమోదిస్తామని, కొత్త ఉద్యోగాలను ప్రోత్సహించే కార్పొరేట్ కంపెనీలకు ప్రోత్సాహక పథకాలు అమలు పరుస్తామని, స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు ఒక ఫండ్ ఆఫ్ ఫండ్స్ పథకాన్ని ప్రారంభిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ హామీలు యువతను అమితంగా ఆకట్టుకుంటున్నాయి యువతకు ఉద్యోగాలు సృష్టించే విషయమై బీజేపీ– ఎన్డీఏ ప్రభుత్వానికి విశ్వసనీయమైన పథకమేదీ లేదు. మరి రాజకీయ పక్షమైన బీజేపీ మరింత ఆకర్షణీయమైన పథకాన్ని ప్రతిపాదించగలదా?

ఎన్నికల ప్రక్రియలో మహోత్సాహంతో పాల్గొనే ఓటర్లలో మహిళలు ముఖ్యమైనవారు అనడంలో సందేహం లేదు. ఎన్నికల ప్రచారంలో ఆయా పార్టీ నాయకుల ప్రసంగాలను వారు శ్రద్ధగా వింటారు. ఆ ప్రసంగాల గురించి మహిళా ఓటర్లు తమలో తాము చర్చించుకోవడం కద్దు. మహిళల శ్రేయస్సుకు మహాలక్ష్మి పథకం (ప్రతి పేద కుటుంబానికి ఏటా రూ.లక్ష ఆర్థిక సహాయం, ఉపాధి హామీ లబ్ధిదారులకు రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచడం, మహిళా బ్యాంకు పునరుద్ధరణ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు మొదలైన కాంగ్రెస్ హామీలపై మహిళలు, యువతులు విశేష ఆసక్తి చూపుతున్నారు. మరి బీజేపీ మతపరమైన ఉద్వేగాలను (హిందూత్వ) రెచ్చగొట్టి ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మాత్రమే పరిమితమవుతుందా? లేక నిర్దిష్ట పథకాలు, కార్యక్రమాలతో ప్రజల ముందుకు వస్తుందా అనేది వేచి చూడాలి.

ప్రజల మాటా మంతీలో బాగా వినిపిస్తున్న అంశం బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనా పద్ధతులు. సమాఖ్య పాలనా విధానాన్ని, రాష్ట్రాల కలయికే ఇండియా అన్న రాజ్యాంగ ప్రకటనను బీజేపీ ప్రభుత్వం బలహీనపరిచింది. ఆ పార్టీ ప్రవచిస్తున్న ఒక జాతి, ఒకే ఎన్నిక సిద్ధాంతం సందేహాస్పదమైనది. అది అంతిమంగా ఒకే జాతి, ఒకే ఎన్నిక, ఒకే ప్రభుత్వం, ఒకే పార్టీ, ఒకే నాయకుడుకు దారితీయడం ఖాయం. కాంగ్రెస్ మానిఫెస్టోలోని ఒక అధ్యాయంలో సమాఖ్య పాలనా విధానంపై 12 అంశాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానినైనా బీజేపీ అంగీకరిస్తుందా? ఉమ్మడి జాబితాలోని కొన్ని అంశాలను రాష్ట్రాల జాబితాలోకి మార్చే విషయమై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కాంగ్రెస్ నిబద్ధమై ఉన్నది. ఈ విషయమై అది ఇచ్చిన హామీ పర్యవసానాలు బహుముఖంగా ఉంటాయనడంలో సందేహం లేదు. సమాఖ్య పాలనా విధానం పట్ల బీజేపీ నిబద్ధతను ఈ పన్నెండు అంశాలు పరీక్షించనున్నాయి.

రాజ్యాంగానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, మానవ హక్కుల పరిరక్షణకు వ్యక్తి స్వేచ్ఛ, గోప్యత, రాజ్యాంగ నైతికతకు ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీల నిబద్ధతే ఈ సార్వత్రిక ఎన్నికలలో అతి ముఖ్యమైన అంశమని నేను భావిస్తున్నాను. రాజ్యాంగాన్ని ఔదల దాల్చి, అది గౌరవించే ప్రజాస్వామిక సూత్రాలను సమర్థించే అభ్యర్థికే నా ఓటు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

భారత చరిత్రలో అత్యంత విషాద ఘట్టం

రక్తంతో తడిసిన నేల, బాధతో నిండిన ఆకాశం, జలియన్ వాలాబాగ్ ఘటన ఒక మారణహోమం. నిరాయుధులైన ప్రజలపై బ్రిటీష్ దురాగతం. వేల మంది ప్రాణాలు ఒక్కసారిగా గాలిలో కలిసిపోయాయి. జలియన్ వాలాబాగ్ ఘటన, ఒక చారిత్రక మలుపు, భారతీయులలో స్వాతంత్ర్య స్ఫూర్తిని మరింత బలపరిచింది. 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్ వాలాబాగ్ ఊచకోతగా పిలువబడే ఈ సంఘటనలో, బ్రిటిష్ దళాలు నిరాయుధులైన భారతీయుల సమావేశంపై కాల్పులు జరిపి, వందలాది మందిని చంపాయి. ఈ దారుణం భారతీయుల హృదయాల్లో బ్రిటిష్ పాలన పట్ల తీవ్రమైన ద్వేషాన్ని పెంచింది. 1919లో, భారతదేశం రౌలట్ చట్టం అనే అణచివేత చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు జరుపుతోంది. ఈ చట్టం బ్రిటిష్ ప్రభుత్వానికి ఎవరినైనా విచారణ లేకుండా నిర్బంధించే అధికారాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 13న, బైసాఖీ పండుగ సందర్భంగా, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో భారీ సమావేశం జరిగింది. బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ ఎడ్వర్డ్ డయ్యర్ నేతృత్వంలోని బ్రిటిష్ దళాలు ఈ సమావేశంపై కాల్పులు జరపాలని ఆదేశించాయి.

బ్రిటిష్ దళాలు సమావేశంపై పది నిమిషాల పాటు కాల్పులు జరిపాయి. ఈ దాడిలో 379 మంది మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి, అయితే మరణించినవారి సంఖ్య 1000కు పైగా ఉండవచ్చని భావిస్తున్నారు. చాలా మంది మహిళలు, పిల్లలు కూడా ఈ దాడిలో బలైపోయారు. జలియన్ వాలాబాగ్ ఊచకోత భారతదేశం అంతటా తీవ్రమైన ఆగ్రహానికి దారితీసింది. ఈ దురంతం భారతీయ స్వాతంత్ర్య పోరాటంలో ఒక మలుపుగా నిలిచింది. ఈ ఘటనకు నిరసనగా, మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని 1920 సంవత్సరంలో ప్రారంభించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ బ్రిటిష్ బిరుదులను తిరిగి ఇచ్చారు. భగత్ సింగ్ విప్లవకారుడుగా మారటానికి ఈ సంఘట ఒక కారణం. జలియన్ వాలాబాగ్ ఊచకోత భారతీయుల స్వాతంత్ర్య కాంక్షను మరింత బలపరిచింది. జలియన్ వాలాబాగ్ ఊచకోత జ్ఞాపకార్థం, అమృత్‌సర్‌లో ఒక స్మారకం నిర్మించబడింది. ప్రతి ఏడాది ఏప్రిల్ 13న, భారతదేశం ఈ దురంతాన్ని జ్ఞాపకం చేసుకుంటుంది. ఈ దురంతం భారతీయ స్వాతంత్ర్య పోరాటంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. ఊచ కోతకు కారణమైన బ్రిటిష్ అధికారులను శిక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. 1920లో ఈ దుర్ఘటన జరిగిన స్థలంలో ఒక స్మారక స్థూపాన్ని నిర్మించడానికి నాటి భారత జాతీయ కాంగ్రెస్ తీర్మానం చేసింది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1961లో ఏప్రిల్ 13న అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల సమక్షంలో ఈ స్థూపం ఆవిష్కరించబడింది. జలియన్ వాలాబాగ్‌లో తుపాకీ బుల్లెట్ల గుర్తులు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ సంఘటన భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఒక చీకటి రోజుగా పరిగణించబడింది. జలియన్ వాలాబాగ్‌లో మరణించిన అమరవీరులకు నివాళి అర్పిస్తూ.. జైహింద్!

– **పూసపాటి వేదాద్రి**

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

దేశంలో వైవిధ్యానికి అండ ప్రాంతీయ పార్టీలే!

'మేం జాతీయ పార్టీకి చెందిన ప్రాంతీయ నాయకులం. ఆయన ప్రాంతీయ పార్టీకి చెందిన జాతీయ నాయకుడు' తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్.టి.రామారావు గురించి రాజకీయ మేధావిగా పేరు పొందిన కాంగ్రెస్ నాయకుడు ఎస్. జైపాల్ రెడ్డి అన్న మాటలివి. ప్రత్యర్థిలోని సుగుణాలను మెచ్చుకోవడం ఆయన సహజ లక్షణం. నేడు కొందరు జాతీయ పార్టీల నాయకులు ప్రాంతీయ పార్టీలపై విమర్శలు చేస్తున్నారు: ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలకు పనేమిటి? వాటికి జాతీయ దృక్పథం, సిద్ధాంతాలు, ప్రణాళికలు ఉండవు కదా? అవి రాష్ట్రాలకే పరిమితమైతే సరిపోతుంది కదా? వాటి వల్ల ఓట్లు చీలి జాతీయ రాజకీయ స్వరూపమే మారిపోతోంది కదా? అంటున్నారు. ఈ నేపథ్యంలో జైపాల్ రెడ్డి మాటలను గుర్తుకు తెచ్చుకోవాలి.

ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం గురించి మాట్లాడుకోవడానికి ముందు అసలు జాతీయ పార్టీలు అంటే ఏమిటో చూద్దాం. ఏదైనా పార్టీకి జాతీయ పార్టీ హోదా గుర్తింపు ఇచ్చే విషయమై ఎన్నికల కమిషన్ 2016లో నిబంధనలు జారీ చేసింది. దాని ప్రకారం ఈ హోదా రావాలంటే మూడు అర్హతలను కలిగి ఉండాలి. ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో కనీసం మూడు రాష్ట్రాల్లో తక్కువలో తక్కువ రెండు శాతం ఓట్లు వచ్చి ఉండాలి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు కలిపి కనీసం నాలుగు రాష్ట్రాల్లో నాలుగు శాతం ఓట్లు సంపాదించాలి. కనీసం నాలుగు లోక్‌సభ స్థానాలను గెలిచి ఉండాలి. నాలుగు రాష్ట్రాల్లో రాష్ట్ర స్థాయి పార్టీలుగా గుర్తింపు పొంది ఉండాలి. అంటే దీని అర్థం ఏదైనా పార్టీకి జాతీయ స్థాయి పార్టీగా గుర్తింపు రావాలంటే అది కశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా విస్తరించాల్సిన పనిలేదు. నాలుగు రాష్ట్రాల్లో ఉనికి ఉంటే చాలు. ఈ నిబంధనల ప్రకారం దేశంలో ఆరు పార్టీలకు జాతీయ స్థాయి హోదా గుర్తింపు దక్కినా నిజానికి వాటిలో దేశ వ్యాప్తంగా విస్తరించినవి తక్కువే. కొన్నయితే బహుళ రాష్ట్రాల పార్టీలు తప్ప నిఖార్సయిన జాతీయ పార్టీలేమీ కావు. జాతీయ పార్టీలు అంటే అన్ని ప్రాంతాల వారిని, అన్ని వర్గాల వారిని కలుపుకొని వెళ్లేవని అనుకోవడం సహజం. కానీ అన్ని ప్రాంతాల్లో ఉన్నామని చెప్పుకోవడం తప్పిస్తే అన్ని వర్గాల వారికీ ఎన్నికల్లో టిక్కెట్లు కాదు కదా, సభ్యత్వమైనా ఇస్తున్నామని గట్టిగా చెప్పుకొనే పార్టీలు ఎన్ని ఉన్నాయి? కొన్ని వర్గాలను పూర్తిగా విస్మరించే పార్టీలు నిజమైన జాతీయ పార్టీలు అవుతాయా? వాటి సిద్ధాంతాలను సంపూర్ణ జాతీయ దృక్పథం అనవచ్చా? వాటి కీలక నాయకత్వంలో అన్ని ప్రాంతాల వారికి, వర్గాల వారికి తగిన భాగస్వామ్యం ఉందా? అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. చట్టపరమైన నిబంధనలు పక్కన పెడితే ప్రజల ఆలోచనలు, ఊహల ప్రకారం ఉన్న నిజమైన జాతీయ పార్టీలు ఎన్ని అన్నదానికి కచ్చితమైన సమాధానం కష్టం. ఇలాంటి సందర్భంలో లోక్‌సభ ఎన్నికలను జాతీయ పార్టీలకే పరిమితం చేయాలన్న వాదనకు ఆధారం, ప్రాతిపదికే ఉండదు. సరైన జాతీయ స్థాయి పార్టీలు లేనందునే దేశ నిర్మాణం, జాతీయ స్థాయి రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల భూమిక కీలకంగా మారింది. ఇది విస్మరించలేని వాస్తవం.

జాతీయ పార్టీలు కొన్ని అంశాలు, కొన్ని ప్రాంతాలకే పరిమితమై కీలక సమస్యలను విస్మరించినప్పుడు అదే ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి దారితీస్తుంది. అలాంటి పరిస్థితులు దేశంలో ఇంకా కొనసాగుతున్నాయి. అలాంటప్పుడు ప్రాంతీయ పార్టీల ఉనికిని తిరస్కరించడం ఎంతవరకు సమంజసం?

ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలని, కొందరి స్వార్థం కోసమే ఏర్పాటయ్యాయని ఉన్న విమర్శలు కూడా సరికాదు. ప్రతి ప్రాంతీయ పార్టీకి ఒక చారిత్రక నేపథ్యం ఉంది. ఉదాహరణకు ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటయింది. నెలకొల్పిన సందర్భంలో దాన్ని 'ఉప ప్రాంతీయ పార్టీ' అని ఎద్దేవా చేసిన వారెందరో. కానీ లక్ష్యాన్ని సాధించి జాతీయ స్థాయిలో ఎన్నో ఉద్యమాలకు ఆదర్శమైందన్నది వాస్తవం. ప్రత్యామ్నాయ భావజాల వ్యాప్తి కోసం తమిళనాడులో ద్రవిడ పార్టీలు ఏర్పాటయ్యాయి.

ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో తెలుగువాడి ఆత్మగౌరవం, అభివృద్ధి నినాదాలతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ప్రాంతీయ ఆకాంక్షలు నెరవేరేలా చేయడం కోసం మహారాష్ట్రలో శివసేన ఏర్పాటైంది. జయప్రకాశ్ నారాయణ, లోహియా చైతన్యంతో ప్రాంతీయ సామాజిక న్యాయం, లౌకిక సిద్ధాంతంతో సమాజ్‌వాది పార్టీ ములాయం సింగ్ యాదవ్, రాష్ట్ర జనతాదళ్ పార్టీ లాలు ప్రసాద్ యాదవ్ స్థాపించారు. ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చడంలో జాతీయ పార్టీ సమర్థంగా వ్యవహరించనప్పుడు పశ్చిమ బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ వంటి ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. కొంతమంది నాయకుల వ్యక్తిగత కోరికలు నెరవేరనప్పుడు పార్టీలను ఏర్పాటు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. పార్టీని సొంత ఎస్టేటుగా, ఆదాయ వనరుగా, వ్యాపారంగా భావించిన వారూ కొన్ని రాష్ట్రాల్లో ఉన్నారు. వాటిని ఉదాహరణగా చూపించి మొత్తం ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబ పార్టీలేనని, అవి దీర్ఘ కాలంలో మనుగడ సాగించలేవని విమర్శలు చేయడం సరిరాదు.




దేశ నిర్మాణంలో ప్రాంతీయ పార్టీలు పోషించిన పాత్రకు ఉదాహరణలు కోకొల్లలు. తాగునీరు, కరెంటు వంటి సమస్యలు లేకుండా హైదరాబాద్ దేశానికే ఉపాధి కేంద్రంగా మారిందంటే దాని వెనుక బీఆర్ఎస్ కృషి ఎవరూ కాదనలేనిది. వ్యవసాయ రంగం అభివృద్ధిలో తెలంగాణ మోడల్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. మళ్లీ ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకువస్తే తెలుగు గంగ ద్వారా చెన్నైకి కృష్ణా జలాలు తరలించి దాహార్తిని తీర్చారు. ఇక్కడ ప్రాంతీయ సంకుచిత భావాలు ఎక్కడున్నాయి? ఇది జాతీయ సమైక్యతకు నిదర్శనం కాదా? కొన్ని పార్టీల ఉద్యమాల మేరకు ప్రాంతీయ అవసరాల దృష్ట్యా రాజ్యాంగానికి సవరణలు చేసిన ఉదంతాలూ ఉన్నాయి. ఇవన్నీ ఆయా ప్రాంతాల సమస్యల పరిష్కారం కోసమే తప్ప జాతి వ్యతిరేకమైనవేమీ కాదు. జాతీయ పార్టీలు కొన్ని అంశాలు, కొన్ని ప్రాంతాలకే పరిమితమై కీలక సమస్యలను విస్మరించినప్పుడు అదే ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి దారితీస్తుంది. అలాంటి పరిస్థితులు దేశంలో ఇంకా కొనసాగుతున్నాయి. అలాంటప్పుడు ప్రాంతీయ పార్టీల ఉనికిని తిరస్కరించడం ఎంతవరకు సమంజసం?

ఇప్పుడు దేశంలో చెప్పుకునే రెండు జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ కూడా ప్రాంతీయ పార్టీలతో కూటమి ఏర్పాటు చేసుకున్నాయి ఒకటి ఎన్డీఏ, మరొకటి ఇండియా కూటములుగా ఏర్పడ్డాయి. ఆ కూటమితోనే రేపు దేశంలో ప్రభుత్వాన్నీ ఏర్పాటు చేస్తాయి.

రాజ్యాంగ అవసరాల రీత్యా కూడా ప్రాంతీయ పార్టీల ఆవశ్యకత ఎంతో ఉంది. భారతదేశం ఎన్నో రకాల జాతులు, సంప్రదాయాలతో బహు వైవిధ్యమైనది. అన్నింటికీ ఒకే వాదన, సిద్ధాంతం సరిపోదు. అందుకే దేశానికి సమాఖ్య వ్యవస్థ తప్ప మరో పద్ధతి సరిపడదు. దాన్ని గుర్తించే రాజ్యాంగ నిర్మాతలు ఫెడరల్ వ్యవస్థను రాజ్యాంగంలోని మౌలిక స్వరూపంలో భాగంగా చేర్చారు. రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని మార్చడానికి వీల్లేదు. ఫెడరల్ వ్యవస్థ వర్ధిల్లాలంటే రాష్ట్రాల ఆశలకు అనుగుణంగా నడుచుకునే ప్రాంతీయ పార్టీలు ఉండి తీరాల్సిందే. ఒకే దేశం–ఒకే జాతి అంటే దానర్థం ఒకే పార్టీ ఉండాలని కాదు. భిన్నపార్టీల సమాహారంతోనే ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని నడపడం. అలాంటప్పుడు అందర్నీ కలుపుకొని వెళ్లేనే ఫెడరల్ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఈ విషయంలో ప్రాంతీయ పార్టీల పాత్రను ఎలా కాదనగలం? వైవిధ్యంలోనూ, భిన్నత్వంలోనూ బలం ఉందని నమ్మేవారికి ప్రాంతీయ పార్టీలు సర్వసమ్మతమైనవే.

• **గోసుల శ్రీనివాస్ యాదవ్**
జనతంత్ర వేదిక – అధ్యక్షులు



శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 కనిష్ఠం 24.9

అర్ధరాత్రి చిరుజల్లులు

హైదరాబాద్ సిటీ: నగరంలో శుక్రవారం అర్ధరాత్రి చిరుజల్లులు కురిశాయి. గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, మాదాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట, కొండాపూర్, మణికొండ, చందానగర్ ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసింది.



రాజకీయ ప్రసంగాలు

ఉండొద్దు

- శ్రీరామ శోభాయాత్ర నిర్వాహకులకు సీపీ సూచనలు
- యాత్ర రూట్‌మ్యాప్ పరిశీలన

మంగళ్‌హాట్,గోషామహల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న జరగబోయే శ్రీరామ శోభాయాత్ర మార్గాన్ని నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిర్వాహకులకు సూచించారు. ఇతర వర్గాలను కించపరిచే విధంగా పాటలు, ఎన్నికల ప్రసంగాలు చేయకూడదన్నారు. శోభాయాత్ర సీతారాంబాగ్ ద్రౌపది గార్డెన్ నుంచి ప్రారంభమై మంగళ్‌హాట్, ధూల్‌పేట్, పురానాపూల్, జుమ్మేరాత్ బజార్, బేగంబజార్ ఛత్రి, గోల్‌మజీద్, గౌలిగూడ, పుత్లిబౌలి,

మిగతా 8వ పేజీలో..



ఖజానాకు చేరని ₹ 160 కోట్లు

రికార్డు స్థాయిలో పన్ను వసూలు అంటూ జీహెచ్‌ఎంసీ గొప్పలు

- అనంతరం మారుతున్న అంకెలు
- చెక్కుల బౌన్స్, సాంకేతిక సమస్యల వల్లే తేడా
- 2023-24లో రూ.1917 కోట్ల వసూలు
- చెక్కులు తీసుకోవద్దనే యోచనలో అధికారులు
- డీడీలు, ఆన్‌లైన్, సీఎస్‌సీల్లో చెల్లింపుకు ఓకే
- ప్రభుత్వ ఆమోదం అనంతరం అమలు
- గత పదేళ్లలో 58 వేలకుపైగా చెల్లని చెక్కులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,917 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. సంస్థ చరిత్రలో ఇది రికార్డు - ఇటీవల జీహెచ్‌ఎంసీ చేసిన ప్రకటన ఇది. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వసూలైన ఆస్తిపన్నులో ఇప్పటికీ రూ.160 కోట్లకు పైగా సంస్థ ఖజానాలో జమ కాలేదు. రూ.28 కోట్ల వరకు చెక్కులు బౌన్స్ అయ్యాయి. మరో రూ.130 కోట్లకు సంబంధించిన చెక్కులు, ఇతర గేట్ వేల ద్వారా చెల్లించిన లావాదేవీలను బ్యాంకులు క్లియర్ చేయాల్సి ఉంది. ఏటా వసూలయ్యే పన్నులో దాదాపు 20 నుంచి 25 శాతం చెక్కుల రూపంలో వసూలవుతుంది. ఇందులో కొన్నిచెక్కులు బౌన్స్ కావడంతో పన్ను ఆదాయంపై ప్రభావం పడుతోంది. ఈ క్రమంలోనే ఏటా మార్చి 31వ తేదీ నాటికి వసూలైనట్టు ప్రకటించిన పన్ను ఆదాయం అనంతరం తగ్గుతోంది. చెక్కులతోపాటు కొన్ని ఆన్‌లైన్ లావాదేవీల్లో సాంకేతిక ఇబ్బందులు ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.28 కోట్లకుపైగా చెక్కులు బౌన్స్ అయినట్టు రెవెన్యూ విభాగం వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆ మేరకు వసూలు మొత్తం తగ్గనుంది. బౌన్స్ అయిన చెక్కుల విషయంలో చెల్లింపుదారులను సంప్రదించడంతో పాటు వారి నుంచి స్పందన లేకుంటే న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు ఓ అధికారి తెలిపారు.

చెక్కులు తీసుకోకుండా...?

పన్ను వసూలుకు ఉన్నతాధికారులు సర్కిళ్ల వారీగా లక్ష్యం నిర్దేశిస్తుంటారు. రోజు, వారం, నెలల వారీగా గడువు విధిస్తూ ఇంత మొత్తం పన్ను వసూలు చేయాలని చెబుతారు. పౌరులను కలిసే ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తుంటారు. రూ.లక్షలు, కోట్లలో పన్ను చెల్లించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్న సూచనలతో వారి నుంచి ఎలాగైనా పన్ను వసూలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తారు. మొండిబకాయిదారులు కొందరు పన్ను చెల్లింపునకు ఆసక్తి చూపకపోవడంతో కనీసం చెక్కులైనా ఇవ్వాలని బిల్ కలెక్టర్లు సూచిస్తుంటారు. ఇలా వసూలు చేసిన చెక్కుల్లోనే మెజార్టీ బౌన్స్ అవుతున్నట్టు

మిగతా 8వ పేజీలో..

58 వేలకుపైగా చెక్కులు...

పదేళ్లలో జీహెచ్‌ఎంసీలో 58 వేలకుపైగా చెక్కులు బౌన్స్ అయ్యాయి. అనంతరం ఇందులో కొన్నింటికి సంబంధించిన చెల్లింపులు జరిగాయని ఐటీ విభాగం వర్గాలు చెబుతున్నాయి. గతంతో పోలిస్తే చెక్కులతో పన్ను చెల్లింపులో మార్పులు చేశారు. అంతకుముందు చెక్కు ఇచ్చిన అనంతరం పన్ను చెల్లించినట్టు రశీదు ఇచ్చేవారు. నాలుగేళ్ల క్రితం ఈ విధానంలో మార్పు చేశారు. బ్యాంకులో చెక్కు క్లియర్ అయిన అనంతరం ఆ సమాచారం జీహెచ్‌ఎంసీలోని ఈఆర్‌పీకి వస్తుంది. ఆ తరువాత పన్ను చెల్లింపు పూర్తవుతుంది. క్లియర్ అయ్యాయా..? లేదా..? అన్న దానిపై స్పష్టత రాక ముందే చెక్కుల అమౌంట్‌ను వసూలైనట్టు అధికారులు ఆర్థిక సంవత్సరం చివర్లో ప్రకటిస్తున్నారు. అనంతరం కొన్ని చెక్కులు బౌన్స్ అవుతుండడంతో తుదకు పన్ను వసూలులో వ్యత్యాసం ఉంటోంది.

జోన్ల వారీగా బౌన్స్ అయిన చెక్కుల వివరాలు...

జోన్	చెక్కులు
ఎల్‌బీనగర్	11478
చార్మినార్	5109
ఖైరతాబాద్	12392
సికింద్రాబాద్	10630
శేరిలింగంపల్లి	6968
కూకట్‌పల్లి	11484
మొత్తం	58061



నీటి బకెట్‌లో పడి

చిన్నారి మృతి

జీడిమెట్ల,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బకెట్ నీటిలో పడి ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. చింతల్ అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్న సుధాకర్, బిందు భార్యాభర్తలు. వీరికి రియా (ఏడాది కుమార్తె) ఉంది. శుక్రవారం మధ్యాహ్నం బిందు ఇంటి ముందు బట్టలు ఉతుకుతుండగా రియా ఆ పక్కనే నీటిబకెట్ వద్ద ఆడుకుంటోంది. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి ఊపిరాడక మృతి చెందింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లి.. పాపను నీటిలో నుంచి తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిక్ అప్ బాయ్ ముసుగులో

గంజాయి రవాణా

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ కామర్స్ కంపెనీకి చెందిన పికప్ బాయ్ ముసుగులో గంజాయి తరలిస్తున్న యువకుడితో పాటు సరఫరాదారుడిని మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకులబావి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా

మిగతా 8వ పేజీలో..



100% చెత్త సేకరణ 8

గ్రేటర్ ఆర్టీసీకి భారంగా మహాలక్ష్మి

- రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో సర్కారు ఆలస్యం

మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో సిటీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. అయినా, ఆర్టీసీ ఆర్థిక కష్టాల నుంచి మాత్రం గట్టెక్కలేకపోతున్నది.



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో గ్రేటర్‌లో బస్ టికెట్ల ఆదాయం భారీగా తగ్గింది. గతంలో రోజుకు రూ.4 కోట్ల నుంచి 4.5 కోట్ల ఆదాయం వస్తే ఉచిత ప్రయాణం ప్రారంభం తర్వాత రూ. 2.5 కోట్ల నుంచి 3 కోట్లు మాత్రమే వస్తున్నది. అంటే రోజుకు సుమారు రెండు కోట్ల వరకు ఆదాయం తగ్గింది. ఈ లెక్కన నెలకు రూ. 60-70 కోట్ల ఆదాయం తగ్గింది. జీరో టికెట్ల చార్జీలను ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తున్నా సమయానికి నిధులు అందకపోవడంతో ఆర్టీసీలో ఆర్థిక సమస్యలు పెరుగుతున్నాయి. గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 2,800 బస్సులు నడుపుతుండగా డీజిల్ ఖర్చులకే రోజుకు రూ. 1.5 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్టీసీకి రూ.1,500 కోట్ల నుంచి 2,000 కోట్ల నిధులు కేటాయిస్తే పెద్దసంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు కొనేందుకు అవకాశముంటుందని

మిగతా 8వ పేజీలో..



మందులు భద్రం

- తగిన ఉష్ణోగ్రతలో ఉంచాల్సిందే
- లేకుంటే పాడైపోతాయంటున్న వైద్యులు
- నిబంధనలు పాటించని దుకాణాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అనేక మెడికల్ దుకాణాల్లో ఏసీ, రిఫ్రిజిరేటర్ వంటి సదుపాయాలు ఉండడం లేదు. వేసవిలో మందులను రిఫ్రిజిరేటర్లలో భద్రపర్చకపోతే పాడైపోతాయని, వ్యాధుల నియంత్రణకు పనిచేయవని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిఫ్రిజిరేటర్, ఏసీ ఉన్న మెడికల్ దుకాణానికే ఔషధ నియంత్రణ సంస్థ డ్రగ్‌లైసెన్స్ ఇస్తుంది. మందుల నిల్వకు సదుపాయాలు ఉన్నాయా..లేవా అని పరిశీలించిన తరువాతే అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. క్యాన్సర్, న్యూరాలజీ, గుండె, మధుమేహానికి సంబంధించిన మందులు, కొన్ని రకాల ఇంజెక్షన్లు, వ్యాక్సిన్లు, ఇన్సులిన్లు, ఫ్లూయిడ్స్, వడదెబ్బకు ఉపయోగించే ఆర్ఎల్ఎన్ ఫ్లూయిడ్స్, క్రీములు, ఆయింట్‌మెంట్లు, కొన్ని రకాల యాంటీబయాటిక్స్, హార్మోన్లు, ఎంజైమ్స్‌కు సంబంధించిన మందులను చల్లటి వాతావరణంలో ఉంచాలి. అయితే అనేక మెడికల్ దుకాణాల నిర్వాహకులు నిబంధనలను పాటించడం లేదు. చాలా మెడికల్ దుకాణాల్లో ఎక్కడపడితే అక్కడ మందులను ఉంచుతున్నారు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయని మందులను గ్లాస్‌బాక్స్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. చాలా దుకాణాల్లో డబ్బాలు, అట్టపెట్టెల్లో పెడుతున్నారు. కొన్ని మందులను కిందపడేస్తున్నారు. కిరాణా దుకాణాల మాదిరిగా నిర్వహిస్తున్నారు.

నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద నిల్వ చేయాలి



గుండె, క్యాన్సర్, మధుమేహం, కిడ్నీ జబ్బులకు సంబంధించిన మందులను నిర్ణీత ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి. లేకుంటే పనిచేయవు. అటువంటి మందులు వాడినా ప్రయోజనముండదు. ప్రాణాంతక వ్యాధులు, మధుమేహానికి వినియోగించే మందులను తప్పనిసరిగా తగిన ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి. లిక్విడ్ మందుల సీల్ జాగ్రత్తగా ఉన్నాయా, బాటిల్స్‌లో పగుళ్లు ఉన్నాయా అనేది గమనిస్తూ ఉండాలి.

- డాక్టర్ కరుణాకర్ రాపోలు, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, అపోలో ఆస్పత్రి

అక్కరకు రాని 'జన ఔషధి'

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రద్దీ లేనిచోట ఏర్పాటు

8

- పైచేయి కోసం కసరత్తు
- ఇప్పటికే రెండు కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో..
- మరో రెండుచోట్ల 'కారు' ఖాళీకి వ్యూహాలు
- శివారు మున్సిపాలిటీల్లో ఆపరేషన్ ఆకర్ష్

మల్కాజిగిరి.. హస్తం గురి!



ఉప్పల్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిని కైవసం చేసుకోవాలని భావిస్తున్న అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరతీసింది. తొలుత జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌పై అసమ్మతిని పెట్టి పీఠాన్ని కైవసం చేసుకుంది. ఈక్రమంలోనే బోడుప్పల్, పీర్జాదీగూడ కార్పొరేషన్ల పరిధిలో కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ సక్సెస్ అవ్వడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నారు. పార్లమెంట్ సీటును 'పట్నం' ఖాతాలో వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా దృష్టి సారించారు.

నిజాంపేటపై ఫోకస్

నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో 33 మంది కార్పొరేటర్లు ఉండగా ముగ్గురు మాత్రమే కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి గెలిచిన మేయర్ కొలను నీలారెడ్డి, డిప్యూటీ మేయర్‌తో సహా మరో 9 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారు. దీంతో కాంగ్రెస్ బలం మూడు నుంచి పన్నెండుకు పెరిగింది. మరో పదిమంది

మిగతా 8వ పేజీలో..

మొదలైన ప్రచార జోరు

మూడు పార్టీలూ ముమ్మరంగా..



ప్రచారంలో సునీత మహేందర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాగిడి లక్ష్మారెడ్డి

మచ్చబొల్లారం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అతిపెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో పాగా వేసేందుకు మూడు పార్టీల అభ్యర్థులూ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ పార్టీకి సిట్టింగ్ స్థానం అయినందున, మరోసారి హస్తగతం చేసుకోవాలని భావిస్తోంది. ఒక్కొక్కరుగా బీఆర్ఎస్, బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు ప్రధానంగా ఫోకస్ చేయడంతో భారీ మెజారిటీతో గెలుస్తామన్న ధీమాతో కాంగ్రెస్ ఉంది. దేశంలో మోదీ హవా నడుస్తుండడం, ఈటల రాజేందర్‌కు అందరివాడన్న పేరుండడంతో బీజేపీ గెలుస్తుందన్న ఆశతో ఆ పార్టీ శ్రేణులు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో ఉన్న ఏడు స్థానాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే గెలవడం, రాగిడి లక్ష్మారెడ్డి స్థానికుడు కావడంతో బీఆర్ఎస్ విజయం తథ్యమని ఆపార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నారు.

ఎవరి కోణంలో వారు..

మరోవైపు ముగ్గురు అభ్యర్థులు కూడా పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందామని చెబుతూ పట్నం సునీతారెడ్డి ప్రచారం సాగిస్తున్నారు. కేంద్రంలో సుస్థిరమైన పాలన అందిస్తూ, ప్రపంచపటంలో భారతదేశానికి గౌరవం తెస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి మరొకసారి పట్టం కట్టాలని, ఈటల రాజేందర్ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. పదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిని చూసి తనను గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ప్రజలను కోరుతున్నారు. ఇలా ముగ్గురికి ముగ్గురూ విభిన్న తరహాలో ప్రచారం సాగిస్తున్నారు.



పాదయాత్ర చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ

అసద్ ప్రచారం ఆరంభం

- కార్యకర్తలతో కలిసి ఒవైసీ పాదయాత్ర

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ముగియడంతో మజ్లిస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ వందలాది మంది కార్యకర్తలను వెంట తీసుకుని బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గంలోని కామాటిపురా, ఉస్మాన్‌బాగ్‌లతో పాటు బొందలగూడ ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు జెండాలు పట్టుకుని బస్తీల్లో తిరుగుతూ పతంగ్ గుర్తుకు ఓటు వేసి ఒవైసీని గెలిపించాలని నినాదాలు చేశారు. మజ్లిస్‌కు విజయం చేకూర్చాలని హ్యాండ్ మైక్ పట్టుకుని అసదుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. పోలింగ్‌రోజున టీవీలు చూస్తూ ఇళ్లకే పరిమితం కాకుండా బూత్‌లకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో వలస వెళ్లిన భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భారత్ నిర్మాణంలో జియాలజిస్టులు భాగస్వాములు కావాలి

కొత్తపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆత్మ నిర్భర్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని భారత భూగర్భ పరిశోధన సంస్థ(జీఎస్ఐ) డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాద్ జియాలజిస్టులకు పిలుపునిచ్చారు. బండ్లగూడలోని జీఎస్ఐ శిక్షణ సంస్థ(టీఐ)లో శిక్షణ పూర్తి చేసుకున్న 47వ బ్యాచ్ 84 మంది జియాలజిస్టులకు శుక్రవారం ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ ప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి దోహదపడే క్రిటికల్, స్ట్రాటజిక్ ఖనిజ సంపద నిక్షేపాల అన్వేషణ ధ్యేయంగా జియాలజిస్టులు అడుగులు ముందుకు వేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి ప్రొఫెషనల్ జియాలజిస్టులుగా తయారైన వారందరూ దేశాభివృద్ధికి తమ నైపుణ్యాన్ని వినియోగించాలని జీఎస్ఐ టీఐ డీడీజీ, హెడ్ విఙషన్ -5 డాక్టర్ మాథ్యూజోసెఫ్ అన్నారు. సీనియర్ జియో సైంటిస్ట్, ఫ్యాకల్టీ డా.మల్లేష్ గంజి మాట్లాడారు. కార్యక్రమంలో డీడీజీలు, వివిధ విభాగాల డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న జియాలజిస్టులతో డీజీ జనార్ధన్ ప్రసాద్, డీడీజీలు



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో రామేశ్వర్‌రావు తదితరులు

భవిష్యత్తు కృత్రిమ మేధదే..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ వ్యవస్థ తోపాటు.. ప్రతి రంగంలో కృత్రిమ మేధ(ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు అన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ సహకారంతో శుక్రవారం గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐలో ఏఐ, మెషీన్ లెర్నింగ్స్ ప్రాముఖ్యతపై ఒకరోజు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్‌రావు మాట్లాడుతూ విస్తారమైన డేటాను విశ్లేషించేందుకు, యంత్రాలు, పనితీరు మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన నైపుణ్య నిర్ణయాల్లో కృత్రిమ మేధ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఫైట్ క్లబ్ వ్యవస్థాపకులు ప్రమోద్, మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్ నితిన్ కిషోర్ ఈ సందర్భంగా తమ అనుభవాలు పంచుకున్నారు.

తల్లిదండ్రుల నుంచి వచ్చే జబ్బులపై ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి అవగాహన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వచ్చే కంటి వ్యాధులపై అవగాహన కల్పించనున్నట్లు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ మంజుశ్రీ భాతే తెలిపారు. దగ్గరి బంధువుల మధ్య జరిగే వివాహాలకు సంబంధించి దంపతులకు నేత్ర సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. దీనివల్ల జన్యుమార్పులు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వివరించారు. రెటీనా, కార్నియా, లెన్స్, కంటి నరాల ఇబ్బందులు ఉంటాయన్నారు. ఇలాంటి సమస్యలను సరైన సమయంలో గుర్తించి జన్యుపర పరీక్షలు చేయించుకోవడం అవసరమైన చికిత్సలు తీసుకోవడం చాలా అవసరమని అన్నారు.

రేపు సితార్ ఫర్ మెంటల్ హెల్త్ కచేరీ



రిషబ్ రిఖిరామ్ శర్మ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సితార్ ఫర్ మెంటల్ హెల్త్ టూర్‌లో భాగంగా ఈనెల 14న మాదాపూర్‌లోని డిస్ట్రిక్ట్ 150లో హెల్త్ కచేరీని నిర్వహిస్తున్నట్లు సుప్రసిద్ధ సితార్ వాద్యకారుడు, మ్యూజిక్ ప్రొడ్యూసర్, మానసిక ఆరోగ్య ప్రచారకర్త రిషబ్ రిఖిరామ్ శర్మ తెలిపారు. సోమాజిగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సితార్ ఫర్ మెంటల్ హెల్త్ అనేది కేవలం ఓ కచేరీ మాత్రమే కాదని, శబ్దం సరిహద్దులను అధిగమించి, మానవ మనస్సు లోతులలోకి చేరే ఓ పరివర్తన ప్రయాణమని అన్నారు.



హోమం నిర్వహిస్తున్న విశాఖ శారదా పీఠాధిపతులు

రాజశ్యామల ఆలయంలో గర్భన్యాసం

నార్సింగ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ శ్రీశారద పీఠం ఆధ్వర్యంలో కోకాపేట్‌లో నిర్మిస్తున్న శ్రీశారద స్వరూప రాజశ్యామల అమ్మవారి ఆలయంలో గర్భన్యాసం(పేఠా స్థాపన) కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశాఖ శారదా పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీస్వాత్మానందేంద్ర స్వామి పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన జగద్గురు సన్నిధిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాస్తు హోమాలు, గోపూజ, పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశారదా స్వరూప చంద్రమౌళీశ్వర స్వామి ఆరాధన చేశారు. పూజా కార్యక్రమంలో ఎన్‌సీఎల్‌టీ న్యాయమూర్తి బద్రీనాథ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు, స్థానిక గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

‘శ్రీరామ నవమిని ప్రశాంతంగా జరుపుకోవాలి’

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న శ్రీరామ నవమిని ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి సూచించారు. శుక్రవారం జంగమ్మెట్ మార్కెట్, రవీందర్‌నాయక్ నగర్, హనుమాన్ టెంపల్ తదితర ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ పర్యటించారు. శ్రీరామనవమి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులను కలిసి కార్యక్రమ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంట ఎస్‌ఐ నాగరాజు, స్థానిక కాలనీ ప్రెసిడెంట్ ఎ.కృష్ణా నాయక్, శ్రీను, రాజేశ్ తదితరులు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తాడెం శ్రీనివాస్‌రావు తదితరులు

శోభాయాత్రను జయప్రదం చేయాలి

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాతనగర శ్రీరామసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామ నవమి శోభాయాత్రను జయప్రదం చేయాలని అధ్యక్షుడు తాడెం శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పుగూడలోని తన కార్యాలయంలో శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరామనవమి శోభాయాత్ర ఏప్రిల్ 17న సాయంత్రం 4.30 గంటలకు తానాజీనగర్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. శోభాయాత్రలో మల్కాజ్‌గిరి, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థులు ఈటెల రాజేందర్, మాధవీలత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.



డీసీపీ గిరిధర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ రాకేశ్‌జైశ్వాల్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, కార్పొరేటర్ శంకర్‌యాదవ్

శోభాయాత్రను పకడ్బందీగా నిర్వహిస్తాం

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ శోభాయాత్రను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తామని, అందుకోసం పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తూర్పు మండల డీసీపీ రావుల గిరిధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం డీసీపీ కార్యాలయంలో కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ జి.శంకర్ యాదవ్‌లు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శ్రీరామనవమి శోభాయాత్ర, హనుమాన్ జయంతి ర్యాలీని విజయవంతంగా ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని డీసీపీ అన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే.. మూసీ నదిలో వేసినట్టే...

- రోడ్డు షోలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేస్తే, అది మూసీ నదిలో వేసినట్టేనని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గుడిమల్కాపూర్ నుంచి మెహిదీపట్నం, పద్మనాభనగర్‌లో బైక్‌ర్యాలీ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మూడోసారి నరేంద్రమోదీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశ ప్రజల కోసం అహర్నిషలు కష్టపడుతున్న మహోన్నతమైన వ్యక్తి నరేంద్రమోదీ అని ఆయన కొనియాడారు. నాంపల్లి నియోజకవర్గంలో ఓట్లు చీలకుండా మనమంతా ఐక్యంగా ఉండి బీజేపీని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి అన్నపురం రమేశ్‌కుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాహుల్ చంద్ర, డివిజన్ అధ్యక్షులు ముఖేశ్, జనార్ధన్‌రావు, విజయ్, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

పహాడిషరీఫ్ ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని, ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ అన్నారు. శుక్రవారం ఎర్రకుంటలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్ఫుద్దీన్ మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎంతో బలంగా ఉన్నదని అన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మళ్లీ రాష్ట్రంలో కరెంట్, తాగునీటి సమస్యలు తీసుకొచ్చిందని విమర్శించారు. శనివారం చేవెళ్లలో జరిగే ప్రజాఆశీర్వాద సభకు నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ప్రజా సేవకు అంకితమైన బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి, కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామన్నారు. సమావేశంలో అంజాద్‌ఖాన్, అబ్దుల్ రవుఫ్, షాకేర్ బైగ్, సాయద్ ఫెరోజ్, బర్కత్ అలీ, సాయద్ ఫర్హాన్, అలీ మన్సూరి, సలీం పాల్గొన్నారు.



అలిజాకోట్ల వద్ద ప్రచారం చేస్తున్న మజ్లిస్ నాయకులు

ప్రజల ఆశీస్సులున్నంత వరకు

హైదరాబాద్‌లో మజ్లిస్‌ను ఓడించలేరు

చార్మినార్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అల్లా కృప, ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకూ హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీని ఎవరు ఓడించలేరని ఎమ్మెల్యే జుల్ఫీకర్ అలీ, ఎమ్మెల్సీ రిజాజుల్ హసన్ పేర్కొన్నారు. శుక్రవారం చార్మినార్ నియోజకవర్గంలోని అలిజా కోట్ల కమాన్ నుంచి ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా స్థానిక కార్పొరేటర్లతో కలిసి వారు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీని ఓడించాలని జాతీయ స్థాయిలో కుతంత్రాలు చేస్తున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన మజ్లిస్‌ను ఓడించాలేరన్నారు. ప్రభుత్వాలతో కోట్లాడి నిధులు తీసుకొచ్చి హైదరాబాద్ లోకసభ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి చేశామన్నారు. దివంగత మజ్లిస్ అధినేత సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ పాతబస్తీలోని ప్రజలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం, విద్య అందించాలని ఓవైసీ హస్పిటల్, అసరా హస్పిటల్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సోహైల్ ఖాద్రి, ముజాఫర్ అలీ, నస్రీన్ సుల్తానా, సాహిల్ అక్బర్ గౌస్, ఆలందార్ వాజాహి, మజ్లిస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అంబేడ్కర్ జయంతిని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, కోశాధికారి రగడంపల్లి శ్రావణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు రాజేంద్రనగర్, మహేశ్వరం ఎమ్మెల్యేలు పి. ప్రకాశ్‌గౌడ్, పి. సబితారెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గడ్డం రంజిత్‌రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తోపాటు కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పలుగుచెరువు మహేశ్, కె.ఎస్ దయానంద్, మంత్రి చంద్రశేఖర్, పి. జీవన్‌దాస్, పంబాల రాజు, గోల్కొండ రాజు, డి.రమేశ్, పత్యార రాజు, అనుముల జాన్‌పాల్, కోరని మహాత్మా, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

‘హైదరాబాద్’లో బీఆర్‌ఎస్‌కు

పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధం

గోషామహల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బ్రహ్మకుమారీలు ఆయనను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పాతబస్తీలో అభివృద్ధి కుంటుపడిందని.. తనను గెలిపిస్తే హైదరాబాద్ (పాతబస్తీ) నగరాన్ని బంజారహిల్స్, జూబ్లీహిల్స్‌గా తీర్చిదిద్దుతానని అన్నారు. ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.



గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



చేవెళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీటీడీ బోర్డు సభ్యురాలు, రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి సీతారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని చేవెళ్ల ప్రజలు ఆదరించి మరో ఆవకాశం కల్పించాలని కోరారు. ఎంపీగా గెలిచి ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని చెప్పారు. ప్రజలు నిండుమనస్సుతో రంజిత్‌రెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. ప్రచారంలో ఆమె వెంట చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారు శైలజా, కాంగ్రెస్ పార్టీమండల మహిళ అధ్యక్షురాలు దేవర సమతరెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనే సరితారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల జెడ్పీటీసీ దంపతులు

చేవెళ్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చేవెళ్ల జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి దంపతులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో రంజిత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసిన మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి దంపతులు, పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జెడ్పీటీసీ దంపతులకు రంజిత్‌రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చారి పామెన బీంభరత్, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకటరెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల జెడ్పీటీసీ దంపతులు

కేంద్రం నిధులిచ్చినా.. అప్పటి సీఎం పక్కదారి పట్టించారు



బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిపై పూలు జల్లి ఆశీర్వదిస్తున్న బురుజుగడ్డ తండా గిరిజన మహిళలు

శంషాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ భారీగా నిధులు ఇచ్చినా, అప్పటి ప్రభుత్వం ఆ నిధులను దారిమళ్లించి రాష్ట్ర ప్రగతిని కుంటుపరిచిందని పరోక్షంగా మాజీ సీఎం కేసీఆర్‌పై బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిపులు చెరిగారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని బురుజుగడ్డతండా, చిన్నగోల్కొండ, శంకరాపూర్, కొత్తగూడ, పెద్దగోల్కొండ, ముచ్చింతల, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, షాపూర్ తండా, సంఫీగూడ, మదనపల్లి గ్రామాలలో ప్రజాఆశీర్వాదసభల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. మరోమారు నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చేసి దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు.

మోదీ చేస్తున్న కృషిని విదేశాల అధికారులు, రాజకీయ నాయకులు ప్రశంసిస్తున్నారని విశ్వేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్ర ప్రగతికోసం ప్రధాని మోదీ కోట్లాది నిధులు ఇస్తే ఆనాటి రాష్ట్ర సీఎం కేసీఆర్ కేంద్ర నిధులను ఇతర శాఖలకు మళ్లించారని ఆరోపించారు. మారుమూల గ్రామాల్లో వైకుంఠధామాలు, రైతు వేదికలు, రోడ్లకు వాడిన నిధులు కేంద్ర ప్రభుత్వ నిధులేనని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకుల లిక్కర్ దందా, ఫోన్ల ట్యాపింగ్‌తో వేగసతమతమవుతున్నారని అన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, మాజీ సర్పంచ్ సుజాత, కంద శ్రీను, ప్రశాంత్, లక్ష్మయ్య, గండురాజు తదితరులున్నారు.

మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు దేశ ప్రజలు సిద్ధం

తాండూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మోదీని మూడోసారి ప్రధానిని చేసేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. ఎన్నికల్లో తన భర్తను గెలిపించాలని కోరుతూ తాండూరు నియోజకవర్గంలో ఆమె శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన వ్యక్తి మోదీ మాత్రమేనని స్పష్టం చేశారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు. గొప్ప సహజవనరులున్న వికారాబాద్‌లో ఆయన ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తారని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అంతకుముందు తాండూరు చేరుకున్న సంగీతారెడ్డి స్థానికంగా ఉన్న వైద్యులతో ఓ హోటల్ హిమాలయాలో సమావేశమయ్యారు. అనంతరం స్థానిక విఘ్నేశ్వరుడి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. సంగీతారెడ్డి వెంట తాండూరు బీజేపీ నాయకులు ఉన్నారు.

ముచ్చట మూడోసారి బీజేపీదే విజయం

యాలాల: పార్లమెంట్ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీజేపీదే విజయం ఖాయమని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆమె బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సంగీతరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా బీజేపీ పవనాలు వీస్తున్నాయన్నారు. చేవెళ్ల నియోజకర్గం నుంచి బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముతురాజ్, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, దేవనూర్ మాజీ సర్పంచ్ శివకుమార్, నాయకులు రమేష్, నరేష్ పాల్గొన్నారు.



తాండూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

జల్‌పల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ కన్ను

- మైనార్టీ ఓట్లు పొందేందుకు కసరత్తు
- బీఆర్‌ఎస్, ఎంఐఎం, బీజేపీల నుంచి చేరికలు

పహాడిషరీఫ్ ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలైనా ఓ వర్గానికి చెందిన ఓట్లే ఫలితాలను తారుమారు చేస్తాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు గెలుపు కోసం తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తుంటారు. ఈ క్రమంలో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో మైనార్టీ ఓట్లపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మున్సిపాలిటీలోని లక్షకు పైగా ఉన్న మైనార్టీ ఓట్లు గంపగుత్తగా వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి గతంలో తనకున్న పరిచయాలతో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు, కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్పిస్తున్నారు. మజ్లిస్ నాయకులను సైతం తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉండగా ఎంఐఎంకు 15, బీఆర్‌ఎస్‌కు 12, బీజేపీకి ఒకరున్నా రు. కాంగ్రెస్ పార్టీకి ఒక్క కౌన్సిలర్ కూడా లేరు. ఈ నేపథ్యం లో మున్సిపాలిటీపై కాంగ్రెస్ గురిపెట్టింది. ఇటీవల బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, ఎంఐఎం, బీజేపీ కౌన్సిలర్లను పార్టీలో చేర్చుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి భారీ మెజారిటీ సాధించిన బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మరింత ఎక్కువ మెజారిటీ సాధిస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాయకులు పార్టీ మారినా ప్రజలు తమవైపే ఉన్నారని చెబుతున్నారు.

పదేళ్లలో బీజేపీ ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదు: రంజిత్‌రెడ్డి

పూడూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిర్జాపూర్ గేటు సమీపంలో పార్టీ సీనియర్ నాయకుడు కద్మూరు ఆనందం వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం పూడూరు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. గ్రామాల్లో నిరుద్యోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీ దేశాన్ని భష్టుపట్టించిందని వారు విమర్శించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలంటే రంజిత్‌రెడ్డిని చేవెళ్ల నుంచి గెలిపించాలన్నారు. ఎన్నికల తర్వాత ఇందిరమ్మ కమిటీ ఏర్పాటుచేసి కార్యకర్తలకు అన్నివిధాలుగా చేయూతనందిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

పూడూరు మండలం బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు పెద్దఉమ్మెంతల్ బీఆర్‌ఎస్ పార్టీ మాజీ సర్పంచ్ శ్రీధర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు ముక్కంటి, కో-ఆప్షన్ సభ్యులు అయ్యూబ్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కుద్బుల్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సురేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్, అజీం పటేల్, షకిల్, వీరేష్, లక్ష్మణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి: ఎమ్మెల్యే



రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న శ్రీనివాస్ గుప్తా

బషీరాబాద్: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాత రైసుమిల్లు వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల మండల విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల నాయకులు పి.శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఖాలేద్, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, తాజామాజీ సర్పంచులు ఎం.నర్సిరెడ్డి, సత్యమ్మ, గాయత్రి, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, పి.వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు బంటురాజు, బోయిని వెంకటయ్యలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 200మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌ప్రసాద్, జి.మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/hF8QBqS లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

మాజీ కార్పొరేటర్‌పై కేసు నమోదు

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారు ప్రకాష్, అతని అనుచరులపై ఆసిఫ్‌నగర్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మధ్యాహ్నం బీజేపీ పార్టీలో చేరేందుకు బంగారు ప్రకాశ్ తన అనుచరులతో కలసి గుడిమల్కాపూర్ నుంచి ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీకి అనుమతి లేకపోవడంతో ఎన్నికల అధికారి గాంధీ ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ప్రకాష్‌తోపాటు పలువురిపై ఆసిఫ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పార్కింగ్ స్థల విషయంలో గొడవ

కత్తితో దాడిచేసిన ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్కింగ్ స్థల విషయంలో గొడవ పడిన ఘటనలో కత్తితో దాడిచేసిన ఇద్దరు పాత నేరస్థులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బార్కస్ ప్రాంతానికి చెందిన షేక్ సాజిద్ (28) పాత నేరస్థుడు. ఇతడిపై 9 కేసులున్నాయి. బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. భవానినగర్‌కు చెందిన షేక్ అమీర్ అలియాస్ అమ్ము అలియాస్ ఏటీఎం(37) ఆటోడ్రైవర్. ఇతడు కూడా 3 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వారిద్దరూ ఈనెల 9వ తేదీన నాగులచింత క్రాస్‌రోడ్స్‌లో ఉన్న వైన్ బార్ అండ్ రెస్టారెంట్‌కు వెళ్లారు. అదే సమయంలో బార్ నుంచి మద్యం తాగి పార్కింగ్ ప్రాంతంలోకి పవన్ అనే వ్యక్తి వచ్చాడు. వీరిద్దరికి.. పవన్‌కు మధ్య చిన్న విషయంలో గొడవ జరిగింది. గొడవ పెరిగి పెద్దది కావడంతో సాజిద్, అమీర్ ఇద్దరు బ్లేడు లాంటి చాకుతో పవన్‌పై దాడిచేశారు. దాడిలో పవన్ గొంతు, చెవికి గాయాలయ్యాయి. గమనించిన వైన్ బార్ ఉద్యోగి శ్రీనివాస్ వీరిని వారించే ప్రయత్నం చేయగా, సాజిద్, అమీర్ అతడిపై దాడి చేశారు. శ్రీనివాస్ ముఖంపై గాయమైంది. అనంతరం వీరిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో దీనిపై కేసునమోదయింది. శుక్రవారం సాజిద్, అమీర్‌లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని, మొఘల్‌పురా పోలీసులకు అప్పగించారు.

వైన్‌షాప్ వద్ద ఘర్షణ.. ఆరుగురికి గాయాలు

కార్వాన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గుడిమల్కాపూర్ కాలబైరవ వైన్స్ వద్ద గురువారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... గుడిమల్కాపూర్ కాలబైరవ వైన్‌షాప్ పక్కన స్థలంలో చేపల వ్యాపారి అభిలాష్ వద్దకు మద్యం మత్తులో ఉన్న స్వామి వచ్చి ఘర్షణకు దిగాడు. దాంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటుండగా, ఇద్దరికి సంబంధించిన మరికొంత మంది రెండు గ్రూపులుగా ఏర్పడి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలికి వచ్చి గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆశ్రమ బాలురకు నోట్ బుక్‌ల పంపిణీ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలురకు ఎన్‌ఎండీసీ ఉద్యోగ సంఘం ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కేశవగిరిలోని కారుణ్యభారతి ఆశ్రమానికి అసోసియేషన్ తరఫున బ్యాగులు, నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బి.హనుమంతరావు, పవన్‌కుమార్, దీపిక, సత్యనారాయణ, ఆశ్రమ కార్యదర్శి పాండుచారి పాల్గొన్నారు.

జనావాసాల మధ్య

42 అంతస్తులతో భవన నిర్మాణం

- తక్షణమే నిలిపివేయాలి: ధర్మయుద్ధ సంఘం

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య 42 అంతస్తులతో నిర్మిస్తున్న భవనాలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని అవినీతి నిర్మూలన ధర్మయుద్ధ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. శివకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం. పురుషోత్తమ్, ఉపాధ్యక్షుడు జి. విజయ్‌కాంత్, సంయుక్త కార్యదర్శి ఎం. రాజేష్, మీడియా కార్యదర్శి ఎం.ఎల్. మల్లికార్జున్ రావులు మాట్లాడారు. గన్‌ఫౌండ్రీ డివిజన్ ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా జనావాసాల మధ్య 4 వేల గజాల విస్తీర్ణంలో 42 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారని, ఇది వ్యాపార సముదాయం కాదని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే 21 అంతస్తుల నిర్మాణ పనులు పూర్తయ్యాయని మరో 21 అంతస్తుల పనులు జరుగుతున్నాయని, ఈ భారీ భవన నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మీనాక్షి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జీహెచ్‌ఎంసీ వద్ద అనుమతి తీసుకుని ఈ భారీ భవనం నిర్మిస్తుందన్నారు. అనుమతుల మంజూరులో జీహెచ్‌ఎంసీ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ప్రస్తుత ప్రభుత్వం దీనిపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అబిడ్స్‌లోని పుల్లారెడ్డి స్వీట్‌హౌస్ పక్కన 2 వేల గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకున్నా భవన నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతున్నారని వీటిపై కూడా జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



కొనేవారు లేక వెలవెలబోతున్న పీఎంబీ జనఔషధి కేంద్రం

అక్కరకు రాని 'జన ఔషధి' కేంద్రం

● మందుల ధరలు తక్కువే అయినా..
ప్రయాణికుల నుంచి ఆదరణ కరువు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అక్కరాని చుట్టమును.. అన్నట్లుగా తయారైంది సికింద్రాబాద్ స్టేషన్‌లోని ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం(పీఎంబీజేకే) పరిస్థితి. ప్రయాణికులకు నాణ్యమైన మందులను తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో భారతీయ రైల్వే దేశవ్యాప్తంగా 50 రైల్వే స్టేషన్లలో జన ఔషది కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.10లక్షల చొప్పున సుమారు రూ.5కోట్లు ఖర్చుచేసింది. మార్చి 12న దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండు పీఎంబీజేకేలను ఏర్పాటు చేయగా, అందులో ఒకటి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ నంబరు ప్లాట్‌ఫారం వెలుపల ఏర్పాటు చేశారు. నిజానికి ఇది ప్రజలకు అత్యవసరమైన సౌకర్యమే అయినప్పటికీ.. ప్రయాణికుల రద్దీ అంతగా ఉండని ప్రదేశంలో ఏర్పాటు చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఉద్దేశం నెరవేరడం లేదు. స్టేషన్‌కు వచ్చిపోయే ప్రయాణికులతో పాటు సాధారణ ప్రజలకు కూడా ఇది ఉపయోగపడాలని, జన ఔషదీ కేంద్రం ఏర్పాటుకు అత్యంత రద్దీ ప్రదేశాన్ని ఎంపిక చేయాలని సూచించారు. అయినప్పటికీ రైల్వే ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా ఇటు రైల్వే ప్రయాణికులకు, అటు నగరవాసులకు ఎంతగానో ఉపయోగపడాల్సిన ఈ జన ఔషదీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ప్లాట్‌ఫారం 1కి వెలుపల ఏర్పాటు చేస్తే ఎంతో ఆదరణ లభించేదని, ప్లాట్‌ఫారం 10లో అన్ని హంగులతో ఏర్పాటు చేసినప్పటికీ కొనుగోలు చేసేవారు లేక వెలవెలబోతోందని రైల్వే ఉద్యోగులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు రోజువారీ ఉపయోగించే బీపీ, షుగరు, కార్డియాలజీ.. తదితర వ్యాధులకు అవసరమైన జనరిక్ మందులు మార్కెట్ రేటుకన్నా ఇందులో 50శాతం తక్కువ ధరకు లభిస్తాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రయాణికులు, సాధారణ ప్రజలకు ఉపయోగపడేలా జన ఔషదీ కేంద్రాన్ని ప్లాట్‌ఫారం 1 వెలుపల రద్దీ ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీలో 18 వరకు భద్రాద్రి తలంబ్రాల బుకింగ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఇంటివద్దే పొందాలనుకునే భక్తులు ఏప్రిల్ 18 వరకు బుకింగ్ చేసుకోవచ్చని గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ సీటీఎం (లాజిస్టిక్స్) మధుసూదన్ తెలిపారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల ద్వారా తలంబ్రాలు పొందాలనుకునే భక్తులు రూ. 151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే శ్రీరామ నవమి అనంతరం తలంబ్రాలు అందజేస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లలో 90 లాజిస్టిక్ కేంద్రాల్లో బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వాటితో పాటు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల వద్ద బుక్ చేసుకునే సౌకర్యం ఉంటుందని రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రవణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తెలిపారు.



సమస్యను కోదండరామ్‌కు విన్నవిస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

కానిస్టేబుల్ ట్రైనింగ్‌కు అనుమతి ఇప్పించాలి

తార్నాక, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : 2022లో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తమను ట్రైనింగ్‌కు అనుమతించేవిధంగా చొరవ తీసుకోవాలని కోరుతూ కానిస్టేబుల్ అభ్యర్థులు శుక్రవారం తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్‌కు విజ్ఞప్తి చేశారు. తార్నాకలోని ఆయన నివాసంలో ఆయనను కలిసిన అనంతరం వారు మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తమకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆర్డర్ కాపీలను అందజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తమపై మోపిన తప్పుడు కేసులను కారణంగా చూపించి ట్రైనింగ్‌కు తీసుకోవడం లేదని, న్యాయస్థానం కూడా తమను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఇచ్చిన జడ్జిమెంట్ కాపీలను ఎస్బీ ఎంక్వయిరీలో పొందుపరిచామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల నిర్ణయంతో 168 మంది జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేసులు క్లోజ్ అయిన ప్రతి ఒక్క అభ్యర్థిని ట్రైనింగ్‌కు అనుమతించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వేర్వేరు ప్రాంతాలకు వేసవి ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 23 నుంచి జూన్ 25 వరకు ముజఫర్‌పూర్- సికింద్రాబాద్(05293) ప్రత్యేక రైలు ప్రతి మంగళవారం, ఏప్రిల్ 25నుంచి జూన్ 27వరకు సికింద్రాబాద్-ముజఫర్‌పూర్(05294) ప్రత్యేక రైలు ప్రతి గురువారం నడుస్తుందని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 20 నుంచి జూన్ 29వరకు గోరఖ్‌పూర్-మహబూబ్‌నగర్(05303) ప్రతి శనివారం, ఏప్రిల్ 22నుంచి జూలై1 వరకు మహబూబ్‌నగర్-గోరఖ్‌పూర్(05304) ప్రతి సోమవారం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 13 నుంచి మే25వరకు భువనేశ్వర్- యెల్హంక (02811) ప్రత్యేక రైలు ప్రతి శనివారం, ఏప్రిల్ 15 నుంచి మే27 వరకు యెల్హంక- భువనేశ్వర్ (02812)ప్రత్యేక రైలు ప్రతి సోమవారం నడుస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుంచి మే 18 వరకు ఎస్ఎస్ఎస్ హుబ్లీ-గోమతినగర్ (07305)ప్రత్యేక రైలు ప్రతి శనివారం, ఏప్రిల్ 16 నుంచి మే 21 వరకు గోమతినగర్- ఎస్ఎస్ఎస్ హుబ్లీ (07306)ప్రత్యేక రైలు ప్రతి మంగళవారం నడుస్తుందని, జబల్‌పూర్-కన్యాకుమారి (02122) ప్రత్యేక రైలు ప్రతి గురువారం, ఏప్రిల్ 20నుంచి జూలై 27 వరకు కన్యాకుమారి-జబల్‌పూర్ (02121)ప్రత్యేక రైలు ప్రతి శనివారం నడుస్తుందని తెలిపారు. ఏప్రిల్ 19 నుంచి మే 31వరకు ఎర్నాకుళం-న్యూఢిల్లీ (06071)ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం, ఏప్రిల్ 22 నుంచి జూన్ 3వరకు న్యూఢిల్లీ- ఎర్నాకుళం (06072)ప్రత్యేక రైలు ప్రతి సోమవారం నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

గ్రేటర్ ఆర్టీసీకి భారంగా మహాలక్ష్మి!

(5వ పేజీ తరువాయి)

ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కార్మికసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. గ్రేటర్‌జోన్‌లో రెండు వేల నాన్ ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు నడిపితే డీజిల్ ఖర్చులు తగ్గడంతో పాటూ ఆర్టీసీ నష్టాలు భారీగా తగ్గించుకునే అవకాశాలు మెరుగుపడుతాయని రవాణారంగ నిపుణులు సూచిస్తున్నారు.

బస్‌పాస్‌లపై ఎఫెక్ట్

ఉచిత ప్రయాణంతో బస్‌పాస్‌ల సంఖ్య భారీగా తగ్గింది. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు గ్రేటర్‌జోన్‌లో 4 లక్షల బస్‌పాస్‌లుంటే, నేడు 2.82 లక్షలే ఉన్నాయి. ఆదాయం నెలకు రూ. 15 కోట్ల వరకు తగ్గింది. టికెట్ల ఆదాయంతోపాటు పాస్‌ల ఆదాయం తగ్గడంతో గ్రేటర్‌జోన్‌లో రోజు వారీ ఖర్చులకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మహాలక్ష్మి ఉచిత ప్రయాణానికి సంబంధించి రీయింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్న గ్రేటర్ అధికారులు ఆ లెక్కలు మాత్రం వెల్లడించడం లేదు.

పిక్ అప్ బాయ్ ముసుగులో గంజాయి రవాణా

(5వ పేజీ తరువాయి)

ఉన్న ఇద్దరు యువకులను పట్టుకుని పోలీసులు విచారించారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయి, ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకున్నారు. విచారించగా ఒడిశాలో నౌపాడా ప్రాంతానికి చెందిన గిర్దారి కొన్నిరోజుల ముందు ఒడిశా రాష్ట్రానికి వెళ్లి 2 కేజీల గంజాయిని కేజీకి రూ.2,500 చొప్పున కొనుగోలు చేసి నగరానికి తీసుకొచ్చాడు. లాల్‌బజార్‌కు చెందిన స్నేహితుడు రోహిత్ (ఈ కామర్స్ కంపెనీ పిక్‌అప్ బాయ్) వద్ద ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్స్‌గా రూ.10వేలు తీసుకున్నాడు. గంజాయి ఇచ్చి మిగతా రూ.30వేలు తీసుకుంటున్న సమయంలో పోలీసులు వారిని పట్టుకున్నారు.

క్రీడలలో మహిళల భద్రత ఇప్పటికీ ఓ సమస్యే..!

● పూర్వ ఒలింపియన్ నేహా అగర్వాల్ శర్మ

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో మహిళల భద్రత ఇప్పటికీ ఓ సమస్యే. ఈ కారణం చేతనే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు క్రీడల్లోకి వెళ్తానంటే ఇష్టపడటం లేదని పూర్వ ఒలింపియన్ నేహా అగర్వాల్ శర్మ అభిప్రాయపడ్డారు. యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వై ఫ్లో) శుక్రవారం మాదాపూర్‌లోని టీ హబ్‌లో నిర్వహించిన షాటరింగ్ స్టీరియోటైప్స్ సదస్సుకు ఇరానియన్ మోటర్ సైక్లిస్ట్, ఫ్యాషన్ డిజైనర్ డాక్టర్ మరల్ యజర్లూ ప్యాట్రిక్, డెసర్ట్ మారథానర్, లిమ్కా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ హోల్డర్ మిచెల్ కకడ్‌తో పాటుగా హాజరయ్యారు.

వై ఫ్లో చైర్‌పర్సన్ రిధి జైన్‌తో పలు అంశాలపై ఈ ముగ్గురూ ముచ్చటించారు. ఆ సందర్భంలోనే ఇటీవలి కాలంలో ఇండియన్ రెజ్లింగ్



చర్చలో మాట్లాడుతున్న నేహా అగర్వాల్ శర్మ, తదితరులు

సంఘంలో చోటుచేసుకున్న సంఘటనలపై నేహా అగర్వాల్ శర్మ వ్యాఖ్యానించారు. అయితే ఇటీవలి కాలంలో ఈ అంశం పరంగా కొద్దిపాటి మార్పులు కనిపిస్తుండటం ఆశాజనకంగా ఉందని ఆమె వెల్లడించారు. భారతీయ మహిళలకు ఇప్పుడు స్వర్ణయుగమని, పురుషులతో సమానంగా క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. 2024 పారాఒలంపిక్ క్రీడల్లో కేవలం వంద రోజుల సమయం ఉందన్నారు. గతంలో 7పతకాలు సాధించామని, ఈసారి అది రెట్టింపు అవుతుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడల్లో రాణించిన మహిళల గురించి వివరించారు.

డాక్టర్ మరల్ యజర్లూ మాట్లాడుతూ అమ్మాయిల బైకింగ్ అంటే భద్రత పరంగా కొన్ని సమస్యలు ఉంటాయన్నారు. డెసర్ట్ మారథాన్ రన్నర్ మిచెల్ కకడ్ మాట్లాడుతూ రన్నింగ్‌కు వయసు అడ్డంకి కాదన్నారు. తాను 45 ఏళ్ల వయసులోనే గోల్డెన్ క్వాడ్రిలాటెరల్ యాత్ర చేశానన్నారు. తనకంటే పెద్ద వయసు వారెంతోమంది మారథాన్‌లలో పాల్గొంటున్నారని, అథ్లెట్స్‌కు స్పాన్సర్‌షిప్ దొరకటం కష్టమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు యంగ్ ఫిక్కీ లేడీస్ సభ్యులు పాల్గొన్నారు.

అన్ని క్రీడలకు ఆదరణ లభించాలి

● సీవీ ఆనంద్



బహుమతులు ప్రదానం చేస్తున్న సీవీ ఆనంద్, సానియా మీర్జా

బంజారాహిల్స్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): క్రికెట్‌తో పాటు మిగతా క్రీడలకు ఆదరణ లభిస్తే క్రీడాకారులకు మేలు జరుగుతుందని రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో సీబీ రాజు మెమోరియల్ పురుషుల విభాగం టెన్నిస్ టోర్నమెంట్ బహుమతి ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్నప్పటికీ చాలామంది టెన్నిస్, ఇతర క్రీడల్లో ఆర్థిక స్థోమత లేక రాణించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపీఎల్ ద్వారా క్రికెట్‌కు స్పాన్సర్లు ఉన్నారని, ఇదే మాదిరిగా టెన్నిస్‌కు కూడా ప్రోత్సాహం దక్కాలని అన్నారు. ఫుట్‌బాల్, టెన్నిస్ ఇలా పలు రకాల క్రీడలను, క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అనంతరం సానియా మీర్జా మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లేందుకు డబ్బులు లేక కూడా చాలా మంది క్రీడాకారులు క్రీడలకు దూరమవుతున్నారని, దీనివల్ల విలువైన క్రీడాకారులు దేశానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టోర్నమెంట్ పురుషుల విభాగంలో డబుల్స్‌లో రన్నరప్‌గా ఢిల్లీకి చెందిన రిక్కీ చౌదరి, ఒడిశాకు చెందిన కబీర్ హన్స్ గెలుపొందగా, సింగిల్స్ విభాగంలో రన్నరప్‌గా జె.విష్ణువర్ధన్, విన్నర్‌గా గుజరాత్‌కు చెందిన దేవ్ జాబియా గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు ఆదిశేషగిరిరావు, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ చాముండేశ్వరినాథ్, సెక్రటరి ముళ్లపుడి మోహన్, మాజీ అధ్యక్షుడు కేఎల్.నారాయణ, కాజా సూర్యనారాయణ, పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టులు కళ్లలాంటి వారు

● మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



రాజేష్ భార్య లావణ్యకు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్ల లాంటి వారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వృత్తి ఒత్తిడితో ఫొటో జర్నలిస్టుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఫొటో జర్నలిస్టు నర్రే రాజేష్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ సతీమణి లావణ్యకు లక్ష రూపాయల చెక్కును శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని అన్నారు. వాటికోసం ఫొటో జర్నలిస్టులు పడే ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. నర్రే రాజేష్ సతీమణికి పెన్షన్‌తో పాటు పిల్లలకు విద్యను అందించడానికి మీడియా అకాడమీ సహాయం చేస్తుందన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి మీడియా రంగంలో వృత్తిబాధ్యతలను నిర్వహిస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్ అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, జేఎన్‌జేహెచ్ఎస్ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మాదిగలకు టికెట్ ఇవ్వకపోతే

కాంగ్రెస్ గో బ్యాక్ ఉద్యమం

● ఎంపీ టిక్కెట్ల కేటాయింపుపై పునరాలోచించుకోవాలి
● మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దళితుల్లో అత్యధిక జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గానికి పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఒక్క సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వర్గీకరణను వ్యతిరేకించే వారికి టిక్కెట్లు ఇచ్చి తమను అవమానించిందని, ఎంపీ టిక్కెట్ల కేటాయింపుపై పునరాలోచించి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ గో బ్యాక్ ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ నాయకులను మాదిగ పల్లెల్లో తిరుగనివ్వమని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు ఎందుకు ఎంపీ సీటు ఇవ్వలేదో మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు వేసిన ప్రశ్నకు టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి, మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలన్నారు. మూడు ఎస్సీ రిజర్వ్ సీట్లలో రెండు స్థానాలు ఇవ్వాలని, ఒక్క సీటుకు కూడా 70 లక్షల జనాభా ఉన్న మాదిగలు అర్హులు కారా, వారు ఓట్లు వేయకపోతే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటన్నారు. కాంగ్రెస్ మాదిగలను అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీలో సభ్యత్వం లేని కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యకు ఏవిధంగా టిక్కెట్ ఇస్తారని, ఇప్పటికే కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేలుగా, ఉపముఖ్యమంత్రిగా ఉన్న వారికి టిక్కెట్ ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. మాదిగ సామాజిక వర్గం నుంచి ఎంపీని పార్లమెంటుకు పంపవద్దనే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోత్కుపల్లి నర్సింహులును అవమానిస్తే మాదిగలను, తమను అవమానించినట్లేనని అన్నారు. తమ జాతిని అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ,లక్ష్మణ్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, సతీష్ మాదిగ, భైరపోగు శివకుమార్ మాదిగ, రేణుక పాల్గొన్నారు.

పేద వర్గాలకు ప్రతినిధి ఈటల



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, పక్కన బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తదితరులు

నేరేడ్‌మెట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పేద వర్గాలకు నిజమైన ప్రతినిధి ఈటల రాజేందర్ అని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జేజేనగర్‌లో ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్కాజిగిరి పార్లమెంటు స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తక్కువ శాతం ఉన్న మాలలకు మాత్రమే టిక్కెట్లు ఇస్తున్నాయని విమర్శించారు. మాదిగల ముప్పై సంవత్సరాల కలను ప్రధాని నరేంద్రమోదీ నెరవేర్చారని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మందకృష్ణ మీద మోదీ చూపిన ప్రేమ ఆయన ఒక్కరి మీద కాదని, జాతి అందరి మీద చూపించినట్లుగా భావించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీస్, ఎంఎస్‌పీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా అమ్మకాలా?

● ప్రీలాంచింగ్ పేరిట విక్రయాలపై ఆందోళన
● 'ఇందూర్' ప్రీలాంచింగ్ అమ్మకాలు చేస్తోందంటూ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు పొందకుండానే ఏజెంట్లను నియమించుకుని ప్రీలాంచింగ్ పేరుతో అమ్మకాలు చేస్తుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సాహితీ ఇన్‌ఫ్రా సంస్థ సాహితీ గ్రీన్ ప్రాజెక్టు పేరిట ప్రీలాంచింగ్ పేరుతో 2019లో అమ్మకాలు చేసి రూ.119 కోట్లు వసూలు చేసిందని ఇటీవల బాధితులు టీఎస్ రెరా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనివల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఇందూర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ ప్రీలాంచింగ్ అమ్మకాలు చేస్తోందంటూ ఒకరు ఫిర్యాదు చేశారు. ఇందూర్ ప్రాజెక్టు నిర్వాహకులు మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి గ్రామంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ప్రతిపాదించారు. జీ ప్లస్ 14 అంతస్తుల్లో 3 బ్లాకులు నిర్మించేలా ప్రణాళికలు వేసుకున్నారు. 8,80,154 ఎస్ఎఫ్‌టీలలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం, 2,20,000 ఎస్ఎఫ్‌టీలలో వాణిజ్య అవసరాలకనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా ప్రాజెక్టు రూపొందించారు. ఇందులో ప్రీలాంచింగ్ పేరుతో ఎస్ఎఫ్‌టీ రూ.3,500 చొప్పున అమ్మకాలు చేసేందుకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నారని నార్తర్న్ బిల్డర్స్ అసోసియేషన్‌కు చెందిన సంజయ్‌గుప్తా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ భూమికి ఓనర్‌షిప్ సర్టిఫికెట్, పట్టా పాస్‌బుక్, నాలా కన్వర్షన్, హెచ్ఎండీఏ అనుమతి, రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ఏజెంట్లను నియమించుకుని అమ్మకాలు సాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెరా రిజిస్ట్రేషన్, హెచ్ఎండీఏ నిబంధనలు పాటించకుండా ప్రీ లాంచింగ్ పేరుతో అమ్మకాలు చేస్తున్నారన్నారు. దీనిపై ఇందూర్ ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉన్న శ్రీకాంత్ రెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తాము ప్రీ లాంచింగ్ అమ్మకాలు చేయడంలేదని, ఏజెంట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేదని తెలిపారు. ఇదే విషయంపై రెరా చైర్మన్ ఎన్. సత్యనారాయణను వివరణ కోరగా ఇందూర్ నిర్వాహకులు రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు ఇచ్చినా, అగ్రిమెంట్ సేల్ చేసినా, ప్రీ లాంచింగ్ అమ్మకాలు జరిపినా విచారణ చేపట్టి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మల్కాజిగిరి.. 'హస్తం' గురి!

(5వ పేజీ తరువాయి)

కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

బోడుప్పల్‌లోనూ అవిశ్వాసం దిశగా..

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని కూడా కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతోంది. 28 మంది కార్పొరేటర్లు ఉన్న బోడుప్పల్ నగరపాలక సంస్థలో గతంలో హస్తం పార్టీకి ఆరుగురి బలం ఉండేది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నుంచి ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి వెళ్లారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మరో ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. స్థానికంగా ఉంటున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి బోడుప్పల్ కార్పొరేషన్ పాలకవర్గంలో అవిశ్వాసం తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మేయర్‌గా ఎన్నికయ్యేలా వ్యూహాలు రచిస్తున్నారు. అవిశ్వాసం పెట్టేందుకు 19 మంది కార్పొరేటర్ల బలం అవసరం ఉండనుంది. ఇప్పటివరకు కాంగ్రెస్ బలం 16కి చేరడంతో మరో ముగ్గురు రావాల్సి ఉంది.

డిప్యూటీ రాకతో పీర్జాదిగూడలో గుబులు

పీర్జాదిగూడ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కుర్రా శివకుమార్ గౌడ్ 11 మంది కార్పొరేటర్లను తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అప్పట్లో 26 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్ నుంచే గెలిచారు. వారిలో కొందరు కాంగ్రెస్‌లోకి చేరడంతో మరో ఇద్దరి సహకారంతో అవిశ్వాసం పెట్టబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మేయర్ జక్కాను పీఠం దింపేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు దర్గా దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ క్రమంలోనే మరో ఎనిమిది మంది కార్పొరేటర్లు ఇప్పటికే కాంగ్రెస్ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరిలో కారు పార్టీని ఖాళీ చేసి కాంగ్రెస్ కంచుకోటగా మార్చే దిశగా నియోజకవర్గ నేతలు అడుగులు వేయాలని ఇప్పటికే సంకేతాలు అందజేశారని తెలుస్తున్నది.

కూన శ్రీశైలం చేరికతో కొంపల్లిపై ఆశలు

కొంపల్లి మున్సిపల్ చైర్మన్ స్థానం ప్రస్తుతం బీఆర్ఎస్ ఖాతాలో ఉంది. అక్కడ బీజేపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు పాలకవర్గంలో ఉన్నారు. కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్ గూటికి రావడంతో బీఆర్ఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లను కాంగ్రెస్‌లోకి చేర్చుకుని బీజేపీ మద్దతుతో అవిశ్వాసం పెట్టేందుకు ప్లాన్ వేస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు మరదలు బీఆర్ఎస్ నుంచి చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. దీంతో బీఆర్ఎస్ పటిష్టంగా ఉండటంతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

100% చెత్త సేకరణ

● బస్తీల్లో వీక్లీ యాక్షన్ ప్లాన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యంగా చేపట్టిన వీక్లీ యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో రోడ్ల పక్కన చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా బస్తీ సమావేశాలు, స్వచ్ఛ ట్రాలీల్లో చెత్త వేయని ఇళ్ల గుర్తింపు, ర్యాలీల నిర్వహణ, పౌరుల్లో ప్రేరణ కలిగించే కార్యక్రమాలు, ఓపెన్ గార్బేజ్ పాయింట్ల వద్ద ముగ్గులు వేయడం, వీధి వ్యాపారుల కమిటీలతో సమావేశం, ప్రతిజ్ఞ చేయించడం వంటి కార్యక్రమాలు రోజుకొకటి చేపట్టాలని సూచించారు. పలు సర్కిళ్లలో వీక్లీ యాక్షన్ ప్లాన్ అమలుపై కమిషనర్ ఉద్యోగులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఖజానాకు చేరని రూ.160కోట్లు

(5వ పేజీ తరువాయి)

అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇక ముందు చెక్కులు తీసుకోవద్దనే విషయంపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు. రికార్డు స్థాయి పన్ను వసూలైన దృష్ట్యా.. ఏర్పాటుచేసిన గెట్ టు గెదర్ సమావేశంలో కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఈ విషయం ప్రస్తావించారు. దీనిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. బౌన్స్ అవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా చెక్కులు తీసుకోకుండా ఉంటే ఎలా ఉంటుందన్నది పరిశీలిస్తున్నారు. ఉన్నతాధికారులతో చర్చించిన అనంతరం దీనిపై సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చే అవకాశముంది. చెక్కులు తీసుకోవద్దని నిర్ణయిస్తే.. ప్రభుత్వ ఆమోదం పొందాల్సి ఉంటుందని ఉన్నతాధికారొకరు చెప్పారు.


రాజకీయ ప్రసంగాలు ఉండొద్దు

(5వ పేజీ తరువాయి)


కోఠి, ఆంధ్రా బ్యాంక్, సుల్తాన్‌బజార్ మీదుగా హనుమాన్ వ్యాయామశాల వరకు కొనసాగుతుంది. ఎన్నికల కోడ్ ఉన్నందున శోభాయాత్రను అనుకున్న సమయంలో ప్రారంభించి రాత్రి 10 గంటలకల్లా ముగించడానికి నిర్వాహకులు సహకరించాలని సీపీ కోరారు. కమాండ్ కంట్రోల్ నుంచి, సీసీ కెమెరాలు, డ్రోన్లతో యాత్రను ప్రతి క్షణం పర్యవేక్షిస్తామన్నారు. యాత్రలో పాల్గొనే భక్తులకు మంచినీటి సరఫరా, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు. కోడ్ అమలులో ఉన్నందున నిర్వాహకులు పార్టీలకు సంబంధించిన గుర్తులు వాడకుండా జాగ్రత్తలు పాటించాలని సీపీ కొత్తకోట హెచ్చరించారు. సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, శోభాయాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే.. ఆన్‌లైన్‌లో అధికారులతో కూడా సీపీ సమావేశం నిర్వహించి బందోబస్తుపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

నకిలీ నోట్ల విక్రేతల అరెస్ట్


● రూ.500 లను ముద్రించి చెలామణి చేసేందుకు యత్నం



రూ.500 నోటు (నకిలీది)



అభినందన్



గంగరాజు

రాజేంద్రనగర్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): నకిలీ ఐదు వందల రూపాయల నోట్లను చెలామణి చేయడానికి ప్రయత్నిస్తున్న చిత్తూరు జిల్లా పుంగనూరు ముఠాను శుక్రవారం శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని మైలార్‌దేవుపల్లి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవుపల్లిలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఇద్దరు యువకులు నకిలీ కరెన్సీని చెలామణి చేయడానికి ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.500 నోట్ల కట్టలలో అసలు నోట్ల మధ్యన నకిలీ నోట్లు పెట్టి మోసం చేస్తున్నారని గుర్తించారు. పట్టుబడిన ఇద్దరు యువకులు చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన గంగరాజు, అభినందన్‌లుగా గుర్తించారు. వారి నుంచి రూ.6.62లక్షల విలువ చేసే రూ.500 నోట్ల కట్టలు పదింటిని స్వాధీనం చేసుకున్నారు. గంగరాజు స్టాక్ మార్కెట్లో పెద్ద ఎత్తున డబ్బు పోగొట్టుకోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని ఈ పనికి పూనుకున్నట్లు తెలిసింది. రెండు నెలల క్రితం మహారాష్ట్రకు చెందిన సచిన్ పవార్, సురేశ్ పవార్‌లతో ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన నకిలీ కరెన్సీ వీడియోను చూసి, వారిని సంప్రదించారు. మార్కెట్‌లో పరీక్షించడానికి నమూనాగా రూ.ఐదు వందల నకిలీ నోట్లను 10 కొనుగోలు చేసి సికిందరాబాద్‌కు చేరుకుని లక్కీ అనే వ్యక్తి ద్వారా మార్కెట్‌లో వాటిని మార్పిడి చేయించారు. దీంతో గంగరాజు రూ.3.5లక్షలు చెల్లించి రూ.17లక్షల నకిలీ నోట్లను తీసుకుని బెంగళూరుకు, ఆ తర్వాత హైదరాబాద్ చేరుకున్నారు. అద్దెకు తీసుకున్న ఓ బైక్‌పై మైలార్‌దేవుపల్లిలోని ఓ హోటల్‌కు వచ్చి డబ్బు మార్పిడీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి వారిని పట్టుకున్నారు. అయితే, రూ.500 నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉండాల్సిన చోట చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉంది. చిరువ్యాపారులు రూ. 500లను తీసుకునే సమయంలో ఈ మార్పును గమనించాలని సూచించారు. మైలార్‌దేవుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 13 ఏప్రిల్ 2024

వంటిల్లు

ఎండాకాలంలో చల్ల చల్లగా!

వేసవిలో డీహైడ్రేషన్ సమస్య ఎక్కువగా వస్తుంది. తరచూ మంచి నీళ్లు, కొబ్బరి నీళ్లు తాగాలి. వీటితో పాటు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఇంట్లోనే సులువుగా కొన్ని రకాల జ్యూస్‌లను తయారు చేసుకోవచ్చు. అవే ఇవి..



కీరా జ్యూస్

కావాల్సిన పదార్థాలు

కీర దోసకాయ- 1, అల్లం- ముక్కలు పావు టీస్పూన్, జీలకర్ర- పావు టీస్పూన్, వాము- పావు టీస్పూన్, పుదీనా ఆకులు- 10, ఉప్పు- 1 టీస్పూన్, పటిక బెల్లం- 4 టీస్పూన్లు, నీళ్లు- 800 మి.లీ., నిమ్మకాయ- ఒకటి

తయారీ విధానం

కీర దోసకాయను తొక్క తీయకుండా చిన్న ముక్కలుగా చేసుకోవాలి. జ్యూస్ జార్‌లో కీర దోస ముక్కలు, అల్లం, జీలకర్ర, వాము, పటికబెల్లం, పుదీనా ఆకులు, ఉప్పుతో పాటు నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని పలుచటి గుడ్డతో వడగట్టాలి. ఆ తర్వాత నిమ్మరసం కలిపి సర్వ్ చేయాలి. ఈ కీర జ్యూస్ తాగితే ఎండాకాలంలో ఫ్రెష్‌గా, కూల్‌గా ఉంటుంది. ఈ పానీయం తరచుగా తాగటం వల్ల వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.



పుదీనా జ్యూస్

కావాల్సిన పదార్థాలు

పుదీనా- ఒక కట్ట, బ్లాక్ సాల్ట్- అర టీస్పూన్, అల్లం- చిన్న ముక్క, జీలకర్ర- అర టీస్పూన్, వాము- అర టీస్పూన్, తులసి ఆకులు- 4, తేనె- 4 టీస్పూన్లు, పటిక బెల్లం- 4 టీస్పూన్లు, నీళ్లు- లీటర్, సబ్జా గింజలు - టీస్పూన్

తయారీ విధానం

ముందుగా చిన్న జార్‌లో పుదీనా ఆకులు, తులసి ఆకులు, అల్లం, జీలకర్ర, బ్లాక్ సాల్ట్, వామును గ్రైండ్ చేసి పక్కన ఉంచుకోవాలి. ఈ మిశ్రమాన్ని జ్యూస్ జార్‌లో వేసి సరిపడ నీళ్లు వేశాక.. పటిక బెల్లం వేసి ఒకసారి మిక్సీ పట్టాలి. దీన్ని వడపోసి తేనె కలపాలి. ఈ మిశ్రమానికి సబ్జా గింజలు కలిపితే పుదీనా జ్యూస్ రెడీ.



స్పెషల్ మజ్జిగ

కావాల్సిన పదార్థాలు

మజ్జిగ- 4 గ్లాసులు, నాలుగు గ్లాసుల నీళ్లు, పెరుగు- 3 టేబుల్ స్పూన్లు, అల్లం ముక్క- చిన్నది, పచ్చిమిర్చి- 1 (చిన్నది), ఉల్లిపాయ- చిన్నది, జీలకర్ర- పావు టీస్పూన్, వాము- పావు టీస్పూన్, కొత్తిమీర- కొద్దిగా, పుదీనా ఆకులు- 4, ఉప్పు- 1 టీ స్పూన్.

తయారీ విధానం

జ్యూస్ జార్‌లో అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, జీలకర్ర, వాము, కొత్తిమీర, పుదీనా ఆకులు, పెరుగు వేసి మిక్సీ పట్టాలి. ఇందులో నాలుగు గ్లాసుల మజ్జిగ, నాలుగు గ్లాసుల నీళ్లు పోయాలి. చివరగా ఉప్పు వేసి మరోసారి మిక్సీ పట్టి సర్వ్ చేయాలి. ఈ స్పెషల్ మజ్జిగ ఎంతో రుచికరంగా ఉంటుంది.



బెల్లం జ్యూస్

కావాల్సిన పదార్థాలు

బెల్లం పొడి- 4 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి- అర టీస్పూన్, శొంఠి పొడి- అర టీస్పూన్, యాలకుల పొడి- పావు టీస్పూన్, ఉప్పు రుచికి తగినంత, పటిక బెల్లం- 1 టేబుల్ స్పూన్, సబ్జా గింజలు- 2 టీస్పూన్లు, నిమ్మకాయ- ఒకటి, నీళ్లు- లీటర్

తయారీ విధానం

ముందుగా సబ్జా గింజలు నానబెట్టుకోవాలి. ఆ తర్వాత నీళ్లలోకి బెల్లం పొడి వేసి కరిగించాలి. ఆ తర్వాత వెంట వెంటనే మిరియాల పొడి, శొంఠి పొడి, యాలకుల పొడి, ఉప్పు వేసి బాగా మిక్స్ చేయాలి. ఆ తర్వాత కొద్దిగా పటికబెల్లం వేయాలి. దీని వల్ల రుచి పెరుగుతుంది. ఈ మిశ్రమంలో నానబెట్టిన సబ్జా గింజలు వేసి బాగా కలపాలి. చివరలో నిమ్మరసం వేసి తాగితే టేస్టీగా ఉంటుంది.



శైలజ
సైలాస్ కిచెన్, యూట్యూబ్ ఛానల్, asksailaw@gmail.com

వేసవికి విరుగుడు
నారికేళ క్షీరపాకం!

కొబ్బరి వల్ల ప్రయోజనాలు అనేకం. ఈ విషయాన్ని మన పూర్వీకులు ఎప్పుడో గుర్తించారు. అందుకే దక్షిణ భారత దేశంలో దీనిని విరివిగా సాగు చేసేవారు. ఈ విషయాన్ని క్షేమకుతూహలం గ్రంథంలో క్షేమశర్మ కూడా ప్రముఖంగా ప్రస్తావించాడు.

తెన్ అంటే దక్షిణ దిక్కు. దక్షిణ భారతంలో ఎక్కువగా లభ్యమవుతుంది కాబట్టి దీనికి టెంకాయ అని కూడా అనవచ్చు. కొందరు తేనె+కాయ అని కూడా వ్యుత్పత్తి చెబుతారు. కొబ్బరిని దక్షిణాది వారు మాత్రమే కాదు. ఉత్తరాది వారు కూడా ఎక్కువగానే వాడతారు. 1860లలో కొబ్బరి గురించి పాశ్చాత్యులకు తెలిసింది. 19వ శతాబ్దం నుంచి దీనిని అమెరికన్లు కూడా విరివిగా వాడటం మొదలుపెట్టారు.

కలిపి మెత్తగా దంచి కుంకుండు గింజంత మాత్ర చేసి రోజూ ఒకటి తినిపిస్తే పిల్లలు పక్కతడపటం ఆగుతుంది. కొబ్బరి చెట్టు చుట్టూ దుప్పట్లు పరిచి ఉంచితే కొబ్బరి చెట్టు పూలు రాలి పడతాయి. వీటితో టీ కాచుకుని తాగుతుంటే అరికాళ్ళ మంటలు, షుగరు వ్యాధి వలన వచ్చే ఉపద్రవాలు తగ్గుతాయి. క్షేమసాగరంలో కొబ్బరితో పాయసం ఎలా చేయాలో కూడా వివరించారు.

తయారీ విధానం

కొబ్బరి ముక్కల్ని పాలలో వేసి పాలన్నీ ఇగిరేంతదాకా బాగా ఉడికించి, అన్నం మెతుకంత సన్నని ముక్కలుగా తరగండి. విడిగా తగినన్ని పాలు తీసుకుని పంచదార కలిపి రెండుమూడు పొంగులు వచ్చేదాకా కాచి.. సన్నగా తరిగిన ఈ కొబ్బరిని అందులో కలపండి. ఏలకులు వగైరా సుగంధ ద్రవ్యాలు చేర్చండి. చల్లారాక చిటికెడంత పచ్చకర్పూరం వెయ్యండి. కొబ్బరి తురుముని కూడా పాలలో వేసి పంచదార కలిపి పాయసం కాయొచ్చుగదా అని అడగవచ్చు. కానీ కొబ్బరిని పాలలో ఉడికించటం ఒక శుద్ధి ప్రక్రియ. రెండవ అంశం కొబ్బరిని ముద్దలా మిక్సీ పట్టి పాలలో వేసిన దానికన్నా ఇలా సన్నగా తరిగి పాలలో కలిపితే పంటికిందకు మెత్తని ముక్కలొచ్చి అదనపు రుచినిస్తాయి. మరీ పలుచగానూ, మరీ చిక్కగానూ కాకుండా గరిట జారుగా కాచిన ఈ కొబ్బరి పాయసం రుచికరంగా ఉంటుంది. ఇలా తయారు చేసిన కొబ్బరి పాయసం మృదువుగా తియ్యగా ఉంటుంది. నూనె స్వభావం కలిగింది. చలవ చేస్తుంది. వాతాన్ని వేడినీ తగ్గిస్తుంది మూత్రాశయ వ్యవస్థను శుద్ధి చేస్తుంది. బలకరం, పోషణ నిస్తుంది ఆలశ్యంగా అరుగుతుంది. సంతృప్తి నిస్తుంది. పుష్టినిస్తుంది. ఆకలి తీరుస్తుంది.

అల్సర్లకు మందు..

కొబ్బరి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో ప్రధానమైనది అల్సర్లను తగ్గించటం. కొబ్బరి కేవలం కడుపులో మంటను మాత్రమే కాకుండా.. మూత్రంలోను, గుండెలోని మంటలను కూడా తగ్గిస్తుంది. విరోచనాలను ఆపుతుంది. గర్భాశయాన్ని బలోపేతం చేస్తుంది. మూత్రవ్యాధులు ఉన్నవారికి ఇదొక మంచి ఔషధంగా గుర్తించారు. కొబ్బరి బోండాంలో ఉన్న నీటిని ఎళనీరు అనీ.. ఎండిన కొబ్బరి బోండాంని తెలుగులో బొరియ లేదా బొర్రె అనీ.. కొబ్బరి కాయలో నీరంతా ఇంకిపోయిన కొబ్బరిని కురిడీ అనీ.. తురుముని కోప్రా అనీ అంటారు. లేతగా ఉన్న కొబ్బరి ఆహార యోగ్యం. మరీ ముదిరినది నూనె తీయటానికి.. మధ్యస్థంగా ఉండేది ఔషధాల తయారీకి పనికొస్తుంది. కొబ్బరి నీళ్ళు క్షారగుణం కలిగి ఉంటాయి, ఈ నీళ్లలో లవణాలు, ఖనిజాలు శోషని ఆపుతాయి. వడదెబ్బకు విరుగుడుగా పనిచేస్తాయి. లేత కొబ్బరిని, కొబ్బరినీళ్లను కలిపి విక్సీపట్టి తాగితే ఎక్కిళ్ళు వెంటనే ఆగుతాయి. కొబ్బరిని, సమానంగా సైంధవలవణాన్ని కలిపి మెత్తగా నూరి పుటం పెట్టి చేసిన భస్మాన్ని నారికేళ లవణం అంటారు. ఆయుర్వేద మందులషాపుల్లో దొరుకుతుంది కూడా! ఎలాంటి కామెర్లనైనా తగ్గించే శక్తి దీనికుంది. పేగుల్లో వచ్చే అల్సర్లు, గుండెలో మంట, నోటిపూత తగ్గుతాయి. కొబ్బరినీళ్లలో గానీ మజ్జిగలో గానీ అరచెంచా మోతాదులో కలిపి దీనిని తీసుకోవచ్చు. రాలిపడ్డ లేత కొబ్బరి పిందెలు సేకరించుకుని పైన ఉండే పెచ్చు తీసేసి.. లోపలి భాగాన్ని, నువ్వులు, బెల్లంతో

• గంగరాజు అరుణాదేవి



ప్రతి ఒక్కరిదీ ఉరుకుల పరుగుల జీవితమే! కుదురుగా కూర్చుని తినే తీరిక ఎవరికీ ఉండడం లేదు. ఇలా 40% దేశ జనాభా, ఉదయం అల్పాహారాన్ని స్కిప్ చేస్తున్నట్టు గ్రహించిన సుహాసిని సంపత్, ఓ తెలివైన చిట్కా కనిపెట్టింది. రుచికీ, పోషకాలకూ ఏ మాత్రం తీసిపోని ప్రొటీన్ బార్స్‌ను రూపొందించి, అరుదైన ట్రెండ్‌ను సృష్టించింది.

బ్రేక్‌ఫాస్ట్ బదులు
ప్రొటీన్ బార్

వినూత్నం



దేశ జనాభాలో 40% మంది బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేస్తున్నట్టు గణాంకాల ద్వారా తెలుసుకున్న సుహాసిని ఆ విషయాన్ని తన చెల్లెలు అనందిత సంపత్‌తో పంచుకుంది. ఇది 2012 నాటి సంగతి. అప్పట్లో వాళ్లిద్దరూ న్యూయార్క్‌లో ఉండేవారు. ఇద్దరూ కలిసి యోగా తరగతులకు హాజరవుతూ, అందుబాటులో ఉన్న ప్రొటీన్ బార్లను తరచూ తింటూ ఉండేవారు. ఒక రోజు అనందిత ఒక ప్రొటీన్ బార్ కొని, దీన్ని మించిన ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం ఉంటే ఎలా ఉంటుంది? అని అక్క సుహాసినిని అడిగింది. అలాగే ఒకవేళ తానే అలాంటి బార్స్‌ను తయారుచేయగలిగితే, వాటికి యోగా బార్స్ అనే పేరు పెడతానని కూడా చెప్పింది. చెల్లి మాటలతో స్ఫూర్తి పొందిన సుహాసిని అదే ఏడాది ఆ పేరును ట్రేడ్‌మార్క్‌గా చేసుకుంది. అయితే ఆరోగ్యకరమైన ప్రొటీన్ బార్ల తయారీ గురించి అవగాహన పెంచుకోడానికి వాళ్లకు మూడేళ్ల సమయం పట్టింది. "మేం 100% సురక్షితమైన దినుసులనే వాడాలనుకున్నాం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలనుకునే భారతీయుల కోసం భారతదేశంలో దొరికే పదార్థాలనే ఎంచుకున్నాం" అని మీడియాకు వివరించిన సుహాసిని తన యోగా బార్ ద్వారా, రోజుకు 20 గ్రాముల ప్రొటీన్‌ను భారతీయుల చేత తినిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఇంతింతై వటుడింతై...

ఈ అక్కాచెల్లెళ్లు తమ ప్రొటీన్ బార్లలో ఎలాంటి కృత్రిమ పదార్థాలు ఉండకూడదని నిర్ణయించుకున్నారు. అలాగే వాటిని వీలైనంత సహజసిద్ధ పదార్థాలతో తయారు చేయాలనే ఉద్దేశంతో, ఖర్జూరాలు, ఓట్స్, బాదం, తేనెలను ఉపయోగించుకున్నారు. ఉదయం అల్పాహారంగా తినే ఆహారం తినడానికి సౌకర్యంగా ఉండడంతో పాటు రుచి, పోషకాల పరంగా ధీటుగా ఉండాలన్నది వాళ్ల సంకల్పం. అలా అంతిమంగా 2015లో యోగా బార్స్‌ను వాళ్లు మార్కెట్లో ప్రవేశపెట్టారు. ఈ వ్యాపారంలో ఇద్దరు అక్కాచెల్లెళ్లతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితుల పెట్టుబడులు కూడా ఉన్నాయి. యోగా బార్స్ తయారీ కోసం అనుభవమున్న బేకర్స్‌ను కలిసింది సుహాసిని. ప్రారంభంలో వాళ్లు యోగా బార్స్‌ను బెంగుళూరులోని యోగా స్టూడియోల్లో అమ్మకాలకే పరిమితం చేశారు. కానీ తక్కువ సమయంలోనే వాళ్ల యోగా బార్స్ 5 వేల స్టోర్స్‌కు విస్తరించాయి. ఉరుకుల పరుగుల జీవితం గడిపేవాళ్లు, యోగాను ఇష్టపడేవారు ఆ యోగా బార్స్‌ను మళ్లీ మళ్లీ ఆర్డర్ చేయడం మొదలుపెట్టారు. అలా యోగా బార్ కంపెనీ 70 కోట్లకు పైగా వ్యాపారాన్ని విస్తరించుకోగలిగింది.

> ప్రొటీన్ బార్ల తయారీ గురించి అవగాహన పెంచుకోడానికి మూడేళ్ల సమయం పట్టింది. మేం సురక్షితమైన దినుసులనే వాడాలనుకున్నాం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలనుకునే భారతీయుల కోసం భారతదేశంలో దొరికే పదార్థాలనే ఎంచుకున్నాం

ఆరోగ్యం అమ్ముడుపోదు అన్నారు

యోగా బార్ పట్ల వెల్లువెత్తిన విమర్శల గురించి ప్రస్తావిస్తూ "సంగీతాన్ని వినలేని వాళ్లకు డాన్సులు చేసే వాళ్లు పిచ్చివాళ్లలా కనిపిస్తారు. దీన్ని ఆధునిక ఆలోచనాపరుల్లో, అత్యంత ప్రతిభావంతుడైన ఫ్రెడెరిక్ నీషేకు కూడా ఆపాదించుకోవచ్చు. నేనీ కొటేషన్‌ను ఎంచుకోడానికి ఒక కారణం ఉంది. ప్రజలెప్పుడూ మన ఆశయాలను తక్కువ అంచనా వేస్తూ ఉంటారు. వాళ్లకు సాధారణంగా కనిపించని వాటితో సరిపోలని దేన్నైనా వాళ్లు వ్యతిరేకిస్తారు. అయినప్పటికీ గొప్ప కలలను కనడం మానుకోకూడదు. భారతదేశానికి ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తిని తీసుకొచ్చిన మొదట్లో అందరూ 'భారతదేశంలో ఆరోగ్యం అమ్ముడుపోదు' అని విమర్శించారు. కానీ వాళ్ల అభిప్రాయం తప్పు అని మేం నిరూపించగలిగాం" అంటూ తన ప్రయాణం గురించి వివరించింది సుహాసిని.

ప్రముఖ కంపెనీల వాటాలు

సుహాసిని, అనందిత... యోగా బార్లతో పాటు మూస్లి, ఓట్స్, సిరీల్స్‌ను కూడా అమ్మడం మొదలుపెట్టారు. ఆ తర్వాత యోగా బార్ 100 కోట్ల ఆర్థిక లాభాన్ని ఆర్జించే స్థితికి చేరుకుంది. 39% వాటా కోసం ఐటిసి (ఇంపీరియల్ టొబాగో ఆఫ్ ఇండియా) యోగా బార్‌లో 175 కోట్లను పెట్టుబడిగా పెట్టింది. ప్రస్తుతం ఐటిసితో పాటు నెస్లె, డాబర్ లాంటి ప్రముఖ కంపెనీలన్నీ యోగా బార్‌లో వాటాలను కలిగి ఉన్నాయి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లోఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oNUXbpW లో చదవండి.

మేకప్

కళకళలాడే క్లౌడ్ స్కిన్



మెరుపులీనే మ్యాటీ లుక్‌ను తెచ్చిపెట్టే మేకప్ క్లౌడ్ స్కిన్ మేకప్. తాజా ట్రెండ్‌గా మారిన ఈ మేకప్ మెలకువలను తెలుసుకుందాం!

ప్లంప్ అండ్ ప్రైమ్

క్లౌడ్ స్కిన్ మేకప్ కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ముఖాన్ని మాయిశ్చరైజ్ చేసి, మృదువుగా, తేమగా కనిపించేలా చేయడం కోసం ప్రైమర్ అప్లై చేయాలి.

బేస్ ఇలా

ఇన్‌స్టంట్ ఏజ్ రివైండ్ లేదా ఇన్‌స్టంట్ పర్‌ఫెక్టర్‌ను చర్మం మీద అప్లై చేసుకోవాలి. పొడి చర్మానికి సైతం నప్పే ఈ బేస్, చర్మం మీద చక్కగా పరుచుకుని, మెరుపులీనేలా చేస్తుంది.

లైటెనింగ్

ఫౌండేషన్ షేడ్ కంటే కాస్త లైట్‌గా ఉండే లిక్విడ్ కన్‌సీలర్‌ను ముఖం మీద మచ్చల మీద, కళ్ల దిగువన అప్లై చేసుకోవాలి. దీంతో మచ్చలు, కళ్ల కింద నలుపు మటుమాయమవుతాయి.

పౌడర్

తడి స్పాంజీతో సూపర్ స్టే పౌడర్ అప్లై చేసుకోవాలి. మెడ దిగువన, దవడల దగ్గర నుదుటి మీద, కళ్ల దిగువన ఇలా పౌడర్ అద్దవలసిన అవసరం ఉన్న ప్రదేశాల్లో స్పాంజీ అద్దుకుని బ్రష్‌తో అదనపు పౌడర్‌ను దులిపేయాలి.

బ్లష్

బ్లష్ చెక్కిళ్లకే పరిమితం అనుకుంటే పొరపాటు. నిజానికి పర్‌ఫెక్ట్ మేకప్ సొంతం కావాలంటే, చెక్కిళ్లు, చుబుకం, కళ్ల దిగువన, నుదుటి పైన... ఈ ప్రదేశాలన్నిటి దగ్గర బ్లష్‌ను వాడుకోవాలి.

సెట్టింగ్ స్ప్రే

మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో సెట్టింగ్ స్ప్రే స్ప్రే చేసుకోవాలి.

నిమ్మతో హెయిర్ మాస్క్

- బౌల్‌లో టేబుల్ స్పూన్ హెన్నా పౌడర్ తీసుకుని అందులో జుట్టుకు వేసుకునేట్లు పేస్ట్‌లా కలపాలి. ఇందులోకి ఒక కోడిగుడ్డు సొన వేయాలి. సగం నిమ్మకాయను కోసి ఆ రసాన్ని పిండాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు మాస్క్‌లా వేసి ఆరిన తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తే జుట్టు నల్లగా ఉంటుంది.
- టేబుల్ స్పూన్ నిమ్మరసం, నాలుగు టేబుల్ స్పూన్ల పెరుగును బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే తలమీద చల్లగా ఉంటుంది.
- రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నీళ్లు కలపాలి. బాగా కలిపిన తర్వాత ఈ నీళ్లను జుట్టు మాడుకు తగిలేట్లు పట్టించి ఆరిన తర్వాత కడిగేసుకోవాలి. దీనివల్ల జుట్టు మృదువుగా ఉంటుంది.
- బౌల్‌లో టేబుల్ స్పూన్ నిమ్మరసం, రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్ల తేనె వేసి కలపాలి. దీన్ని జుట్టుకు పట్టేట్టు పట్టించి ఆరిన తర్వాత మైల్డ్ షాంపూతో శుభ్రపరచుకోవాలి. దీనివల్ల జుట్టు పెరుగుతుంది.
- రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌లోకి.. టేబుల్ స్పూన్ నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి అరగంట తర్వాత క్లీన్ చేసుకోవాలి. దీనివల్ల జుట్టులోని ఇన్ఫెక్షన్లు తొలగిపోతాయి.
- జుట్టులో చుండ్రు పోవాలంటే కేవలం నిమ్మరసం పట్టించుకున్నా చాలు. దీంతో పాటు సిట్రస్ వల్ల జుట్టులో మంట వచ్చినట్లు కొందరికి ఉంటుంది. దీనివల్ల ఇన్ఫెక్షన్లు పోతాయి.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 13 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com

అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం



- యశ్

ఇప్పటివరకూ పలు భారతీయ భాషల్లో రామాయణంపై ఎన్నో చిత్రాలు వచ్చాయి. వాటిల్లో ఎన్నో అభూత కల్పనలు, వక్రీకరణలు, మార్పులు చోటు చేసుకున్నాయి. క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో రచయితలు, దర్శకులు చేసిన ప్రయోగాల వల్ల కొన్ని సినిమాలు అపఖ్యాతిని మూటగట్టుకున్నాయి. వాటన్నింటికీ భిన్నంగా నిజమైన రామాయణాన్ని వెండితెరపైకి తెచ్చేందుకు తాము సిద్ధమవుతున్నామని హీరో యశ్ చెప్పారు. ఆయన సొంత నిర్మాణ సంస్థ మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్, నిర్మాత నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా రామాయణాన్ని నిర్మించబోతున్నారు. నితీశ్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. 'ఇప్పటివరకూ చాలా రామాయణాలు వెండితెరపైన వచ్చినా అందులో పూర్తిగా రామాయణం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ఏది అనేది తెలియదు. కానీ మేం ఇప్పుడు అసలైన రామాయణాన్ని తీయబోతున్నాం' అని యశ్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రామాయణం చేస్తే బాగుంటుందని నమిత్, నేను చాలా సార్లు అనుకున్నాం. కానీ అంత పెద్ద సబ్జెక్టును తీయాలంటే బడ్జెట్ సరిపోదు. అందుకు నేను కూడా సహ నిర్మాతగా చేరాను. రామాయణానికి నా మనసులో ప్రత్యేక స్థానం ఉంది. దానికోసం ఎంతైనా కష్టపడతాను. అందులో ఉన్న భావోద్వేగాలు, విలువలు గురించి ప్రపంచం అంతా చాటాలి. డీఎన్ఈజీ విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా ఇప్పటివరకూ చూడని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ప్రేక్షకులకు అందించబోతున్నాం' అని చెప్పారు. రామాయణం లాంటి గొప్ప ప్రాజెక్టును ప్రపంచస్థాయి వేదికలపైకి తీసుకెళ్లాలంటే యశ్ లాంటి వారికే సాధ్యం అని నమిత్ మల్హోత్రా చెప్పారు. అయితే ఈ సినిమాలో యశ్ నటుడిగా ఏ పాత్రలో కనిపించనున్నారనే విషయాన్ని బయటపెట్టలేదు. గతంలో ఆయన రావణుడి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా కనిపించనున్నారని టాక్. 'కేజీయఫ్' సిరీస్‌తో హీరోగా స్టార్‌డమ్ దక్కించుకున్నారు యశ్. ప్రస్తుతం ఆయన 'టాక్సిక్' అనే చిత్రం చేస్తున్నారు.

సెప్టెంబర్ 5న 'గోట్'



తమిళ నటుడు విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్). తారస్థాయిలో అంచనాలు ఉన్న ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్టైనర్‌కు వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు వెంకట్‌ప్రభు గురువారం తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించారు. ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రభుదేవా, ప్రశాంత్, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు.



సల్మాన్ 'సికందర్'

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, డైరెక్టర్ ఏ ఆర్ మురుగదాస్ ఓ చిత్రం కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. రంజాన్ సందర్భంగా ఈ మూవీ టైటిల్‌ను ఖరారు చేశారు. 'సికందర్'గా ఈ చిత్రానికి టైటిల్ పెట్టినట్లు సల్మాన్ ఖాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటించారు. సాజిద్ నదియద్‌వాలా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఈద్ కానుకగా 2025లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన సాంకేతిక బృందాన్ని, నటీనటులు వివరాల్ని ప్రకటించాల్సి ఉంది.

కార్తికేయ... వాయు వేగం

కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా ప్రశాంత్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. 'భజే వాయువేగం' అనే టైటిల్‌ను చిత్రబృందం ఖరారు చేసింది. శుక్రవారం మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో క్రికెట్ బ్యాట్‌తో కార్తికేయ పరుగు తీస్తుండగా, నేపథ్యంలో కరెన్సీ ఎగురుతూ కనిపించింది. టైటిల్, పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి, సినిమా ఘన విజయం అందుకోవాలి అని మహేశ్‌బాబు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాణసంస్థ యూవీ కాన్సెప్ట్స్ సన్నాహాలు చేస్తోంది. ఐశ్వర్యమీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'హ్యాపీడేస్' ఫేమ్ రాహుల్ టైసన్ ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి రాజశేఖర్



చాలా రోజుల తర్వాత డాన్స్ చేశా

- వరలక్ష్మీ శరత్‌కుమార్

వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'శబరి'. అనిల్ కాట్జ్ దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. తెలుగు, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో మే 3న విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలుగు ట్రైలర్‌ను హీరో వరుణ్‌సందేశ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ 'తెలుగులో తొలిసారి కథానాయిక ప్రాధాన్య చిత్రం చేశాను. మా నిర్మాత కథను నమ్మి రాజీపడకుండా సినిమా చేశారు. చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో డాన్స్ చేశా' అన్నారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'వరలక్ష్మీ గారు నిర్మాత గురించి ఆలోచించే ఆర్టిస్ట్. నిర్మాతగా నా తొలి చిత్రం 'శబరి'. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. ట్రైలర్ బీభత్సంగా ఉంది, సినిమా భారీ విజయం అందుకోవాలి అని నటుడు ప్రభు ఆకాంక్షించారు.



యూనిక్ కాన్సెప్ట్‌తో

'వైశాలి' చిత్రాన్ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌ల కాంబినేషన్‌లో వస్తున్న మరో చిత్రం 'శబ్దం'. ఈ సినిమా టీజర్‌ను విక్టరీ వెంకటేశ్ శుక్రవారం విడుదల చేశారు. హీరో ఆది ఒక హాంటెడ్ హౌస్ దగ్గర కొన్ని వింత సంఘటనలు జరిగినప్పుడు విచిత్రమైన శబ్దాలను రికార్డ్ చేయడం కనిపిస్తుంది. ఒక యూనిక్ కాన్సెప్ట్‌తో దర్శకుడు ఈ టీజర్‌ను టెరిఫిక్‌గా ప్రజెంట్ చేశారు. 'వైశాలి'లో రెయిన్ బేస్డ్ సీన్లు చాలా ఉండగా, 'శబ్దం'లోని అధిక శాతం సీన్లను ముంబై, మున్నార్, చెన్నై వంటి పర్యాటక ప్రదేశాల్లో చిత్రీకరించారు. అలాగే ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీ సెట్ వేయడం విశేషం.

సిమ్రన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ తదితరులు నటించిన ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని నిర్మాత సెవన్ జీ శివ చెప్పారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



కల్లు కాంపౌండ్ చెప్పిన కథ


ఓ యదార్థ సంఘటన ఆధారంగా సందేశం, వినోదం కలబోతగా రూపొందిన చిత్రం 'కల్లు కాంపౌండ్ 1995'. గణేశ్, ఆయుషి పటేల్ జంటగా నటిస్తున్నారు. ప్రవీణ్ జెట్టి దర్శకత్వంలో బుర్రా మల్లేశ్‌గౌడ్, హారిక జెట్టి, విజయలక్ష్మి పిట్ల నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "కల్లు కాంపౌండ్ 1995' స్టోరీ డిఫరెంట్‌గా ఉంటుంది. కొత్త తరహా చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. మంచి కథతో పాటు సందేశం ఉంది' అన్నారు. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రం అని నిర్మాతలు తెలిపారు. ఎలాంటి ఆడిషన్ లేకుండానే దర్శక నిర్మాతలు ఈ సినిమాలో అవకాశం ఇచ్చారని గణేశ్ చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆరె సందీప్.

అటు కృష్ణమ్మ... ఇటు దుర్గమ్మ

ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా కేవలం ప్రతిభతో ఒక్కో మెట్టు ఎక్కుతూ మంచి నటుడిగా పేరు తెచ్చుకున్న సత్యదేవ్ తాజా చిత్రం 'కృష్ణమ్మ' రస్టిక్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ మూవీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మాలపాటి నిర్మిస్తున్నారు.



ఈ సినిమా నుంచి 'దుర్గమ్మ' అనే సెలబ్రేషన్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను సాకేత్ కొమండూరి పాడారు. కాలాభైరవ స్వరాలు సమకూర్చారు. నవరాత్రుల సమయంలో దుర్గమ్మ ముందు హీరో సంతోషంగా ఆడి పాడే పాట ఇది. అతీరా రాజ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో లక్ష్మణ్, కృష్ణ, అర్చన, రఘు కుంచె, నందగోపాల్ ఇతర ముఖ్యతారాగణం.



రాజ్ తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్ తరుణ్, రాశీ సింగ్ హీరోహీరోయిన్లుగా నటించే కొత్త చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేశ్ కుడుముల ని దర్శకుడిగా పరిచయం చేస్తూ మురళీధర్ రెడ్డి, కెటిఎన్ శ్రీనివాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో దర్శకుడు మారుతి తొలి క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కు నక్కిన త్రినాథరావు గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఈ నెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. అక్టోబర్‌లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఇది క్రైమ్ కామెడీ. 'స్వామి రారా', 'అంధధూన్' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు.

నిర్మాతల్లో ఒకరైన శ్రీనివాస్ మాట్లాడుతూ 'కథ అద్భుతంగా వచ్చింది. మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'నా ఫేవరెట్ జానర్ క్రైమ్ కామెడీ. చాలా మంచి కథ. మీ అందరి ఆశీస్సులు కావాలి' అన్నారు రాజ్ తరుణ్.

ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, డీఓపి: ఆదిత్య జవ్వాడి, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.

సీతా కల్యాణం అప్పుడే

సుమన్‌తేజ్, గరిమా చౌహాన్ జంటగా నటించిన 'సీతా కల్యాణ వైభోగమే' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అందమైన ప్రేమ కథతో, యాక్షన్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని సతీశ్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. టైటిల్‌లో ఎంత ఫీల్ గుడ్ ఎమోషన్ దాగి ఉందో ఈ లుక్ పోస్టర్ చూస్తుంటే అంత వయలెన్స్ కూడా ఉందనిపిస్తోంది. గగన్ విహారి విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగినీడు, శివాజీరాజా, ప్రభావతి, వెంకీ మంకీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.





న్యూ ఏజ్ సినిమా

:దిల్‌రాజు

ఆశిష్, వైష్ణవిచైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. ఇఫ్ యు డేర్ ఉప శీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీశ్, దిల్‌రాజు సమర్పణలో హర్షిత్‌రెడ్డి, నాగమల్లిడి, హన్షిత నిర్మించారు. 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఇటీవల ఈ మూవీ ఆడియో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ న్యూ ఏజ్ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అన్నారు. డైరెక్టర్ అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు వస్తున్న పాజిటివ్ వైబ్స్ చూసి సంతోషంగా ఉంది" అని అన్నారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని లవ్, హారర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ అందరికీ మంచి థ్రిల్ ఇస్తాయి" అని అన్నారు. నటి వైష్ణవిచైతన్య మాట్లాడుతూ "డిఫరెంట్ లవ్ స్టోరీ ఇది" అని చెప్పారు. చిత్ర నిర్మాత హన్షిత మాట్లాడుతూ "ఎప్పుడైనా, ఎవరైనా గోస్ట్‌ని లవ్ చేశారా? లవ్ చేయండి. మీకు తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.



మూడు పాత్రల కిడ్నాప్ డ్రామా

చైతన్యారావు, సునీల్, శ్రద్ధా దాస్, మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలు పోషించిన 'పారిజాత పర్వం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సంతోష్ కంభంపాటి దర్శకత్వంలో మహీధర్ రెడ్డి, దేవేష్ నిర్మించిన హిలేరియస్ క్రైమ్ కామెడీ చిత్రమిది. ఈ సినిమా ట్రైలర్‌ను యాంకర్ సుమ లాంచ్ చేశారు. కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట. మళ్లీ లైట్స్ వేసే లోపు కేక్‌తో పాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని కిడ్నాప్ ప్లాన్‌ను సునీల్ తన గ్యాంగ్‌కు వివరిస్తుండగా మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

'కిడ్నాప్ ఈజ్ యాన్ ఆర్ట్' అనే ట్యాగ్ లైన్‌ను జస్టిఫై చేస్తూ ఇందులో చూపించిన సన్నివేశాలు హిలేరియస్‌గా ఉన్నాయి. చైతన్యా రావు, సునీల్, శ్రద్ధా దాస్.. ఈ మూడు పాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ డ్రామా ఇది. విజువల్స్, నిర్మాణ విలువలు బాగున్న ఈ ట్రైలర్ సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది.

తెలంగాణలో తొలి మూకీ చిత్రం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్మించిన తొలి మూకీ చిత్రం 'కావ్య రాజ్'. కవితా రాజ్‌పుత్, జమున, అంజలి, మధు ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని మధు లింగాల దర్శకత్వంలో గజగౌని దయానంద్ గౌడ్ నిర్మించారు. తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ ఈ చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ' కరీంనగర్ నివాసి, తెలంగాణ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి దాదాపు 300కి పైగా చిత్రాల్లో నటించిన పైడి జయరాజ్‌గారికి ఈ సినిమా అంకితం ఇస్తున్నాం' అని ప్రకటించారు.

'వాట్సాప్‌లో గౌడ గ్రూప్‌లో ఉన్న వారిని ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఈ చిత్రం నిర్మించడం సంతోషదాయకం. చాలా కాలం తర్వాత మళ్లీ ఓ మూకీ చిత్రం వస్తోంది. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు ప్రసన్నకుమార్.

ఈ కథ విన్నప్పుడు షాక్ అయ్యా

:సుకుమార్

కృష్ణంరాజు ఫ్యామిలీ నుంచి మరో నటుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ప్రభాస్ కజిన్ విరాట్‌రాజ్ డెబ్యూ ఫిల్మ్‌కు కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ ఆర్ కల్యాణ మండపం రాజు, కల్వకోట వెంకటరమణ, కాటూరి సాయికృష్ణ కార్తిక్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించారు. దర్శకుడు సుకుమార్ ఈ మూవీ టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ చిత్రానికి టైటిల్ 'గౌడ్‌సాబ్'. రాహుల్ సిప్లిగంజ్ క్లాప్ కొట్టగా, జానీ మాస్టర్, భాను మాస్టర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. గణేశ్ మాస్టర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యా. కథ చాలా బాగుంది. టైటిల్‌లోనే ట్విస్ట్ ఉంది" అని చెప్పారు. మూవీ డైరెక్టర్ గణేశ్ మాస్టర్ మాట్లాడుతూ "డ్యాన్స్ మాస్టర్‌గా నన్నెలా ఆదరించారో డైరెక్టర్‌గానూ అంతే ఆదరించండి" అని కోరారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమా ఒక ట్రూ లవ్ స్టోరీ" అని చెప్పారు. హీరో విరాట్‌రాజ్ మాట్లాడుతూ "ఈ సినిమాకు కథ, కథనం అద్భుతంగా కుదిరాయి" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, డిఓపీ: ఆర్ ఎమ్ స్వామి, సంగీతం: వెంగి.



ఆస్పత్రిలో చేరిన సాయాజీ షిండే



పలు చిత్రాల్లో విలన్‌గా నటించిన సాయాజీ షిండేకు తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిగా మహారాష్ట్రలోని సతారా ఆస్పతిలో చేర్పించారు. పలు వైద్య పరీక్షల అనంతరం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాలు బ్లాక్ అయ్యాయని వైద్యులు గ్రహించారు. వెంటనే ఆయనకు యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే డిస్చార్జ్ చేస్తామన్నారు.

మహారాష్ట్రకు చెందిన సాయాజీ నటుడిగా తెలుగు వారికి సుపరిచితుడే. వచ్చీ రాని తెలుగులో ఆయన డైలాగులు పలికే విధానం ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది. హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించిన సాయాజీ దక్షిణాదిన కూడా పలు సినిమాల్లో కీలక పాత్రలు పోషించారు.


టీసీఎస్ అదుర్స్

లాభం రూ.12,434 కోట్లు

మార్కెట్ అంచనాలను మించిన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు

- రూ.61,237 కోట్లకు పెరిగిన ఆదాయం
- 1,320 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లు
- 12.5%కి తగ్గిన ఉద్యోగుల వలసల రేటు
- ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్

ముంబై: మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి (క్యూ4) టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించి నమోదయ్యాయి. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9 శాతం వృద్ధితో రూ.12,434 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి లాభాల మార్జిన్లు పుంజుకోవడంతో పాటు భారత మార్కెట్లో కంపెనీ బలమైన పనితీరు కనబర్చడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ నికర లాభం రూ.11,392 కోట్లుగా ఉంది. కాగా, ఈ క్యూ4లో టీసీఎస్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 3.5 శాతం పెరిగి రూ.61,237 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికానికి గడించిన ఆదాయం రూ.60,583 కోట్లుగా ఉంది. మరిన్ని ముఖ్యాంశాలు..



- గడిచిన మూడు నెలల్లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ 1.50 శాతం పెరుగుదలతో 26 శాతానికి చేరుకుంది.
- ఈ కాలానికి కొత్తగా 1,320 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లను దక్కించుకున్నట్లు టీసీఎస్ వెల్లడించింది. కంపెనీ త్రైమాసిక ఆర్డర్లలో ఇప్పటి వరకిదే అత్యధిక విలువ. గత ఆర్థిక సంవత్సరానికి మొత్తానికి లభించిన ఆర్డర్ల విలువ 4,270 కోట్ల డాలర్లుగా నమోదైంది.
- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంస్థ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9 శాతం పెరిగి రూ.45,908 కోట్లకు ఎగబాకింది. ఆదాయం 6.8 శాతం వృద్ధితో రూ.2,40,893 కోట్లకు పెరిగింది.
- బీఎస్ఎన్ఎల్‌తో రూ.15,000 కోట్లకు పైగా డీల్ కుదిరిన నేపథ్యంలో భారత మార్కెట్ వ్యాపార ఆదాయం 38 శాతం పెరిగింది. దాంతో కంపెనీ మొత్తం ఆదాయంలో భారత మార్కెట్ వాటా 6.7 శాతానికి పెరిగింది. 2022-23 క్యూ4లో ఈ వాటా 5 శాతంగా నమోదైంది.
- కంపెనీకి అతిపెద్ద మార్కెట్ అయిన ఉత్తర అమెరికా ఆదాయం మాత్రం ఈ క్యూ4లో 2.3 శాతం తగ్గింది. దాంతో మొత్తం ఆదాయంలో ఈ మార్కెట్ వాటా 52.4 శాతం నుంచి 50 శాతానికి తగ్గింది.
- క్యూ4లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు మరింత తగ్గి 12.5 శాతానికి పరిమితమైనట్లు కంపెనీ తెలిపింది. క్యూ3లో ఇది 13.3 శాతంగా నమోదైంది.
- బీఎస్ఈలో టీసీఎస్ షేరు ధర శుక్రవారం 0.45 శాతం పెరిగి రూ.4,000.30 వద్ద ముగిసింది.

గడిచిన త్రైమాసికానికి నమోదైన లాభాల మార్జిన్, కొత్త ఆర్డర్లు కంపెనీ వ్యాపార విధాన పటిష్ఠత, కార్యకలాపాల నిర్వహణ శ్రేష్ఠతను ధ్రువీకరిస్తుంది. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో కంపెనీ సేవల పోర్టుఫోలియో, ఆవిష్కరణల సామర్థ్యం, ఆలోచనతో కూడిన నాయకత్వం ద్వారా మేం మా కస్టమర్లతో మరింత సన్నిహితంగా పనిచేయడంతో పాటు వారి కీలక ప్రాధాన్యాలను అమలు చేయడంలో తోడ్పడుతున్నాం.

- కే కృతివాసన్, టీసీఎస్ ఎండీ,సీఈఓ

వాటాదారులకు రూ.46,223 కోట్ల బొనాంజా

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు టీసీఎస్ ప్రకటించింది. త్వరలో నిర్వహించనున్న 29వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల ఆమోదం పొందిన తర్వాత డివిడెండ్ చెల్లించనున్నట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ ఇప్పటికే రూ.45 మధ్యంతర డివిడెండ్ చెల్లించింది. తాజాగా ప్రకటించిన దానితో కలిపి మొత్తం డివిడెండ్ రూ.73కు చేరుకోనుంది. అంతే కాదు, 2023-24లో కంపెనీ రూ.17,000 కోట్ల విలువైన సొంత షేర్లను బహిరంగ మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేసింది. అంటే, ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ తన వాటాదారులకు డివిడెండ్లు, బైబ్యాక్‌ల రూపంలో రూ.46,223 కోట్లు పంచింది.

19 ఏళ్లలో తొలిసారిగా తగ్గిన ఉద్యోగుల సంఖ్య

గడిచిన మూడు నెలల్లో టీసీఎస్‌లో నికరంగా 1,759 మంది ఉద్యోగులు తగ్గారు. దాంతో మార్చి 31 నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,01,546 మందికి పరిమితమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీలో ఉద్యోగులు 2022-23తో పోలిస్తే 13,249 మంది తగ్గారు. గడిచిన 19 ఏళ్లలో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య తగ్గడం ఇదే తొలిసారి. 2022-23లో కంపెనీ ఉద్యోగుల నికర పెరుగుదల 22,600గా నమోదైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలోనైతే కంపెనీ ఉద్యోగులు రికార్డు స్థాయిలో 1.03 లక్షల మంది పెరిగారు.

వేతన పెంపు 4.5-7 శాతం

ఈ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చేలా ఉద్యోగుల వేతనాలను వారి పనితీరు ఆధారంగా 4.5 శాతం నుంచి 7 శాతం వరకు పెంచినట్లు టీసీఎస్ తెలిపింది. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జీతాన్ని రెండంకెల స్థాయిలో పెంచడం జరిగిందని కంపెనీ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు.

40,000 మంది ఫ్రెషర్ల నియామకం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఐటీ సేవల డిమాండ్ మళ్లీ పుంజుకోవచ్చని భావిస్తోన్న టీసీఎస్.. తొలి దశలో ఇప్పటికే 10,000 మందికి పైగా ఫ్రెషర్లను నియమించుకున్నట్లు తెలుస్తోంది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 40,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. నేషనల్ క్వాలిఫైయర్ టెస్ట్ (ఎన్‌క్యూటీ) ద్వారా ఫ్రెషర్ల నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు గత నెలలో టీసీఎస్ ప్రకటించింది. ఈ పరీక్ష రాసేందుకు దరఖాస్తు గడువు ఈ నెల 10తో ముగిసింది. 26న పరీక్ష నిర్వహించనున్నారు. టీసీఎస్ ఈ పరీక్ష ద్వారా మూడు విభాగాల (నింజా, డిజిటల్ , ప్రైమ్) కోసం ఫ్రెషర్ల నియామకాలు చేపడుతోంది.

యాపిల్ కంపెనీపై రిటైలర్ల గుస్సా

క్యాష్ బ్యాక్‌ల్లో వ్యత్యాసం అన్యాయం : ఓఆర్ఏ

హైదరాబాద్: యాపిల్ కంపెనీ కొత్త ఐఫోన్లు 15 ప్రో, 15 ప్రో మ్యాక్స్‌లపై కొన్ని రిటైల్ సంస్థలు రూ.10,000, మరికొన్ని రూ.3,000 క్యాష్ బ్యాక్ ప్రకటించడంపై సౌత్ ఇండియన్ ఆర్గనైజ్డ్ రిటైలర్స్ అసోసియేషన్ (ఓఆర్ఏ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఈ రెండు ఐఫోన్ మోడళ్లపై ఓఆర్ఏ సభ్యులైన లార్జ్ ఫార్మాట్ రిటైల్ (ఎల్ఎఫ్ఆర్) స్టోర్లు రూ.10,000 చొప్పున, వైర్‌లెస్ చెయిన్స్ (డబ్ల్యూసీ), మల్టీ బ్రాండ్ ఔట్‌లెట్స్ (ఎంబీఓ) రూ.3,000 చొప్పున క్యాష్ బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ ఆఫర్లు ఈ నెలాఖరు వరకు కొనసాగునున్నాయి. ఈ వ్యత్యాసంతో సంఘటిత రంగంలోని విభాగ రిటైల్ సంస్థలు భారీగా నష్టపోతాయని ఓఆర్ఏ పేర్కొంది. తమ ఖాతాదారులను లార్జ్ ఫార్మాట్ రిటైల్ సంస్థల వైపు మళ్లించేందుకు యాపిల్ కంపెనీ ఈ ఎత్తుగడ వేసినట్టు కనిపిస్తోందని తెలిపింది. వెంటనే ఈ వ్యత్యాసాన్ని సరిచేసి రిటైల్ సంస్థలు అన్నిటికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరింది. ఈ క్యాష్ బ్యాక్ ఆఫర్ల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సరిదిద్దేందుకు యాపిల్ ఇండియా కంపెనీతో చర్చించేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

ద్రవ్యోల్బణం 5 నెలల కనిష్ఠం

మార్చిలో 4.85 శాతం

న్యూఢిల్లీ: ఆహార వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం మార్చి నెలలో 5 నెలల కనిష్ఠ స్థాయి 4.85 శాతానికి దిగివచ్చింది. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి రేఖ నాలుగు శాతం దిశగా పయనించవచ్చనే ఆశలు రేపింది. ఫిబ్రవరి నెలలో ఇది 5.09 శాతం ఉండగా గత ఏడాది మార్చిలో 5.66 శాతం ఉంది. గత ఏడాది అక్టోబరులో నమోదైన 4.87 శాతం తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

13వ తేదీ



హైదరాబాద్	385	విజయవాడ	396
చిత్తూరు	468	విశాఖపట్నం	411
గోదావరి	396	వరంగల్	387
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	136	గోదావరి	137
వరంగల్	136		
కరీంనగర్	136	విజయవాడ	137
మహబూబ్‌నగర్	136	గుంటూరు	137
		ఒంగోలు	137
కర్నూలు	136	చిత్తూరు	151
విశాఖపట్నం	124		

రూ.50,000 కోట్లు దాటిన మలబార్ గోల్డ్ టర్నోవర్

MALABAR GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.51,218 కోట్ల టర్నోవర్‌ను సాధించి రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా నమ్మకమైన జువెలరీ బ్రాండ్‌గా ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గడిచిన మూడు దశాబ్దాల్లో సాధించిన విజయానికి ఇది నిదర్శనమని పేర్కొంది. కాగా కేరళ ప్రధాన కేంద్రంగా ఉన్న మలబార్ గోల్డ్.. భారత్ సహా విదేశాల్లో కార్యకలాపాలను విస్తరించటం ద్వారా గ్లోబల్ లీడర్‌గా తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని భావిస్తోంది. ప్రస్తుతం 13కు పైగా దేశాల్లో 345 షోరూమ్స్‌ను నిర్వహిస్తున్న మలబార్ గోల్డ్.. త్వరలో న్యూజిలాండ్, ఈజిప్ట్, బంగ్లాదేశ్ సహా యూరప్‌లోని మరికొన్ని ప్రాంతాల్లో కొత్త షోరూమ్స్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. మరోవైపు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లో వచ్చే ఏడాది కాలంలో 100 కొత్త స్టోర్స్‌ను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా కొత్తగా 7,000 మంది ఉద్యోగులను చేర్చుకోవటం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్యను 28,000కు చేర్చాలని భావిస్తోంది. అలాగే భారత్‌లోని జార్ఖండ్, గోవా, అస్సోమ్, త్రిపుర, జమ్ము కశ్మీర్‌లకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుతం మలబార్ గోల్డ్.. 8 దేశాల్లో 14 సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ యూనిట్స్‌తో పాటు ఐదు దేశాల్లో 15 జువెలరీ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్స్‌ను నిర్వహిస్తోంది. కాగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద మలబార్ గ్రూప్ ఇప్పటి వరకు రూ.234 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది.

లాభాల స్వీకరణతో పతన బాటలోకి..

సెన్సెక్స్ 793 పాయింట్లు డౌన్

ముంబై: కొద్ది రోజులుగా ఏర్పడిన ర్యాలీని సొమ్ము చేసుకునే లక్ష్యంతో ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకారానికి దిగడంతో శుక్రవారం ఈక్విటీ మార్కెట్ ఒక శాతం మేరకు నష్టపోయింది. తాజా గణాంకాల ప్రకారం అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగిపోవటంతో జూన్ నాటికైనా వడ్డీ రేట్లు తగ్గుతాయన్న ఆశలు సన్నగిల్లటం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ఫలితంగా కొద్ది రోజుల ర్యాలీకి స్వస్తి చెప్పిన సెన్సెక్స్ 793.25 పాయింట్లు నష్టపోయి 74,244.90 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 234.40 పాయింట్ల నష్టంతో 22,519.40 వద్ద క్లోజైంది. సెన్సెక్స్ షేర్లలో 27, నిఫ్టీ షేర్లలో 45 షేర్లు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో లిస్టయిన కంపెనీల మార్కెట్ విలువ ఒక్క రోజులోనే రూ.2,52,301.16 కోట్లు క్షీణించి రూ.3,99,67,051.91 కోట్ల వద్ద స్థిరపడింది.

భారతి హెక్సాకామ్ లాభాల పంట: శుక్రవారం భారతి హెక్సాకామ్ షేరు ఇష్యూ ధర రూ.570తో పోల్చితే 32.49 శాతం ప్రీమియంతో రూ.755.20 వద్ద బీఎస్ఈలో లిస్టయింది. తదుపరి క్రమంలో 54.36 శాతం లాభంతో రూ.879.90 స్థాయిని తాకిన ఈ షేరు చివరికి 42.80 శాతం లాభంతో రూ.813.75 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా ఈ షేరు 32.45 శాతం లాభంతో రూ.755 వద్ద లిస్టయి చివరికి 42.80 శాతం లాభంతో రూ.814 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,687.50 కోట్లుగా నమోదైంది.

ఫారెక్స్ నిల్వల్లోనూ కొత్త రికార్డు: దేశంలో విదేశీ మారక నిల్వలు ఏప్రిల్ 5వ తేదీతో ముగిసిన వారంలో 298 కోట్ల డాలర్లు పెరిగి 64,856.2 కోట్ల డాలర్లకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో ఇది కొత్త రికార్డు. రూపాయిని ఆదుకునేందుకు ఆర్‌బీఐ డాలర్లను విక్రయిస్తూ ఉండడంతో గత కొన్ని నెలలుగా క్షీణిస్తూ వచ్చిన ఫారెక్స్ నిల్వలు ఇటీవల వారాల్లో తిరిగి రికార్డు స్థాయిలను నమోదు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఇదే వారంలో బంగారం నిల్వలు 239.8 కోట్ల డాలర్లు పెరిగి 5,455.8 కోట్ల డాలర్లకు చేరాయి.

రూ.73,000 దాటిన బంగారం

ఢిల్లీ మార్కెట్లో బంగారం, వెండి ధరలు వరుసగా నాలుగో రోజు కూడా ర్యాలీని కొనసాగించి కొత్త రికార్డులకు దూసుకుపోయాయి. శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ.1,050 మేరకు పుంజుకుని రూ.73,350 వద్ద స్థిరపడింది. వెండి కిలో ధర రూ.1,400 పెరిగి రూ.86,300 వద్ద ముగిసింది. బంగారం, వెండి ధరలు రెండూ చారిత్రక గరిష్ఠ స్థాయిలే. అంతర్జాతీయ విపణిలో కూడా ఔన్సు బంగారం స్పాట్ మార్కెట్లో 48 డాలర్లు పెరిగి 2,388 డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సు 28.95 డాలర్లు పలికింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,310 ▲	67,200 ▲	90,000 ▲
ముంబై	73,174 ▲	67,027 ▲	83,819 ▲

ఢిల్లీ.. భళా

ఆకట్టుకున్న ఫ్రేసర్

లఖ్‌నవూ పరాజయం ● దెబ్బతీసిన స్పిన్నర్ కుల్దీప్ ● బదోని పోరాటం వృథా



కుల్దీప్ (3/20)

లఖ్‌నవూ: పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకుంది. బౌలింగ్‌లో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/20) కీలక వికెట్లతో లఖ్‌నవూ వెన్ను విరవగా, బ్యాటింగ్‌లో 21 ఏళ్ల ఫ్రేసర్ మెక్‌గర్క్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 55) ఐపీఎల్ తొలి మ్యాచ్‌లోనే సత్తా చాటుకున్నాడు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే నాలుగు పాయింట్లతో ఓ స్థానం ఎగబాకగా.. ఆర్‌సీబీ కిందికి దిగజారింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఆయుష్ బదోని (35 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 55 నాటౌట్), రాహుల్ (39) రాణించారు. ఖలీల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 170 పరుగులు చేసి గెలిచింది. పంత్ (24 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), పృథ్వీ షా (22 బంతుల్లో 6 ఫోర్లతో 32) రాణించారు. బిష్ణోయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ నిలిచాడు.

ఫ్రేసర్ దూకుడు: వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలి, ఎన్‌గిడి గాయంతో ఢిల్లీ జట్టులో చేరిన యువ బ్యాటర్ ఫ్రేసర్ మెక్‌గర్క్ అదరగొట్టాడు. ఎలాంటి బెదురు లేకుండా ఎడాపెడా షాట్లతో చకచకా స్కోరుబోర్డును కదిలించాడు. ఓపెనర్ వార్నర్ (8) నాలుగో ఓవర్‌లోనే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ పృథ్వీ షాతో కలిసి మెక్‌గర్క్ లఖ్‌నవూపై ఎదురుదాడికి దిగాడు. సిక్సర్‌తో తన పరుగుల ఖాతా తెరిచిన తను ఐదో ఓవర్‌లో మరో 6,4 బాదాడు. అటు షా కూడా వరుస ఫోర్లు కొట్టగా పవర్‌ప్లేలో జట్టు 62/1తో నిలిచింది. ఆ తర్వాత నాలుగు ఓవర్లలో ఢిల్లీ కేవలం 13 పరుగులే చేసి షా వికెట్ కోల్పోయింది. ఈ దశలో పంత్, ఫ్రేసర్ గేరు మార్చడంతో ధారాళంగా పరుగులు వచ్చాయి. పంత్ 11వ ఓవర్‌లో 6,4.. 12వ ఓవర్‌లో 4,4 బాదడంతో 25 పరుగులు వచ్చాయి. ఇక ఫ్రేసర్ మరింతగా చెలరేగి 13వ ఓవర్‌లో బాదిన హ్యాట్రిక్ సిక్సర్లతో ఏకంగా 21 రన్స్ సమకూరాయి. ఈ క్రమంలో అతడు 31 బంతుల్లోనే తన కెరీర్‌లో తొలి ఫిఫ్టీని పూర్తి చేసుకున్నాడు. మరోవైపు వరుస ఓవర్లలో ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరినా అప్పటికే లక్ష్యం వేగంగా తగ్గిపోయింది. చివర్లో స్టబ్స్ (15 నాటౌట్), హోప్ (11 నాటౌట్) మరో 11 బంతులుండగానే లాంఛనాన్ని ముగించారు.

ఆదుకున్న బదోని: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ బ్యాటర్ల తీరు చూశాక, పూర్తి ఓవర్లు ఆడుతుందని ఎవరూ భావించలేదు. కానీ ఆఖర్లో ఆయుష్ బదోని ఎదురుదాడికి అర్షద్ ఖాన్ (20 నాటౌట్) సహకారం తోడు కావడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరును అందుకోగలిగింది. వాస్తవానికి పవర్‌ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయినా 57 పరుగులతో పటిష్ఠంగానే కనిపించింది. కానీ ఆ తర్వాతే వరుస విరామాల్లో వికెట్లు చేజార్చుకొని ఇబ్బందుల్లో పడింది. పేసర్లు ఖలీల్, ఇషాంత్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మ్యాజిక్ బంతులకు ఎల్ఎస్‌జీ మిడిలార్డర్ వణికిపోయింది. ఊపు మీదున్న ఓపెనర్ డికాక్ (19), దేవ్‌దత్ (3)లను పేసర్ ఖలీల్ తన వరుస ఓవర్లలో వెనక్కి పంపాడు. అయితే ఆరో ఓవర్‌లో రాహుల్ రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. ఇక కుల్దీప్ బంతి చేత పట్టాక సీన్ మారిపోయింది. ఎనిమిదో ఓవర్‌లో అతను హిట్టర్లు స్టొయినిస్ (8), పూరన్ (0)లను వరుస బంతుల్లో వెనక్కి పంపడంతో ఎల్ఎస్‌జీ షాక్‌కు గురైంది. ఆ వెంటనే చక్కగా కుదురుకున్న రాహుల్‌ను తన తర్వాతి ఓవర్‌లోనే అవుట్ చేశాడు. ఢిల్లీ రివ్యూకు వెళ్లి ఈ వికెట్ సాధించింది. ఇక పేసర్లు ఇషాంత్, ముకేశ్ విజృంభణకు దీపక్ హుడా (10), క్రునాల్ పాండ్యా (3) సైతం పెవిలియన్ చేరడంతో జట్టు 94/7 స్కోరుతో కష్టాల్లో పడింది. అప్పటి మరో ఏడు ఓవర్లు మిగిలి ఉండడంతో జట్టు అంతలోపే ఆలౌట్ ఖాయమనిపించింది. ఈ దశలో బదోని-అర్షద్ ఖాన్ అద్భుత ఆటతీరుతో ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 73 పరుగులు జోడించడం విశేషం. 15వ ఓవర్‌లో బదోని రెండు ఫోర్లతో 14 రన్స్ రాబట్టి స్కోరులో కదలిక తెచ్చాడు. 18వ ఓవర్‌లో అతడి సిక్సర్, అర్షద్ ఖాన్ ఫోర్‌తో మరో 15 రన్స్ వచ్చాయి. ఇక బదోని మరో రెండు ఫోర్లతో 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆఖరి ఓవర్‌లో లఖ్‌నవూ 11 రన్స్ సాధించడంతో 160 దాటింది.



ఫ్రేసర్ మెక్‌గర్క్ (35 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 55)

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
చెన్నై	5	3	2	0	6	0.666
లఖ్‌నవూ	5	3	2	0	6	0.436
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	5	2	3	0	4	-0.196
ఢిల్లీ	6	2	4	0	4	-0.975
బెంగళూరు	6	1	5	0	2	-1.124

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్

పంజాబ్ X రాజస్థాన్

వేదిక: ముల్లాపూర్ రా.7.30 గం.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
319 పరుగులు	10 వికెట్లు

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (ఎల్బీ) ఖలీల్ 19, రాహుల్ (సి) పంత్ (బి) కుల్దీప్ 39, పడిక్కళ్ (ఎల్బీ) ఖలీల్ 3, స్టొయినిస్ (సి) ఇషాంత్ (బి) కుల్దీప్ 8, పూరన్ (బి) కుల్దీప్ 0, దీపక్ హుడా (సి) వార్నర్ (బి) ఇషాంత్ 10, బదోని (నాటౌట్) 55, క్రునాల్ (సి) పంత్ (బి) ముకేశ్ 3, అర్షద్ (నాటౌట్) 20, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 167/7; వికెట్ల పతనం:** 1-28, 2-41, 3-66, 4-66, 5-77, 6-89, 7-94; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-41-2, ఇషాంత్ 4-0-36-1, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 4-0-26-0, కుల్దీప్ యాదవ్ 4-0-20-3.

ఢిల్లీ: పృథ్వీ షా (సి) పూరన్ (బి) బిష్ణోయ్ 32, వార్నర్ (బి) యశ్ 8, జేక్ ఫ్రేసర్ (సి) అర్షద్ (బి) నవీనుల్ 55, పంత్ (స్టంప్డ్) రాహుల్ (బి) బిష్ణోయ్ 41, స్టబ్స్ (నాటౌట్) 15, హోప్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 18.1 ఓవర్లలో 170/4; వికెట్ల పతనం:** 1-24, 2-63, 3-140, 4-146; **బౌలింగ్:** అర్షద్ ఖాన్ 3.1-0-34-0, నవీనుల్ హక్ 3-0-24-1, యశ్ ఠాకూర్ 4-0-31-1, క్రునాల్ 3-0-45-0, రవి బిష్ణోయ్ 4-0-25-2, స్టొయినిస్ 1-0-10-0.

1

ఐపీఎల్‌లో వంద పరుగుల్లోపే ఏడు వికెట్లు కోల్పోయినా, ఓ జట్టు అత్యధిక స్కోరు (167/7) సాధించడం ఇదే తొలిసారి. గతంలో సన్‌రైజర్స్ (154/9) పేరిట ఈ రికార్డు ఉండేది.

స్పోర్ట్స్



ఇప్పట్లో రిటైర్ కాను: రోహిత్

న్యూఢిల్లీ: మరో రెండు, మూడేళ్లు కచ్చితంగా క్రికెట్ ఆడతానని భారత కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. 2025 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌తో పాటు, 2027 వన్డే వరల్డ్‌కప్‌లోనూ ఆడాలనుందని తెలిపాడు. 'ప్రస్తుతం నా ఆటతీరు మెరుగ్గానే ఉంది. అందుకే మరికొన్నాళ్లు కొనసాగాలనుకుంటున్నా. నా దృష్టిలో వన్డే వరల్డ్‌కప్ అసలైన టోర్నీ. మేమంతా 50 ఓవర్ల ఫార్మాట్‌ను చూసే పెరిగాం. అందుకే గతేడాది ఆ మెగా టోర్నీని గెలవాలని భావించాం. ఫైనల్ వరకు అంతా సవ్యంగా సాగినా తుది మెట్టుపై బోల్తా పడ్డాం. ఎందుకిలా జరిగిందని ఆలోచించాం. అయితే ఫైనల్లో మా ఆటతీరు బాలేదని చెప్పలేం. ఆసీస్ మాకన్నా కాస్త మెరుగ్గా ఆడిందంతే' అని రోహిత్ ఓ చాట్‌షోలో చెప్పాడు.

ఒలింపిక్స్‌లో ఆడకుండా అడ్డుకుంటున్నాడు..

రెజ్లింగ్ సమాఖ్య చీఫ్‌పై వినేశ్ ఆరోపణ



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు తన ఒలింపిక్ కలను భగ్నం చేసేందుకు యత్నిస్తున్నాడని స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ ఆరోపించింది. ఈక్రమంలో ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనకుండా తనను అడ్డుకోవాలని చూస్తున్నాడని తెలిపింది. 50 కిలోల విభాగంలో ఒలింపిక్ బెర్త్ కోసం ఫొగట్ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఈనెల 18 నుంచి కిర్గిస్థాన్‌లో జరిగే ఆసియా క్వాలిఫయింగ్ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధమైంది. కానీ ఆ టోర్నీకి తన కోచ్, ఫిజియోకు అక్రిడిటేషన్ రాకుండా డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ అడ్డుకున్నాడని వినేశ్ ఆరోపించింది. అంతేకాదు..తనను డోపింగ్‌లో ఇరికించే ప్రమాదమూ లేకపోలేదని ఫొగట్ చెప్పింది.



రన్నరప్ విష్ణు

నగాల్‌కు చాముండి రూ.10 లక్షల సాయం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఎఫ్ఎన్‌సీసీ ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఆటగాడు విష్ణువర్ధన్ రన్నరప్‌గా నిలిచాడు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో విష్ణు 4-6, 4-6తో జావియ దేవ్ (గుజరాత్) చేతిలో ఓడాడు. ముగింపు వేడుకలకు టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, ఏసీబీ డీజీ సీవీ ఆనంద్, ఐపీఎల్ పాలకమండలి సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భారత నెంబర్ వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్‌కు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ఈ కార్యక్రమంలో చాముండి ప్రకటించారు.



చెఫ్ డి మిషన్‌గా వైదొలగిన మేరీ

న్యూఢిల్లీ: దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్ అనూహ్య నిర్ణయం తీసుకుంది. పారిస్ ఒలింపిక్స్ భారత జట్టు చెఫ్ డి మిషన్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని వెల్లడించింది. ఈమేరకు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉషకు మేరీ కోమ్ లేఖ రాసింది. మేరీ కోమ్ స్థానంలో మరొకరిని త్వరలో నియమిస్తామని ఉష తెలిపింది. మేరీని చెఫ్ డి మిషన్‌గా గత నెల 21న ఐఓఏ నియమించిన సంగతి తెలిసిందే.

టెన్నిస్ అమ్మాయిల మూడో గెలుపు

బిల్లీ జీన్ కింగ్ కప్

న్యూఢిల్లీ: బిల్లీ జీన్ కింగ్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత అమ్మాయిలు అదరగొడుతున్నారు. ఆసియా ఓసియానియా గ్రూప్-1 పోరులో భాగంగా భారత జట్టు మూడో విజయాన్ని నమోదు చేసింది. చైనాలోని చాంగ్‌షాలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో దక్షిణ కొరియాను ఓడించింది. గ్రూప్-ఎలో ఓవరాల్‌గా మూడు విజయాలు, ఓ ఓటమి అందుకున్న భారత్.. పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. శనివారం జరిగే తమ గ్రూప్ ఆఖరి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

గుకేష్ ఓటమి

టొరొంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ ఏడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ పరాజయం చవిచూశాడు. ఫ్రాన్స్‌కు చెందిన ఫిరౌజా అలీరెజాతో నల్ల పావులతో తలపడిన గుకేష్ 40 ఎత్తుల్లో ఓటమిని అంగీకరించాడు. దరిమిలా గుకేష్ (4 పాయింట్లు) టాప్ నుంచి రెండో స్థానానికి పడిపోయాడు. కరువాన-ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్-అబసోవ్, నకామురా-నెపోమ్నియాచి గేమ్‌లు డ్రాగా ముగిశాయి. నెపోమ్నియాచి (4.5) టాప్‌లో నిలిచాడు. మహిళల ఏడో రౌండ్‌లో..ముజిచుక్‌తో హంపి పాయింటును పంచుకోగా, లీ టింగ్జీ చేతిలో వైశాలీ ఓడిపోయింది. హంపి, వైశాలీ చెరో రెండున్నర పాయింట్లతో ఆఖరి స్థానంలో ఉన్నారు.

హాకీలో నాలుగో 'సారీ'

పెర్త్: ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల హాకీ టెస్టు సిరీస్‌లో భారత పురుషుల జట్టు వైఫల్యం కొనసాగుతోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ పరాజయమే ఎదురైంది. శుక్రవారం జరిగిన పోరులో భారత్ 1-3 గోల్స్ తేడాతో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది. భారత జట్టులో ఏకైక గోల్‌ను కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 12వ నిమిషంలో చేశాడు. ఆసీస్ తరఫున జెరెమి (18వ, 47వ) రెండు గోల్స్ సాధించగా, జాక్ వెల్చ్ (54వ) ఓ గోల్ కొట్టాడు. ఆఖరి మ్యాచ్ శనివారం జరగనుంది.

అసలు టార్గెట్ ఆ ఇద్దరే!

రేవంత్, ఈటల రాజేందర్‌పై స్పెషల్ టీంల ఫోకస్



- 20 మందికిపైగా సిబ్బందితో రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యుల ఫోన్ల ట్యాపింగ్
- రాధాకిషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీని తిరిగి అధికారంలోకి తేవాలనే ఏకైక ఏజెండాతో పని చేసిన ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు, ప్రణీత్‌రావు అండ్ టీం.. అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు చేశారు. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డితోపాటు బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వెళ్లిన ఈటల రాజేందర్‌ను టార్గెట్‌గా చేసుకుని స్పెషల్ టీములు పనిచేశాయి. ముఖ్యంగా.. రేవంత్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ప్రతి కదలికా తెలుసుకునేందుకు, వారు మాట్లాడుకునే ప్రతి మాటా వినేందుకు 20 మందికిపైగా సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారి ఫోన్లు ట్యాప్ చేయడంతోపాటు ఎక్కడికెళ్తున్నారు? ఏం చేస్తున్నారు? వంటి వివరాలను ఆ బృందం సేకరించి ఎప్పటికప్పుడు నాటి ప్రభుత్వ పెద్దలకు చేరవేసింది. ముఖ్యంగా, రేవంత్‌కు ఆర్థిక సాయం అందించేవారిని గుర్తించి వారి కదలికలపై నిఘా పెట్టింది. అలాగే.. ఇంటి గుట్టు మొత్తం తెలిసిన ఈటెల బీజేపీలోకి వెళ్లడంతో.. ఆయనపైనా బీఆర్ఎస్ ప్రభుత్వం అదే స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఈటల ఫోన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు, ఇంట్లో పనిచేసే వారి ఫోన్లు సైతం ప్రణీత్ రావు నేతృత్వంలో ఏర్పాటైన స్పెషల్ టీం నిరంతరం ట్యాపింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. వీరిద్దరిపైనా కాక.. ప్రతిపక్ష, స్వపక్ష పార్టీల్లోని నాయకుల ఫోన్లనూ అప్పటి బీఆర్ఎస్ కీలక నేతల ఆదేశాల మేరకు ప్రభాకర్‌రావు అండ్ టీం ట్యాప్ చేసింది.

మా పేరు చెప్పి ఉంటారా?

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్, ట్రాకింగ్, బెదిరింపులు, వసూళ్ల కేసులో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు అధికారులు ముందుకు సాగుతున్నారు. తమ టీం ఎవరి ఆదేశాల మేరకు, ఎవరి కోసం పనిచేసింది, ఎన్నికల సమయంలో నేతల డబ్బును పోలీస్ వాహనాల్లో ఎలా తరలించిందీ.. ఈ వివరాలన్నింటినీ రాధాకిషన్‌రావు పూసగుచ్చారు. ఆ సమాచారం మేరకు పలువురు రాజకీయ నాయకులకు నోటీసులు జారీ చేసి విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా అధికారంలో ఉన్నప్పుడు రాధాకిషన్ రావు, ప్రణీత్‌రావుతో పనులు చేయించుకున్న, వారితో టచ్‌లో ఉన్న రాజకీయ నాయకుల గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరుగెడుతున్నాయి. కస్టడీలో వారు తమ పేరు చెప్పి ఉంటారా? చెబితే ఏం చెప్పి ఉంటారు? అని భయపడుతున్నారు. అలాగే.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎన్నికల డబ్బు తరలింపులో కీలకపాత్ర పోషించారని, ఒక ఎస్పై బీఆర్ఎస్ పార్టీ డబ్బును టాస్క్‌ఫోర్స్ వాహనంలో తరలించారని రాధాకిషన్ రావు పోలీసులకు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని విచారించి, స్టేట్‌మెంట్ రికార్డు చేసి, చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

బెయిలివ్వండి ప్లీజ్..

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయ్యి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న తిరుపతన్న.. బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీ ముగిసినందున తనకు బెయిల్ మంజూరు చేయాలని అందులో కోరారు. ఈ పిటిషన్ సోమవారం నాంపల్లి కోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో బలమైన వాదనలు వినిపించేందుకు దర్యాప్తు అధికారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం స్పెషల్ పీపీని ఏర్పాటు చేసింది.

33 ఏళ్ల సర్వీసు నిబంధన అవాస్తవం

- స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అలాంటి ప్రతిపాదనే లేదని ప్రకటన
- తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- రిటైర్మెంట్‌ను 33 ఏళ్ల సర్వీసుతో ముడిపెడతారంటూ వాట్సాప్‌లో ఇటీవల ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణను 61 ఏళ్లకు లేదా 33 ఏళ్ల సర్వీసుకు సవరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నదన్న వార్తల్లో నిజం లేదని తేలింది. దీనిపై శుక్రవారం ప్రభుత్వం స్వయంగా స్పష్టతనిచ్చింది. 'రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితికి సంబంధించి 61 ఏళ్ల నిబంధనను కొనసాగిస్తూ, కొత్తగా 33 ఏళ్ల సర్వీసు నిబంధనను ప్రభుత్వం తీసుకురానుందంటూ వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. ఈ అంశంపై ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రతిపాదన లేదు. ఇలాంటి ఊహాజనిత వార్తలు రాయడం, దీనిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరైంది కాదు. ఇలాంటి అవాస్తవ వార్తలు ప్రచురించే/ప్రసారం చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుంది' అని సమాచార, పౌర సంబంధాల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, ఈ అంశంపై సాధారణ పరిపాలనా శాఖ (జీఏడీ) కార్యదర్శి ఎం.రఘునందన్‌రావును వివరణ కోరగా... ఉద్యోగుల పదవీ విరమణకు 33 ఏళ్ల సర్వీసు నిబంధన పెట్టాలన్న ఆలోచనేదీ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కాగా, గత రెండు రోజులుగా 33 ఏళ్ల నిబంధన పేరుతో ఓ వార్త వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. దీని ప్రకారం 61 ఏళ్ల వయసు, 33 ఏళ్ల సర్వీసు.. ఈ రెండింటిలో ఏది ముందు వర్తిస్తే దానిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్‌కు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనుందని, ఈ మేరకు నిర్ణయాన్ని ప్రకటించనున్నదని ప్రచారం జరిగింది. దీనిపై ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎందుకంటే, చిన్న వయసులో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన అనేక మంది 61 ఏళ్ల వయసు రావటానికి చాలా ముందే 33 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటారు. వీరిందరికీ ఉన్నపళంగా ఉద్యోగం పోతుందేమోనన్న భయం పట్టుకుంది. ఎన్నికల వేళ ఇదెక్కడి నిర్ణయం అంటూ విస్మయం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టతనిచ్చింది.

బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కుట్ర: హరీశ్‌రావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి, ప్రజలకు చేసిందేమి లేదని, పెట్రోల్, డీజిల్, సిలిండర్, నిత్యావసరాల ధరలు, నిరుద్యోగాన్ని పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేసీఆర్ చెడ్డీ విప్పుతానంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, ఈ విధానం సరికాదని విమర్శించారు.

సీఎం ఆదేశించినా అందని గిట్టుబాటు ధర: పల్లా

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్వింటా వడ్లను రూ.2500లకు కొంటామని, ప్రతి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అమలుకావడం లేదని, రైతన్నలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు గండ్ర వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశించినా.. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, ఇది దురదృష్టకరమన్నారు. కనీస మద్దతు ధర కంటే రూ.700 తక్కువకు వడ్లు కొంటున్నారని, దీంతో రైతులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.

'పాలమూరు' డిజైన్ మారిస్తేనే కేంద్ర నిధులకు కృషి

- సీఎం ఇంకా జడ్పీటీసీగానే ఆలోచిస్తున్నారు: డీకే అరుణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 12: జూరాల ప్రాజెక్టు నుంచి ప్రారంభించేలా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు రిపోర్ట్ తయారుచేసి పరిపాలనా అనుమతులు తీసుకువస్తేనే కేంద్రం నుంచి నిధులు తీసుకువస్తానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. శుక్రవారం బీజేపీ మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంకా జడ్పీటీసీ సభ్యుడిలాగే ఆలోచిస్తున్నారని ఎద్దేవాచేశారు. తాను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉండటానికి, పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తీసుకురావడానికి ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలకు గ్యారెంటీ లేదని, అసలు సీఎం రేవంత్ రెడ్డి పదవికే గ్యారెంటీ లేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు.



సంకెపల్లిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సంజయ్

తాలు, తరుగు పేరిట దోపిడీ

- కల్లాల్లో దళారులు, మిల్లుల్లో వ్యాపారుల దగా: సంజయ్

సిరిసిల్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరిట క్వింటాలుకు 5 నుంచి 8 కిలోలు కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. జనగామలో క్వింటాల్ ధాన్యాన్ని రూ.1,500 నుంచి రూ.1,700కే కొనుగోలు చేస్తూ మద్దతు ధరకు గండికొడుతున్నా.. ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కల్లాల్లో దళారులు, మిల్లుల్లో వ్యాపారులు అన్నదాతలను దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకెపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సంజయ్ పరిశీలించారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క గింజ కొనలేదని, సిరిసిల్ల జిల్లాలో 259 కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. వరికి రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేలు రైతు భరోసా, కౌలు రైతులకు పెట్టుబడి సాయం హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

రేవంత్‌వి కల్లబొల్లి మాటలు: లక్ష్మణ్

తనపై కుట్రలు పన్నుతున్నారంటూ రేవంత్ కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ఆరు గ్యారెంటీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సానుభూతి పొందేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

రేవంత్ ట్యాపింగ్ చేయట్లేదా?

భట్టి, ఉత్తమ్, పొంగులేటి ఫోన్ల ట్యాపింగ్.. పెగాసస్‌తో కేంద్రం ట్యాపింగ్ చేయలేదా?

- సంబంధం లేని నాపై నిందారోపణలు
- నార్కో పరీక్షలకు నేను సిద్ధం.. మీరూ సిద్ధమా?:మాజీ మంత్రి కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోన్లను సీఎం ట్యాపింగ్ చేస్తున్నారో, లేదో చెప్పాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా.. పెగాసస్ ద్వారా ఫోన్లు ట్యాపింగ్ చేసిందో, లేదో కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు. శుక్రవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంతో తనకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. ఈ విషయంలో లైడిటెక్టర్, నార్కో అనాలిసిస్ పరీక్షలకు తాను సిద్ధమని, సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా సిద్ధమా? అని సవాల్ విసిరారు. నిజంగా ట్యాపింగ్ జరిగి ఉంటే వాస్తవాలు రుజువుచేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం కేసీఆర్‌కు సంబంధించిన సామాజికవర్గాన్ని తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. "ఒకరిద్దరు అధికారులే తప్పు చేస్తారా? మేం అధికారంలో ఉన్నపుడు ఉన్నత స్థాయిల్లో ఉన్న ప్రస్తుత డీజీపీ రవిగుప్తా, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డిని ఎందుకు విచారించడంలేదు?" అని కేటీఆర్ ప్రశ్నించారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ, "ప్రతిపక్షాలు జైల్లో ఉండాలి.. రేసులో మేం ఉండాలి అనే విధానంతో వెళుతోంది. ఏడాదిపాటు బీజేపీ నేతలు లీకులిస్తూ.. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. అక్రమ మద్యం పాలసీ కేసులో పేర్లున్న వారు బీజేపీలో చేరితే మాత్రం.. వారంతా పునీతులయ్యారు" అని కేటీఆర్ మండిపడ్డారు.

మేం తప్పు చేశాం..!

తాము అధికారంలో ఉన్నపుడు ఇతర పార్టీల నుంచి ఇబ్బడి ముబ్బడిగా చేర్చుకున్నామని, అది తాము చేసిన తప్పు అని కేటీఆర్ అంగీకరించారు. ఇకపై పార్టీని నమ్ముకున్న వాళ్లకే ప్రాధాన్యం కల్పించి పదవులు దక్కేలా చూస్తామన్నారు. కేసీఆర్‌ను చాలా మంది మోసం చేశారని, కడియం శ్రీహరి స్థాయిలో మోసం చేసినవారు మాత్రం ఎవరూ లేరన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది ప్రజా పాలన కాదని, ప్రతీకార పాలన అని కేటీఆర్ ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కే మెజారిటీ సీట్లు కట్టబెడతారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి బయటపడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరతారని చెప్పారు. అందుకే చాలా లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ తరఫున డమ్మీ అభ్యర్థులను పెట్టి.. బీజేపీని గెలిపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "రేవంత్‌రెడ్డి సికింద్రాబాద్‌లో నిలబెట్టిన అభ్యర్థి గడప దాటడం లేదు. కరీంనగర్‌లో బండి సంజయ్‌ను గెలిపించేందుకు ఇప్పటికీ అభ్యర్థిని ప్రకటించలేదు. చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని పెట్టి డమ్మీ చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్‌లోనూ డమ్మీ అభ్యర్థులను పెట్టారు" అని కేటీఆర్ అన్నారు.

బీఆర్ఎస్10-12 ఎంపీ సీట్లు సాధిస్తే.. ఢిల్లీలో చక్రం తిప్పే అవకాశం

గుంపు, తాపీ మేస్త్రీలను తరిమికొట్టాలి

మోదీ, రేవంత్ చేతుల్లో రాష్ట్రం ఆగం: కేటీఆర్

ఆదిబట్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ వచ్చే అవకాశం లేదని, తెలంగాణలో 10 నుంచి 12 ఎంపీ సీట్లను బీఆర్ఎస్ సాధిస్తే ఢిల్లీలో చక్రం తిప్పేది మనమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిల చేతుల్లో రాష్ట్రం ఆగమవుతోందని, గుంపు మేస్త్రీ సీఎం, తాపీ మేస్త్రీ పీఎంలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మునిసిపాలిటీ బొంగ్లూరులో జరిగిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నాయని, ఆ పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి బీసీ బిడ్డ క్యామ మల్లేష్‌కు ఇబ్రహీంపట్నం నుంచి 50 వేల మెజార్టీ ఇచ్చి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు.

బీఆర్ఎస్ ఫండ్ తీసుకున్నట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- కావ్య కూడా లోక్‌సభ బరిలో ఉండదు
- స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి
- ఎవరికీ వెన్నుపోటు పొడవలేదు: కడియం



వరంగల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల కోసం తాను బీఆర్ఎస్ నుంచి పార్టీ ఫండ్ తీసుకున్నట్లు, అయినా కూడా పార్టీ మారినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న 6 గ్యారంటీలు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరానని స్పష్టం చేశారు. "నేను బీఆర్ఎస్ పార్టీ ఫండ్ తీసుకున్నట్లు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు ఎవరు నిరూపించినా లోక్‌సభ ఎన్నికల బరి నుంచి నా కూతురు కావ్య, రాజకీయాల నుంచి నేను తప్పుకొంటాం" అని సవాలు విసిరారు. శుక్రవారం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా తాను ఎవరికీ వెన్నుపోటు పొడవలేదని, పదవులే తనను వెతుక్కుంటూ వచ్చాయని చెప్పారు. తన ద్వారా రాజకీయంగా ఎదిగిన అరూరి రమేశే తనకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రమేశ్ చేసిన భూకబ్జాలే గత ఎన్నికల్లో ఆయన్ను ఓడించాయన్నారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, రాజకీయంగా ఎదుర్కోలేక తమపై వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంటే మతం మారినట్టు ప్రచారం చేస్తున్నారని, తండ్రి కులమే పిల్లలకు వర్తిస్తుందనే జ్ఞానం కూడా బీజేపీ నేతలకు లేదని మండిపడ్డారు. మందకృష్ణ తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఆయన స్వార్థం వల్లే ఎమ్మార్పీఎస్ పది ముక్కలుగా విడిపోయిందన్నారు. ప్రతీ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి కొమ్ముకాస్తూ మందకృష్ణ రాజకీయ పబ్బం గడుపుకొంటున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని చెబుతున్న బీజేపీకి ఓటు వేయాలని మందకృష్ణ ఎలా ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. బీజేపీతో కలిసి ఆయన దళితులకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వరంగల్‌లో 3 లక్షలకుపైగా మెజారిటీతో తన కూతురు కావ్య విజయం సాధిస్తుందని కడియం ధీమా వ్యక్తం చేశారు.

రాముడు దేవుడు.. కానీ

ఆయనను ఓ పార్టీకి లీడర్‌ను చేశారు

- మెదక్‌లో ఆ పార్టీ పేరు ఎత్తకండి
- ఇక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యే పోటీ
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాముడు దేవుడేనని, కానీ ఆయనను ఓ పార్టీకి లీడర్‌ను చేశారని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేశ్‌గడ్డ వద్ద కాంగ్రెస్ ప్రచార రథాలను మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ.. జగ్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాముడిని లీడర్‌ను చేసిన ఆ పార్టీ పేరును మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో ఎక్కడా ప్రస్తావించవద్దన్నారు. ఈ ఎన్నికల్లో మెదక్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే పోటీ ఉంటుందన్నారు. ఇక మూడో అభ్యర్థి తమకు పోటీయే కాదని చెప్పారు. దివంగత ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ గడ్డపై మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ బీసీ అయినప్పటికీ అన్ని కులాల మద్దతు అవసరమన్నారు. అన్ని కులాలు మతాలతో కూడుకున్న సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ అని పేర్కొన్నారు. పార్టీ విజయం కోసం సంగారెడ్డిలో తన భార్య నిర్మల కష్టపడుతున్నారని, తాను బ్యాక్‌గ్రౌండ్ వర్క్ చేస్తున్నానని తెలిపారు. తొలుత మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఇందిరమ్మ గెలిచారని, ఆ తర్వాత దివంగత మాజీ మంత్రి ఎం.బాగారెడ్డి పలుమార్లు గెలిచి పార్టీనీ బలోపేతం చేశారన్నారు. మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించాలని, ఇందుకోసం పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని జగ్గారెడ్డి కోరారు.

కమలం ప్రచారం ఇక ఉధృతం

15 భారీ బహిరంగ సభలు, 2-3 రోడ్డు షోలు

- పాల్గొననున్న మోదీ, అమిత్ షా, నడ్డా
- ఎక్కడ జరపాలన్న దానిపై బీజేపీ కసరత్తు
- ఇప్పటికే ముమ్మరంగా ఇంటింటి ప్రచారం
- మోదీ హ్యాట్రిక్ కోసం చెమటోడుస్తున్న శ్రేణులు

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి కనీసం పది ఎంపీ సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. అందుకు అనుగుణంగా ప్రచారాన్ని ఉధృతం చేయబోతోంది. పెద్దసంఖ్యలో బహిరంగసభలు, రోడ్డు షోలు నిర్వహించి సత్తాచాటేందుకు పార్టీ నాయకత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ అభ్యర్థులకు మద్దతుగా అగ్రనేతలు రంగంలోకి దిగనున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలో సుడిగాలి ప్రచారం చేయనున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు ఈనెల 18న నోటిఫికేషన్ జారీ కానున్న సంగతి తెలిసిందే. బీజేపీ సన్నద్ధతపై ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు మాట్లాడుతూ.. 'అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియను పెద్దఎత్తున నిర్వహించి క్షేత్రస్థాయిలో కేడర్‌లో మరింత జోష్ తీసుకురాబోతున్నాం. నామినేషన్‌ల దాఖలు సందర్భంగా పార్టీ జాతీయ నేతలు హాజరవుతారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత పార్టీ అగ్రనేతల ప్రచార సభలు ఉంటాయి. మే 11 వరకూ వీటిని నిర్వహిస్తాం. మోదీ, అమిత్‌షా, నడ్డాలతో కనీసం 15 బహిరంగసభలు, రెండు లేదా మూడు భారీ రోడ్డు షోలు నిర్వహించాలని భావిస్తున్నాం. వీటిని ఏయే ప్రాంతాల్లో జరపాలి అన్నదానిపై కసరత్తు జరుగుతోంది' అని తెలిపారు. కాగా, ప్రధాని మోదీ గత నెల 15వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన భారీ రోడ్డు షోతో పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొన్నదని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

కార్యరూపంలోకి అమిత్ షా ఆదేశాలు

గత నెల 12వ తేదీన హైదరాబాద్‌కు వచ్చిన అమిత్‌షా, పార్టీ సంస్థాగత పటిష్ఠతపై కేడర్‌కు, నేతలకు పలు సూచనలు చేశారని, ఇందుకు అనుగుణంగా పోలింగ్‌బూత్ స్థాయి కార్యక్రమాలు, పార్లమెంటు సెగ్మెంటు సమ్మేళనాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభమయ్యే నాటికే పార్లమెంటు సెగ్మెంట్ల సమ్మేళనాలు పూర్తి చేస్తామని, ఆ తర్వాత నుంచి ప్రచారంపైనే దృష్టి కేంద్రీకరించి ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులు ఎక్కడికక్కడ ఇంటింటి ప్రచారం జరుపుతున్నారని, ప్రధానిగా మూడోసారి మోదీ ఎందుకు రావాలో అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే.. బీజేపీని ఎక్కువ స్థానాల్లో గెలిపిస్తే రాష్ట్రానికి జరిగే ప్రయోజనాలను వివరిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ జాతీయ అగ్రనేతల ప్రచారం తమ విజయావకాశాలను మరింత మెరుగుపరుస్తుందని బీజేపీ మరో నాయకుడు ధీమా వ్యక్తం చేశారు.

మోదీ సభలపై కసరత్తు

ప్రధాని నరేంద్రమోదీ ఇప్పటి వరకు పాల్గొనని పార్లమెంటు నియోజకవర్గాల్లో ప్రచారం చేయబోతున్నారు. గత నెల మొదటివారంలో రాష్ట్రంలో పర్యటించిన మోదీ.. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు రాష్ట్రంలో బీజేపీ ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఆదిలాబాద్, జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్లలో ఈ సభలు జరిగాయి. అనంతరం, గత నెల 15వ తేదీన మల్కాజ్‌గిరి, 16న నాగర్‌కర్నూలు, 18న నిజామాబాద్ పార్లమెంటు పరిధిలోని జగిత్యాలలో నిర్వహించిన ఎన్నికల సభల్లో మోదీ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, వీటిని మినహాయించి మిగిలిన పార్లమెంటు నియోజకవర్గాల పరిధుల్లో మోదీ సభలు ఏర్పాటు చేయబోతున్నట్లు బీజేపీ ముఖ్యనేత ఒకరు చెప్పారు. ఏయే కేంద్రాల్లో వీటిని నిర్వహించాలన్నదానిపై కసరత్తు జరుగుతోందని ఆయన తెలిపారు. అమిత్‌షా, జేపీ నడ్డాల సభలు కూడా మోదీ హాజరుకాని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు వివరించారు.

కాంగ్రెస్ మైనార్టీ కీలక నేతకు బీజేపీ గాలం!

- పాత బస్తీలో ఎంఐఎంకు చెక్ పెట్టడమే లక్ష్యం
- మజ్లిస్ పట్ల హస్తం పార్టీ వైఖరితో అసంతృప్తి
- సమావేశాల్లో తీవ్ర వ్యాఖ్యలతో ధిక్కార స్వరం
- ఇదే అదనుగా ఆహ్వానం పలికిన కాషాయ దళం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పాత బస్తీకి చెందిన మైనార్టీ కీలక నేతకు బీజేపీ గాలం వేసినట్లు తెలిసింది. సికింద్రాబాద్, హైదరాబాద్ గెలుపులో దోహదపడే అవకాశం ఉండడంతో ఆయనను చేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పలుమార్లు పోటీ చేసిన ఆ నేత స్వల్ప ఓట్లతో ఓడిపోయారు. హస్తం పార్టీలో కొన్నేళ్లుగా కొనసాగుతూ పాతబస్తీలో మజ్లిస్ నేతలతో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మజ్లిస్ ఎమ్మెల్యేలతో పాటు ఆ పార్టీ నేతలను పాతబస్తీ అభివృద్ధిలో దూరం పెడుతుందని భావించారు. అలాకాకుండా కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారంగా కలుపుకొని పోతుండడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా తనకు కాకుండా మరొకరికి పార్టీ అవకాశం కల్పించాలని చూస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల గాంధీభవన్‌లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఆ మైనార్టీ నేత జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మండిపడ్డారు. కొద్దిరోజుల క్రితం చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఉప్పుగూడలో అంగన్‌వాడీ భవన ప్రారంభానికి హాజరైన పొన్నం స్థానిక మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీతో కలిసి టీ తాగడాన్ని ప్రస్తావిస్తూ నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇఫ్తార్ విందులో మజ్లిస్ నేతలతో వేదిక పంచుకోవడం పట్ల కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే అదనుగా బీజేపీ నేతలు ఆ మైనార్టీ నేతకు టచ్‌లోకి వెళ్లారు. ఈ పరిణామం తర్వాతే ఆయన పార్టీని ధిక్కరించే విధంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అధిష్ఠానాన్ని విమర్శిస్తూ వ్యాఖ్యలు కూడా చేయడంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆయనను పిలిపించి వైఖరి మార్చుకోవాలని, పార్టీని వీడినా ఇబ్బంది లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది.

పతంగిని దించేందుకు..

కాంగ్రెస్ నుంచి మైనార్టీ నేత చేరితే.. హైదరాబాద్ ఎంపీ స్థానంతో పాటు సికింద్రాబాద్ సీటు పరిధిలోని మైనార్టీ ఓట్లను ప్రభావితం చేయొచ్చని బీజేపీ నేతలు భావిస్తున్నారు. పాతబస్తీలో ఎంఐఎంకు మున్ముందు చెక్ పెట్టొచ్చని ఆలోచన చేస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో గంపగుత్తగా హిందువుల ఓట్లను రాబట్టుకుని.. మజ్లిస్ వ్యతిరేక మైనార్టీ ఓట్లను ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ రాష్ట్ర నాయకత్వమే కాంగ్రెస్ మైనారిటీ నేతతో నేరుగా ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది.

తుపాకీ సిద్ధంగా ఉంది

ఒక్క తూటా చాలు



(మొదటిపేజీ తరువాయి)

ఉండేదిగానీ.. కవిత అరెస్టు ఏ మాత్రం ప్రభావం చూపదని, ఆ అంశంపై చర్చ కూడా జరగదని ఆయన తేల్చిచెప్పారు. రావణుడు ఉన్నంతకాలం రాముడు ఉంటారని, కేసీఆర్ ఉన్నంత కాలం రేవంత్ ఉంటారని వ్యాఖ్యానించారు. 'ఆప్ కీ అదాలత్'లో పాల్గొనేందుకు రేవంత్ ప్రత్యేకంగా గురువారం ఢిల్లీకి వచ్చి వెళ్లిపోయారు. రజత్ శర్మతో పాటు ప్రేక్షకులు అడిగిన పదునైన ప్రశ్నలకు తనదైన శైలిలో ఆయన ఇచ్చిన జవాబులకు అడుగడుగునా చప్పట్ల వర్షం కురిసింది. ఈ ఇంటర్వ్యూను 'రేవంత్ రెడ్డి రోర్స్ (ఆర్ఆర్ఆర్)' పేరుతో ఇండియా టీవీ శనివారం రాత్రి ప్రసారం చేయనున్నది. ఉత్తర భారతంలో బీజేపీ ప్రాబల్యం ఎక్కువగా ఉన్న మీడియాలో రేవంత్ రెడ్డి తొలిసారి తన బలమైన ముద్ర వేశారు.

మోదీ బూటకపు హామీలు..

మోదీ నేతృత్వంలోని బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు రావాలంటే ఒక్క భారతదేశంలో పోటీ చేస్తే చాలదని, పాకిస్తాన్‌లో కూడా ఆ పార్టీ పోటీ చేయాలని రేవంత్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో బీజేపీ యూపీ, ఢిల్లీ, బిహార్ తదితర రాష్ట్రాల్లో అత్యధిక సీట్లు గెలుచుకుందని, ఈసారి ఆయా రాష్ట్రాల్లో మళ్లీ అన్ని సీట్లు రావడం అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. కమలనాథులకు ఈసారి 200-240 సీట్లకు మించి రావని జోస్యం చెప్పారు. దక్షిణాదిన ఉన్న 129 సీట్లలో కర్ణాటకలో 10-12, తెలంగాణలో రెండు సీట్ల కంటే ఎక్కువ రావని.. అలాంటప్పుడు దేశవ్యాప్తంగా 400 సీట్లు ఎక్కణ్నుంచి వస్తాయని ప్రశ్నించారు. కేసీఆర్ కూడా అసెంబ్లీ ఎన్నికల్లో తమకు 100 సీట్లకు పైగా వస్తాయన్నారని.. కానీ 39 మాత్రమే వచ్చాయని గుర్తుచేశారు. రాజకీయ నాయకులు ఒక వాతావరణం కల్పించేందుకు.. వాట్సాప్ యూనివర్సిటీల్లో ప్రచారం కోసం గొప్పలు చెప్పుకోవడం సహజమని పేర్కొన్నారు. మోదీ అసలు విజయం వాట్సాప్ యూనివర్సిటీల్లోనేనని ఎద్దేవా చేశారు. ఈసారి ప్రజలు ఆలోచిస్తున్నారని.. నిరుద్యోగం, అధిక ధరలు జనంపై తీవ్ర ప్రభావం చూపుతాయని రేవంత్ స్పష్టం చేశారు. యువకుల్లో 62 శాతం నిరుద్యోగులేనని.. వారు మోదీ వ్యతిరేకులేనని ఒక సర్వేలో తేలిందని గుర్తుచేశారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్ల ధరలు పెరిగాయని.. మోదీ అన్నీ బూటకపు హామీలు ఇచ్చారని ధ్వజమెత్తారు. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన మోదీ.. 7 కోట్ల మందికే ఇచ్చారని.. పార్లమెంట్‌లో తాను అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారని వెల్లడించారు. జన్ ధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామన్నారని.. ఆ డబ్బులు ఎక్కడొచ్చాయని అడిగారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తారని చెప్పారని.. కానీ ఇవాళ ఢిల్లీలో కూడా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నెలల తరబడి రైతులు ధర్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు చేసిన వాగ్దానం ప్రకారం ఇళ్లు ఎక్కడ ఇచ్చారని నిలదీశారు. అయినప్పటికీ మోదీ మూడోసారి ప్రధాని అవుతానని కలలు కంటున్నారని వ్యంగ్యంగా అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 67 సంవత్సరాల్లో 14 మంది ప్రధానమంత్రులు రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే.. మోదీ గత పదేళ్లలో రూ.113 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని.. ఆ డబ్బంతా ఎక్కడకు వెళ్లిందని నిలదీశారు. గత ప్రధానులు ఎన్నో ఆనకట్టలు కట్టారని, ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.

వ్యవస్థలతో పోరాడను..

"మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చేసిన రాహుల్‌గాంధీ.. మోదీని 'కౌకదార్ చోర్‌హై' అంటారు. మీరు మాత్రం మోదీని 'బడే భాయ్' అంటారు? అని రజత్‌శర్మ ప్రశ్నించగా.. "మీరు పరిస్థితిని అర్థం చేసుకోవాలి. నేను సీఎం అయ్యాక తొలిసారి ప్రధాని మోదీ మా రాష్ట్రానికి వచ్చారు. మేమిద్దరమూ ఒకే వేదికపై కూర్చున్నాము. ప్రధానిగా ఆయన దేశానికే పెద్దన్న లాంటివారు. నాకేకాదు, ఈ దేశంలో ముఖ్యమంత్రులందరికీ ఆయన బడేభాయ్ లాంటివారు. అందుకే.. 'మీరు పెద్దరికం చూపాలి. మీరు గుజరాత్‌కు గిఫ్ట్ సిటీ తెచ్చారు. సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేశారు. మా తెలంగాణకు కూడా మూసీ రివర్ ఫ్రంట్ ఇవ్వండి. అభివృద్ధి కోసం ఎన్ని నిధులివ్వాల్సి ఉంటే అన్ని నిధులూ ఇచ్చి 'బడే భాయ్' అని నిరూపించుకోండి' అని చెప్పాను" అని రేవంత్ జవాబిచ్చారు. మోదీ ఎప్పుడూ 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడతారని.. అది రావాలంటే దేశంలో ఐదు మెట్రోపాలిటన్ నగరాలు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా.. అన్నీ అభివృద్ధి చెందాలని రేవంత్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా రంగాల్లో పెట్టుబడులు రావాలన్నారు. 'మోదీజీ, మీరు తెలంగాణకు అన్యాయం చేశారు. తెలంగాణకు రావల్సిన ప్రాజెక్టులన్నీ భయపెట్టి, బెదిరించి గుజరాత్‌కు తీసుకువెళుతున్నారు. అందుకే బడేభాయ్ లాగా మాకు మద్దతివ్వాలి' అని చెప్పానని రేవంత్ తెలిపారు. ప్రధానితో తన సమావేశం ఇద్దరు రాజకీయ నేతల మధ్య భేటీ కాదని.. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాధినేతల మధ్య సమావేశమని రేవంత్ వివరణ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సత్సంబంధాలుండాలని.. వ్యవస్థలతో తాను పోరాడదల్చుకోలేదని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం, గవర్నర్, ప్రధాని లాంటి వ్యవస్థలతో తాను పోరాడనని.. బీజేపీతో సైద్ధాంతిక పోరాటం చేస్తానని తేల్చిచెప్పారు. "కానీ రాహుల్ గాంధీ కేంద్రంతో రోజూ పోరాడుతూనే ఉంటారు కదా?" అన్న ప్రశ్నకు.. రాహుల్ కూడా బీజేపీతో సైద్ధాంతిక పోరాటమే చేస్తున్నారని సమాధానమిచ్చారు. రాహుల్ ఒక రాజకీయ పార్టీ అధినేతగా మాట్లాడడం వేరని.. ఒక సీఎంగా తాను మాట్లాడుతున్నప్పుడు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుంటానని స్పష్టత ఇచ్చారు.

అదానీ జేబులో డబ్బులతో..

"రాహుల్ గాంధీ గౌతమ్ అదానీని జేబు దొంగ అన్నారు. మౌనంగా జేబు కత్తిరిస్తారని విమర్శించారు. కానీ మీరు సీఎం కాగానే అదానీకి రూ.12,500 కోట్ల మేర ప్రాజెక్టులు ఇచ్చారు కదా?" అని రజత్ శర్మ ప్రశ్నించగా.. రేవంత్ గట్టిగా బదులిచ్చారు. ప్రభుత్వం నిర్మించిన రేవులు, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, నవరత్న సంస్థలను మోదీ అతి చౌక ధరలకు అదానీకి కట్టబెట్టారని.. తాను అదానీ జేబులో ఉన్న డబ్బులతో తెలంగాణలో పెట్టుబడులు పెట్టించానని, రెంటికీ తేడా అది అని చెప్పారు. తాను తెలంగాణ ఆస్తులేవీ అదానీకి కట్టబెట్టలేదని.. విద్యుత్, కృత్రిమ మేధ రంగాల్లో అదానీ పెట్టుబడులు స్వీకరించానని గుర్తుచేశారు. అదానీ అయినా, అంబానీ అయినా టాటా అయినా బిర్లా అయినా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకొస్తే తాను ఆహ్వానిస్తానని స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం అన్నిటినీ చవకగా అదానీకి కట్టబెడుతోందంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలు సరైనవేనని రేవంత్ పేర్కొన్నారు. అదానీతో రేవంత్ దిగిన ఫొటోను రజత్ శర్మ ప్రదర్శించినప్పుడు.. 'మంచి ఫొటో' అని రేవంత్ కితాబిచ్చారు. తానేమీ అదానీని రహస్యంగా కలుసుకోలేదని.. బహిరంగంగా ప్రజల ముందు కలుసుకుని, పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరానని గుర్తుచేశారు. 'మీరు కూడా తెలంగాణకు వచ్చి పెట్టుబడులు పెడితే ఆహ్వానిస్తాను' అని రజత్‌శర్మపై చలోక్తి విసిరారు. తాను సీఎంగా ఉన్న తెలంగాణలో అదానీని దోపిడీ చేయనివ్వనని స్పష్టం చేశారు. "పెట్టుబడిదారులకు నేను భరోసాగా నిలుస్తాను. గ్యారంటీ ఇస్తాను. కానీ, దోపిడీ మాత్రం చేయనివ్వను. పెట్టుబడికి లూటీకి తేడా ఉంది" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

కేజ్రీ అరెస్టు అక్రమమే..

కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేశారని.. అందువల్ల ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడంలో తప్పేమీ లేదని రేవంత్ అన్నారు. రెండేళ్లుగా కేసులు నడుస్తుంటే ఎన్నికల సమయంలో ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. 'రెండు నెలల తర్వాత అరెస్టు చేసి ఉంటే కొంప మునిగేది కాదు కదా? సాక్ష్యాధారాలుంటే రెండేళ్లుగా ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని నిలదీశారు. అవినీతికి శిక్ష పడకూడదని తాను అనట్లేదని.. కానీ ఎలా అరెస్టు చేశారో కోట్లాది మంది ప్రజలు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇది దేశానికి మంచిదా అని అడిగారు. "వంద కోట్ల రూపాయలు మద్యం వ్యాపారుల నుంచి తీసుకుని గోవా, పంజాబ్ ఎన్నికల్లో ఉపయోగించారనేదే కదా మీ ఆరోపణ! కానీ.. అదే మద్యం వ్యాపారి ఎన్నికల బాండ్ల రూపంలో రూ.400-500 కోట్లు భారతీయ జనతా పార్టీకి అరెస్టు తర్వాత ఇచ్చారు" అని రేవంత్ గుర్తుచేశారు. "బీజేపీ వైట్‌లో తీసుకుంది. వారు బ్లాక్‌లో తీసుకున్నారు ఏం తేడా?" అని ప్రశ్నించారు. దీని ప్రభావం ఎన్నికలపై తప్పకుండా ఉంటుందని.. ప్రజలు అన్నీ చూస్తున్నారని తెలిపారు. రూ.22,500 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వసూలుచేస్తే అందులో రూ.7వేల కోట్లు బీజేపీకి వచ్చాయని గుర్తుచేశారు. బీజేపీకి నిధులిచ్చినవారంతా ఎవరు? అని నిలదీశారు. వారంతా ఆకాశం నుంచి ఊడిపడలేదు కదా అని వ్యాఖ్యానించారు. బీజేపీకి, బీఆర్ఎస్‌కు, టీఎంసీకి తేడా ఏమున్నదని.. బీజేపీ నీతి వాక్యాలు ఎందుకు పలుకుతోందని ప్రశ్నించారు. బీజేపీకి, ఇతర అవినీతి పార్టీలకూ తేడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను విద్యార్థి పరిషత్ కాలం నుంచీ బీజేపీని చూస్తున్నానని.. ఎన్నికల ముందు ఎప్పుడూ బీజేపీ ఒక ఎజెండాను ఖరారు చేస్తుందని.. కానీ మొదటిసారి మోదీ నాయకత్వంలో బీజేపీ ఖరారు చేసిన ఎజెండా ప్రకారం ఎన్నికల్లోకి వెళ్లడం లేదని రేవంత్ విశ్లేషించారు. మోదీ నాయకత్వంలో బీజేపీ పట్టాలు తప్పిందన్నారు. 2024 ఎన్నికల్లో రామమందిరం పేరుతో ఎన్నికల్లోకి వెళ్లాలని నిర్ణయించారని.. కానీ మందిర నిర్మాణం పూర్తికాగానే సోరేన్, కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారని.. ఇప్పుడు టీవీల్లో రామమందిరం బదులు అరెస్టుల గురించి చర్చ జరుగుతోందని రేవంత్ గుర్తుచేశారు. బీజేపీవారు తమ ఎజెండాను తామే నీరుగార్చారని వ్యాఖ్యానించారు. అవినీతిపరులను వదిలిపెట్టబోనని, అందర్నీ జైలుకు పంపిస్తానని మోదీ అంటున్నారని.. అలా అయితే హిమంత విశ్వ శర్మ, జ్యోతిరాదిత్య సింధియా, నవీన్ జిందాల్, అశోక్ చవాన్, అజిత్ పవార్‌పై కూడా కేసులు ఉన్నాయి కదా వారిని ఎందుకు జైలుకు పంపలేదు? అని రేవంత్ నిలదీశారు. ఈడీ కేసులున్నవారందరూ బీజేపీలో చేరిన వెంటనే మహాత్ములయ్యారని ఎద్దేవా చేశారు. వారందర్నీ పక్కన పెట్టుకుని తాను అవినీతికి వ్యతిరేకినని మోదీ అంటున్నారని మండిపడ్డారు. మోదీ అవినీతిపరుడని తాను అనడం లేదని.. కానీ ఆయన పక్కన ఉన్నవారి సంగతేమిటని ప్రశ్నించారు. అవినీతిపరులను లోపలికి పంపిస్తానని మోదీ అంటే బీజేపీలోకి పంపించడమా అని అడిగారు.

అలాగే మాట్లాడతారు..

కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయిన వారు బీజేపీ భాషలో మాట్లాడడంలో ఆశ్చర్యం లేదని.. పదవుల కోసం, కేసుల నుంచి తప్పించుకునేందుకు వారు అలా మాట్లాడతారని రేవంత్ అన్నారు. ఈడీ కేసుల వల్ల బీజేపీలో చేరేవారు పెరుగుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఆదాయ పన్ను, సీబీఐ, ఈడీ, నార్కోటిక్స్ కేసుల్లో ఏదో ఒకటి ఎంచుకొమ్మని మోదీ వారిని బెదిరిస్తున్నారని విమర్శించారు. "మరి బీఆర్ఎస్ నేతల్ని మీ పార్టీలో చేర్చుకుంటున్నారు కదా? మీరు కూడా వాషింగ్ మెషీన్ వాడుతున్నారా?" అని అడగ్గా.. తామింకా వాషింగ్ మెషీన్ కొనుక్కోలేదని రేవంత్ బదులిచ్చారు.

రానున్న రోజుల్లో దక్షిణాది ప్రధాని

'రానున్న రోజుల్లో దక్షిణాది వారే ప్రధాని అవుతారు' అని రేవంత్ ఈ కార్యక్రమంలో ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు. కాంగ్రెస్‌కు అఖిల భారత స్థాయిలో అధ్యక్షుడుగా ఉన్న మల్లికార్జున ఖర్గే దక్షిణాది వాడేనని, రాహుల్ గాంధీ కూడా దక్షిణాదిలోని వాయనాడు నుంచి పోటీ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ దక్షిణాదిని కబ్జా చేసిందన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. గతంలో 42 మంది తెలుగు ఎంపీల్లో ఒక్కరినే కేబినెట్ మంత్రిని చేశారని, గుజరాత్‌లో 28 మంది ఎంపీలు ఉంటే ఏడుగురిని, యూపీలో 62 మంది ఎంపీల్లో ప్రధాని సహా 16 మందిని మంత్రుల్ని చేశారని, ప్రధానమంత్రి, హోంమంత్రి, స్పీకర్, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ అందరూ ఉత్తరాది వారేనని, దక్షిణాదికి ఏమిచ్చారని ఆయన ప్రశ్నించారు. దక్షిణాది దేశంలో భాగం కాదా? హిందుస్తాన్‌లో లేదా? అని నిలదీశారు. దేశంలో హిందీ తర్వాత తెలుగు అత్యధికులు మాట్లాడే భాష అని.. అయినా వెంకయ్య నాయుడును ఉత్తరాది నుంచి గెంటేశారని ఆగ్రహం వెలిబుచ్చారు. తమిళనాడు, తెలంగాణలో కూడా జనం మోదీ, మోదీ అంటున్నారు కదా అని అడగ్గా.. సినిమాలో అప్పుడప్పుడూ జోకులు, కామెడీ కూడా ఉంటే బాగుంటుందని రేవంత్ చమత్కరించారు. తెలంగాణ నుంచి సోనియా, రాహుల్, ప్రియాంకను పోటీ చేయాల్సిందిగా కోరామని.. వారివల్లే తెలంగాణ వచ్చిందని, వారు లేకపోతే వంద సంవత్సరాలైనా తెలంగాణ వచ్చేది కాదని అన్నారు.

ఒకటి కావాలంటే..

'మీరు ఆస్తులు అమ్మి ఎన్నికల్లో పోటీ చేశారు కదా?' అనే ప్రశ్నకు.. 'ఒకటి రావాలంటే ఒకటి కోల్పోవాలి. ఆస్తులు కోల్పోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. రాజనీతిలో అలా ఉండదు' అని రేవంత్ బదులిచ్చారు. తన ఆలోచనలో స్పష్టత ఉన్నందుకే తాను సీఎంను కాగలిగానన్నారు.

బీఆర్ఎస్ సుపారీ తీసుకుంది

లోక్‌సభ ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలో కలుస్తారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. మహబూబ్ నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి, జహీరాబాద్ సీట్లలో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ సుపారీ తీసుకుందని.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అవగాహన ఉన్నదని రేవంత్ ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడే అర్హత సుపారీ తీసుకున్న వారికి ఏమి ఉన్నదని ప్రశ్నించారు. అధికార దాహంతో బీజేపీలో చేరాలనుకుంటే.. 2017లోనే చేరి మంత్రినయ్యేవాడినని, ఇవాళ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న తనకు బీజేపీలో చేరాల్సిన అవసరమేమున్నదని ప్రశ్నించారు. తాను 17 సంవత్సరాలుగా ప్రతిపక్షంలోనే ఉన్నానని.. పోరాడి ముఖ్యమంత్రి అయ్యానని, ఎవరి దయాదాక్షిణ్యాలతో ఈ పదవిలోకి రాలేదని గుర్తుచేశారు. కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా ద్వారా వచ్చారని.. ఆయనతో తనకు పోలికేమిటని ధ్వజమెత్తారు. తండ్రి పేరుతో కేటీఆర్‌కు నౌకరీ దొరికిందని.. తండ్రి లేకపోతే ఆయన చప్రాసీ కూడా కాలేడని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిని కేటీఆర్ 'చోటా మోదీ' అని విమర్శించిన విషయాన్ని ఈ సందర్భంగా రజత్ శర్మ గుర్తుచేశారు. "చోటా మోదీ, బడా మోదీ, అదానీ కలిసి ట్రిపుల్ ఇంజన్ సర్కారు నడుపుతున్నారు" అంటూ కేటీఆర్ అన్న మాటలను గుర్తుచేయగా.. "కేటీఆర్ సంతోషం ఎన్నాళ్లలే! రెండు నెలల తర్వాత అంతా తేలిపోతుంది" అని రేవంత్ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

జనగామ మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్

» ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జనగామ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విధుల్లో అలసత్వం వహించారన్న కారణంతో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి జి.భాస్కర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ నెల 10న జనగామ మార్కెట్‌లో వరి ధాన్యాన్ని ట్రేడర్లు తక్కువ ధరకు కొనే ప్రయత్నం ట్రేడర్ల తీరును నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం స్పందించారు. రైతులకు తక్కువ ధర చెల్లించాలని చూస్తే ఊరుకునేది లేదని ట్రేడర్లను, మార్కెట్ అధికారులను 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. రైతుల ఆందోళన ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ మేరకు పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖలు ప్రభుత్వానికి నివేదిక పంపాయి. ఈ క్రమంలో మార్కెట్ కార్యదర్శి పనితీరుపై కలెక్టర్ విచారణ జరిపారు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు మార్కెట్‌లో రైతులకు సరైన వసతులు కల్పించలేకపోయారన్న కారణంతో భాస్కర్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కలెక్టర్ అనుమతి లేకుండా జనగామ హెడ్‌క్వార్టర్స్ దాటి బయటకు వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా.. జనగామ మార్కెట్ సెక్రటరీగా గ్రేడ్-3 కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఐఆర్ఎఫ్ఎమ్ డైరెక్టర్ జనరల్‌గా అపర్ణగార్గ్

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(ఐఆర్ఎఫ్ఎమ్) డైరెక్టర్ జనరల్‌గా అపర్ణ గార్గ్ బాధ్యతలు చేపట్టారు. ఆమె సివిల్ సర్వీసెస్ 1987 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ రైల్వేస్ అకౌంట్స్ సర్వీస్ అధికారిణి. ఇంతకు ముందు బెంగళూరులో రైల్ వీల్ ఫ్యాక్టరీకి ప్రధానఆర్థిక సలహాదారుగా, మైసూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా సేవలందించారు. దక్షిణ రైల్వే, పశ్చిమ రైల్వే, నైరుతి రైల్వేలలో 35 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో అపర్ణగార్ పనిచేశారని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు.

పెరిగిన క్షయ చికిత్స సక్సెస్ రేటు

» 87 శాతానికి చేరుకున్నట్లు కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): క్షయ చికిత్స సక్సెస్ రేటు బాగా పెరిగింది. 86.9 శాతానికి చేరుకున్నట్లు తాజాగా కేంద్రం వెల్లడించింది. గత తొమ్మిదేళ్లల్లో ఇదే అత్యధికమని ప్రకటించింది. 2022 నాటికి 85.5 శాతంగా ఉన్న టీబీ చికిత్స సక్సెస్ రేటు 2023 డిసెంబరు నాటికి మరో 1.4 శాతం పెరిగినట్లు తెలిపింది. కాగా 2021లో అది కేవలం 84 శాతంగా ఉండేదని పేర్కొంది. కాగా కేంద్రప్రభుత్వం 2025 నాటికి క్షయరహిత దేశంగా భారత్‌ను నిలపాలని లక్ష్యంగా పెట్టుకుంది. టీబీ నిర్మూలన కోసం జాతీయ వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో టీబీ రోగులను గుర్తించి, వారికి చికిత్స అందిస్తోంది. ఇందుకోసం డిటెక్ట్-ట్రీట్-ప్రివెంట్- బిల్డ్(డీటీపీబీ) అనే విధానాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా అత్యంత నాణ్యమైన టీబీ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయడంతోపాటు క్షయ రోగులకు ఔషధాలను కూడా ఉచితంగానే అందిస్తోంది.

ఐదేళ్లలోపు టీబీ రోగులకు నోటి మందులు

ఇప్పటిదాకా డ్రగ్ రెసిస్టెంట్ టీబీతో బాధపడే ఐదేళ్లలోపు చిన్నారులకు చికిత్సలో భాగంగా ఇంజెక్షన్లు ఇస్తున్నారు. అంత చిన్న వయస్సు వారికి ఇంజెక్షన్లు ఎంతో నొప్పిని కలిగిస్తాయి. కొన్ని సార్లు వారిలో సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. అయితే గత నెలలో ఐదేళ్లలోపు చిన్నారులకు నోటి ద్వారా అందించే డెలామానిడ్ ఔషధానికి అనుమతులు లభించాయి. పీడియాట్రిక్ టీబీ చికిత్సలో ఇదొక విప్లవాత్మకమైన మార్పుగా వైద్యులు అభివర్ణిస్తున్నారు. అంతేకాక చిన్న వయస్సు రోగులకు సైతం ఆ ఔషధాన్ని ఇచ్చేందుకు కేంద్ర క్షయ విభాగం అనుమతి ఇచ్చింది. అందుకు అవసరమైన చికిత్సా మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. గతంలో ఆరేళ్లు దాటని వారికి దీన్ని వాడటంపై పరిమితులుండేవి. ప్రస్తుతం డెలామానిడ్‌ను మల్టీడ్రగ్ రెసిస్టెంట్-ఎక్స్‌టెన్సివ్లీ డ్రగ్ రెసిస్టెంట్(ఎండీఆర్- ఎక్స్‌డీఆర్) టీబీ బాధితులైన శిశువులతోపాటు పిల్లలకు కూడా దీన్ని వాడే వెసులుబాటు కలిగింది.

ఐపీఎల్ టికెట్ల గోల్‌మాల్?

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్షంగా వీక్షించాలనే ఆశపడుతున్న తమకు ఎన్నాళ్లీ నిరాశ? అని ప్రశ్నిస్తున్నారు. లోకల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), టికెట్ల విక్రయాలను భుజానెత్తుకున్న పేటీఎం నిర్వాహకులే టికెట్ల అమ్మకాలను పక్కదారి పట్టిస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఎన్ని టిక్కెట్లు అమ్మకానికి పెడుతున్నాం.. అందులో ఎన్ని టిక్కెట్లు.. ఎంత సమయంలో విక్రయించాం అనే పారదర్శక విధానానికి ఎస్ఆర్‌హెచ్ పూర్తిగా గండికొట్టి ఇష్టారీతిగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. మొత్తంగా సామాన్య అభిమానులకు ఐపీఎల్ మ్యాచ్ టికెట్ దొరకడం బంగారం అయిపోయింది. టికెట్ల అమ్మకాలపై ఐపీఎల్ నిర్వాహకులు, హెచ్‌సీఏకు ఆజమాయిషీ లేకపోవడంతో ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం ఆడిందే ఆటగా మారిపోయింది. అందునా... టికెట్ల ధరనూ ఫ్రాంచైజీ ఇష్టారీతిన పెంచేసింది. నిరుడు ఐపీఎల్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో ప్రారంభ శ్రేణి నుంచి ప్రీమియం టికెట్ల ధరల్ని సుమారు రూ.1000 నుంచి రూ.5 వేలు వరకు ధరలు పెంచారు. కొన్ని మ్యాచ్‌లకైతే ధరలను రెట్టింపు చేశారు. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లపై అభిమానుల్లో ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని టికెట్ల ధరలను 100శాతం పెంచారు. మే నెల 2వ తేదీన జరగాల్సిన రాజస్థాన్ మ్యాచ్ కోసం రూ.2000గా ఉన్న టికెట్‌ను, బెంగళూరుతో మ్యాచ్ కోసం రూ.4వేలు చేశారు. అలాగే బాక్స్ టికెట్ ధర కూడా రూ.15 వేల నుంచి రూ. 30వేలకు పెంచేశారు. ఈసారి హైదరాబాద్ మొత్తంగా ఏడు మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తోంది. వీటిలో ఇప్పటికే రెండు ముగిశాయి. ఈనెల 25న బెంగళూరుతో జరగాల్సిన మ్యాచ్‌కు బాక్స్ టిక్కెట్లు (రూ.22, 30 వేలు) తప్ప అన్నీ అయిపోయినట్లు యాప్‌లో చూపుతున్నారు.

ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీ వాచాలత!

టికెట్ల అమ్మకాల్లో పారదర్శకత లేకపోవడం టికెట్ల ధరలను ఇష్టారీతిన పెంచడం గురించి ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు తెలిసింది. 'మేం ఉప్పల్ స్టేడియానికి అద్దె కడుతున్నాం.. మా ఇష్టమొచ్చినట్లుగానే నిర్వహిస్తాం.. టికెట్లనూ మా ఇష్టం వచ్చినట్లుగా అమ్ముకుంటాం' అని చెప్పినట్లు తెలుస్తోంది. ఈనెల 5న జరిగిన సీఎస్కే మ్యాచ్‌కు ముందు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంతో నిర్వహించిన సమావేశంలో టికెట్ల అమ్మకాల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులపై ప్రభుత్వ క్రీడాశాఖకు చెందిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రశ్నిస్తే వారి నుంచి సమాధానం కరవైందని తెలిసింది. వారి ఈ మౌనాన్నే మినిట్స్‌లో నమోదు చేస్తున్నానని సదరు సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పినా వారు ఏమీ మాట్లాడకుండా అక్కడి నుంచి జారుకున్నారట. ఇదే విషయమై సీఎంవోలోని ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి సన్‌రైజర్స్‌ను నిలదీయగా... తాము వేదికను ఇక్కడ నుంచి మరోచోటికి తరలిస్తామని, అప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తింటుందంటూ బ్లాక్‌మెయిల్ ధోరణిలో జవాబిచ్చినట్లు సమాచారం.

ఎస్ఆర్‌హెచ్, పేటీఎందే బాధ్యత

ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ, టికెట్ల విక్రయానికి సంబంధించిన పూర్తి బాధ్యత ఎస్ఆర్‌హెచ్, పేటీఎందే! టికెట్ల అమ్మకాలకు హెచ్‌సీఏకు ఎలాంటి సంబంధం లేదు. టెస్టు మ్యాచ్ టికెట్ల విక్రయాల్లో ఎలాంటి వివాదానికీ తావు లేకుండా పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించాం. ఐపీఎల్ టిక్కెట్ల విషయంలో మా పాత్ర శూన్యం.

- ఎ.జగన్‌మోహన్ రావు-హెచ్‌సీఏ అధ్యక్షుడు

తెలంగాణకు 8.5 టీఎంసీలు ఏపీకి 5.5

» తాగునీటి అవసరాలకు కేటాయించిన కేఆర్ఎంబీ

» ఇరు రాష్ట్రాల ఈఎన్సీలతో సమావేశం

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కీలక నిర్ణయం తీసుకుంది. నాగార్జునసాగర్‌లో ఉన్న నీటి నిల్వల నుంచి తెలంగాణకు 8.5 టీఎంసీలను, ఏపీకి 5.5 టీఎంసీలను కేటాయించింది. తాగునీటి అవసరాలకు అదనపు జలాలు కావాలని కోరుతూ ఇటీవల బోర్డుకు ఇరు రాష్ట్రాలు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి డీఎం రాయిపురే నేతృత్వంలో శుక్రవారం సమావేశం జరిగింది. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ నారాయణరెడ్డితో కలిసి రాయిపురే రెండు గంటలపాటు చర్చించారు. శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటి నిల్వలు అంతంతమాత్రమే ఉన్నందున జూలై వరకు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఇరు రాష్ట్రాలకు సూచించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటి నిల్వలను వినియోగించుకోవద్దని ఈ సమావేశంలో తీర్మానించారు. సాగర్ జలాశయంలోని నీటినిల్వలపై చర్చించారు. సాగర్ ఎండీడీఎల్ (మినిమమ్ డ్రా డౌన్ లెవల్) 510 అడుగులు కాగా, గతంలో 505 అడుగులకు పైన అందుబాటులో ఉన్న నీటిని లెక్కగట్టి ఆ మేరకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. తాజా సమావేశంలో 500 అడుగులకుపైన ఉన్న నీటిని వాడుకునేలా ప్రతిపాదించారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో నీటినిల్వ మట్టం 510.53 అడుగుల వద్ద 132.86 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. తాజా నిర్ణయం నేపథ్యంలో 500 అడుగులకుపైన ఉన్న 17.55 టీఎంసీల వినియోగానికి అనుమతించారు. అందులో 3.55 టీఎంసీలను భవిష్యత్ అవసరాలకు మినహాయించి మిగిలిన 14 టీఎంసీలను ఇరు రాష్ట్రాలు వినియోగించుకోవాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణకు 8.5 టీఎంసీలను, ఏపీకి 5.5 టీఎంసీలను కేటాయిస్తూ త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది.

గత నిర్ణయాలపై సమీక్ష

అక్టోబరులో తీసుకున్న నిర్ణయాలు, తాజా పరిస్థితుల మీద కమిటీ చర్చించింది. 45 టీఎంసీలు ఏపీకి, 35 టీఎంసీలు తెలంగాణకు కేటాయిస్తూ గత అక్టోబరులో కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇందులో తమకు కేటాయించిన నీటిలో ఇంకా 5 టీఎంసీలు వాడుకోలేదని, తక్షణమే తమ కు ఆ నీరు వాడుకునేలా అవకాశం కల్పించాలని ఏపీ ఈఎన్సీ కోరారు. తమకు కేటాయించిన 35 టీఎంసీలతోపాటు అదనంగా మరో 7 టీఎంసీల నీటిని తెలంగాణ వాడుకుందని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తెలంగాణ ఈఎన్సీ మాట్లాడుతూ.. కృష్ణాజలాల్లో ఏపీ ఎక్కువ నీటిని వాడుకుందని, అదంతా లెక్కల్లోకి రాలేదన్నారు. శ్రీశైలం నుంచి నీటిని తరలించకుండా ఏపీని అడ్డుకోవాలని కోరారు. సాగర్ దిగువన ఉన్న ఏపీ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయని, అక్కడ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని ఏపీ ఈఎన్సీ వివరించగా.. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, హైదరాబాద్ అవసరాలనూ దృష్టిలో ఉంచుకుని తా గునీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ ఈఎన్సీ కోరారు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాలకు కేటాయింపులు జరుపుతూ కేఆర్ఎంబీ నిర్ణయం తీసుకుంది. ఈ భేటీలో సాగర్ సీఈ అజయ్‌కుమార్, ఈఈ విజయ్‌భాస్కర్, కృష్ణా డిప్యూటీ డైరెక్టర్ నల్లావిజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జోరు ఎండలు.. చిరు జల్లులు..!

పలు జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు.. సాయంత్రం పలు చోట్ల కురిసిన వర్షం

» నల్లగొండ జిల్లా కనగల్‌లో 21.3 మి.మీ వర్షపాతం

» నాగర్‌కర్నూల్‌లో పిడుగుపాటుకు మహిళ మృతి




నల్లగొండలోని అర్జాల బావి ఐకేపీ కొనుగోలు కేంద్రంలోకి చేరిన వరదన నీరు ; నల్గొండలో కురుస్తున్న వర్షం

నల్లగొండ/మహబూబ్‌నగర్/హైదరాబాద్, ఏప్రిల్ 12: రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలు జిల్లాల్లో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. వేసవి తాపానికి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిశాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ కూడా అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. నిండు వేసవిలో అక్కడక్కడ వర్షం పడటంతో ప్రజలు ఎండల నుంచి కాస్త ఉపశమనం పొందారు. జిల్లాలోని కనగల్‌లో 21.3మి.మీ. వర్షపాతం నమోదైంది. చండూరు, త్రిపురారంలో 0.8మి.మీలు, నాంపల్లి, తిప్పర్తి, దేవరకొండ, గుండ్లపల్లి 0.5మి.మీల చొప్పున చిరుజల్లులు కురిశాయి. నల్లగొండ సమీపంలోని అర్జాల బావిలో ఐకేపీ సెంటర్‌లో ధాన్యం రాశులు తడిసి పోయాయి. జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్‌తోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఐదు గంటలకు మొదలైన వర్షం దాదాపు గంటన్నర పాటు కురిసింది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 5.8మి.మీ. వర్షం కురువగా మండల పరిధిలోని కుమ్మెరలో 3.5మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉప్పునుంతల మండలం కొరటికల్, వెల్టూరు, తాండూరు, అచ్చంపేట మండలం పుల్జాల, హాజీపూర్, అచ్చంపేట పట్టణంలో వర్షం కురిసింది. కాగా ఉప్పునుంతల మండలం తాండూరుకు చెందిన గుండమోని శ్యామల(34) పిడుగుపాటుతో మృతిచెందింది. తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా.. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో ఆమె పక్కనే ఉన్న చెట్టు కిందకు వెళ్లింది. పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో శుక్రవారం 41.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో 40.9, వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లిలో 40.8 డిగ్రీలు, పాన్‌గల్, చిన్నంబావిలలో 40.3, ధరూర్‌లో 40.6, అలంపూర్, వడ్డేపల్లిలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత

నేడు అక్కడక్కడా వర్షాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రాగల మూడు రోజుల పాటు రాష్ట్ర పగటిపూట ఉష్ణోగ్రతలు 38-41 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

అమెరికాలో పెరుగుతున్న టెక్ నియామకాలు!

- కిందటి నెలలో 1.91 లక్షల కొత్త ఉద్యోగాల ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఉద్యోగాల ఊచకోతతో ఆందోళన చెందుతున్న టెకీలకు శుభవార్త! కరోనా కల్లోలం తర్వాత భారీగా ఉద్యోగులపై వేటు వేసిన అమెరికా టెక్ దిగ్గజాలు.. తిరిగి నియామకాలు ప్రారంభించాయి. అధికారిక గణాంకాల ప్రకారమే గత నెలలో యూఎస్‌లోని దిగ్గజ ఐటీ కంపెనీలు అరువేల మందిని నియమించినట్టు 'కంప్యూటింగ్ టెక్నాలజీ ఇండస్ట్రీ అసోసియేషన్' వెల్లడించింది. టెక్నాలజీ సర్వీసెస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్లౌడ్ ఇన్‌ఫ్రా రంగాల్లో నియామకాలు ఎక్కువగా జరుగుతున్నట్టు పేర్కొంది. ఆ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం.. అమెరికాలోని టెక్ కంపెనీలు మార్చి నెలలో 1,91,000 కొత్త ఉద్యోగాలను ప్రకటించాయి. ఫిబ్రవరి నెలతో పోలిస్తే ఆ సంఖ్య 8000 అధికం. 2023 ఆగస్టు నుంచి ఇదే అత్యధికం. ఫిబ్రవరి, మార్చి నెలల్లో న్యూయార్క్, వాషింగ్టన్, డల్లాస్, షికాగో, లాస్‌ఏంజెలెస్, శాన్‌ఫ్రాన్సిస్కోల్లో అత్యధిక నియామకాలు జరిగినట్టు కాంప్‌టీఐఏ నివేదిక వెల్లడించింది. భారతదేశానికి చెందిన పలు ఐటీ కంపెనీలు అమెరికాలో తమ ఉనికిని బలంగా చాటుకుంటున్న సంగతి తెలిసిందే. వాటిలో టీసీఎస్ కంపెనీకి అక్కడ 50 వేలమంది ఉద్యోగులున్నారు. అలాగే ఇన్ఫోసిస్‌కు 35 వేల మంది, హెచ్‌సీఎల్‌కు 24 వేల మంది, విప్రోకు 20 వేల మంది, ఎల్‌టీఐ మైండ్ ట్రీకి 6500 మంది ఉద్యోగులున్నారు. అమెరికా టెక్ పరిశ్రమలో పనిచేసేవారిలో.. ఈ ఐదు కంపెనీల ఉద్యోగుల వాటా దాదాపు 2శాతమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ నివేదిక పేర్కొంది. ఆ నివేదిక ప్రకారం.. 2023లో అమెరికాలో టెక్ నియామకాలు 1.2%మేర పెరిగాయి. కాంప్‌టీఐఏ అంచనాల ప్రకారం 2024లో అమెరికాలో టెక్ ఉద్యోగుల సంఖ్య 3.1% మేర పెరిగే అవకాశం ఉంది.

ఇది చట్టాన్ని ఉల్లంఘించడమే!

- ఈవీఎంలపై సహ దరఖాస్తుకు జవాబు ఎందుకివ్వలేదు?
- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సీఐసీ

ఎన్నికల సంఘంపై కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు ఈసీ బదులివ్వకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశ్వసనీయతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం.దేవసహాయంతో పాటు పలువురు ప్రముఖుల ప్రతినిధి బృందం 2022 మే 2న ఈసీని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ అంశంపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలంటూ అదే ఏడాది నవంబరు 22న దేవసహాయం సహ చట్టం కింద దరఖాస్తు చేశారు. కానీ, 30 రోజులు గడిచినా ఈసీ స్పందించకపోవడంతో సీనియర్ అధికారులకు తొలి అప్పీలు చేశారు. వారు కూడా స్పందించకపోవడంతో సీఐసీని ఆశ్రయించారు. ప్రధాన కమిషనర్ హీరాలాల్ సమారియా ప్రశ్నలకు ఈసీకి చెందిన అధికారి సంతృప్తికర సమాధానాలివ్వలేదు. సహ చట్టం దరఖాస్తుదారుకు ఈసీ సమాచార అధికారి సమాధానం ఇవ్వకపోవడంపై సమారియా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడు అడిగిన సమాచారాన్ని ఎందుకు ఇవ్వలేకపోయారనే అంశంపై లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 30 రోజుల్లోగా దరఖాస్తుదారు అడిగిన సమాచారాన్ని సమగ్రంగా అందజేయాలని ఈసీకి ఆదేశాలు జారీ చేశారు.

ఆడపిల్లనని బాధపడకండి

- మళ్లీ జన్మంటూ ఉంటే మీకే మగపిల్లాడిలా పుడతా
- స్నేహితురాలి ద్వారా తల్లిదండ్రులకు సందేశం పంపి

భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్న యువతి

జవహర్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తాను ఆడపిల్లగా పుట్టినందుకు తల్లిదండ్రులు బాధపడుతున్నారని భావించిన ఓ యువతి.. భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిందీ సంఘటన. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని కార్మికనగర్‌కు చెందిన మనోహర్, లావణ్య దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మనోహర్ కూలిపనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె చిత్రశివాని (18) ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం కాలేజ్ నుంచి బయల్దేరిన ఆమె.. ఇంటికి రాకుండా దమ్మాయిగూడ సాయినగర్ కాలనీలోని డబుల్‌బెడ్ రూం ఇళ్లపైకి వెళ్లింది. అక్కణ్నుంచీ తన స్నేహితురాలికి ఫోన్‌లో ఒక సందేశాన్ని పంపింది. తాను ఆడపిల్లగా పుట్టినందుకు తన తల్లిదండ్రులు బాధపడుతున్నారని.. అలా బాధపడవద్దని తల్లిదండ్రులకు చెప్పాలని ఆ సందేశంలో పేర్కొంది. తనకు మరో జన్మ అంటూ ఉంటే వారి కడుపునే మగపిల్లాడిగా పుడతానని చెప్పమంది. అనంతరం భవనంపై నుంచి దూకి చనిపోయింది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు ఆడపిల్ల అని పదేపదే అనడంతో మనస్తాపం చెంది ప్రాణాలు తీసుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

బిడ్డల ప్రాణం తీసి పరారైన తల్లిదండ్రుల మృతి

- నెల రోజుల తర్వాత అస్థిపంజరాలుగా లభ్యం

గార్ల (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 12 : అభంశుభం తెలియని కన్నబిడ్డలకు విషమిచ్చి చంపి పరారైన తల్లిదండ్రులు నెల రోజుల తర్వాత శవాలై కనిపించారు. ఓ గుట్టపై ఆత్మహత్య చేసుకున్న ఆ దంపతులు అస్థిపంజరాలుగా దొరికారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని అంకన్నగూడెంనకు చెందిన పెండగట్ల అనిల్, బయ్యారం మండలం నామాలపాడుకు చెందిన దేవి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. అనిల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా దేవి కూలి పనులకు వెళుతుంటుంది. ఈ దంపతులకు లాస్య (3 ఏళ్లు), జశ్విత (11 నెలలు) అనే కుమార్తెలున్నారు. కారణం తెలియదు కానీ పాలల్లో విషం కలిపి మార్చి 9న పిల్లలకు తాగించిన అనిల్ దంపతులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. ఆ ఇంటి పక్కనే నివాసముండే అనిల్ తండ్రి వెంకన్న.. మనవరాళ్లు మరణించి ఉండడాన్ని గమనించి తర్వాత రోజు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అనిల్, దేవి కోసం గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం గ్రామ సమీపంలోని నామాలపాడు గుట్ట చెట్టుకు వేలాడుతూ ఓ పురుషుడు, కింద ఓ మహిళ అస్థిపంజరం వారికి కనిపించాయి. ఆధారాల ప్రకారం ఆ అస్థిపంజరాలు అనిల్, దేవివేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. కాగా, అనిల్-దేవి మరణాలపై గ్రామంలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కొడుకు కోసం అనిల్ దంపతులు ఆశలు పెంచుకున్నారని, దేవి మూడోసారి గర్భం దాల్చినప్పుడు ఓ ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుని మళ్లీ కూతురే పుట్టబోతోందని తెలుసుకుని రహస్యంగా అబార్షన్ చేయించారని చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే దంపతులు కఠిన నిర్ణయాలు తీసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

కల్తీ కల్లుపై గిరిజన మహిళల యుద్ధం

- తెల్లకల్లు బట్టీపై దాడి.. కల్లు పారబోత
- ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఘటన

తలమడుగు, ఏప్రిల్ 12: కల్తీ కల్లుపై ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన మహిళలు యుద్ధభేరి మోగించారు. కల్తీ కల్లు వల్ల తమ కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో వారే రంగంలోకి దిగారు. తలమడుగు మండలంలోని పల్సి(బి), పల్సి(బి) తాండ, కోసాయి, ఉమ్మరి, దేగామ గ్రామాలకు చెందిన మహిళలు సంఘటితమై ఐక్యతతో.. గురువారం రాత్రి దేగామ గ్రామంలోని తెల్లకల్లు బట్టీలోకి చొచ్చుకెళ్లి మూకుమ్మడిగా దాడి చేశారు. బట్టీలో నిల్వ ఉంచిన తెల్ల కల్లు బాటిళ్లను, అలాగే ప్యాకెట్లలో ఉంచిన కల్లును బయటకు తెచ్చి రోడ్డుపై పారబోశారు. కల్తీ తెల్లకల్లుకు చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అంతా బానిసలు అవుతున్నారని, తక్కువ ధరకు దొరికే ఈ కల్లు తాగుతూ పనులకు వెళ్లకుండా ఉదయం నుంచి రాత్రి వరకు మత్తులో దొర్లుతున్నారని ఈ సందర్భంగా మహిళలు ఆవేదన వెలిబుచ్చారు. ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా కల్తీ కల్లును విక్రయిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తే వేటు

- నలుగురు సిబ్బందిపైన చర్యలు, మరో 20 మంది గుర్తింపు
- హైదరాబాద్‌లో కొరత లేదు.. కృత్రిమంగా సృష్టిస్తే సహించం
- అన్ని ప్రాంతాలకు సమృద్ధిగా ఇవ్వాల్సిందే: జల మండలి ఎండీ
- 24 గంటల్లో ట్యాంకర్ రాకుంటే టోల్ ఫ్రీకి కాల్ చేయండి
- కృత్రిమ కొరతపై 'ఆంధ్రజ్యోతి' కథనం సీఎం రేవంత్ దృష్టికి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో తాగునీటి సరఫరాలో ఆటంకాలు కల్పిస్తే సహించేది లేదని జల మండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. నగరంలో ఎలాంటి కొరత లేదని, తాగు నీటి అవసరాలకు సరిపడా నీళ్లున్నాయని స్పష్టం చేశారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించేది లేదని, ఉన్నతస్థాయి నుంచి కిందిస్థాయి వరకు ఎవరి ప్రమేయం ఉన్నప్పటికీ కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సరిపడా నిల్వలున్నా సరఫరా చేయకపోవడం, ట్యాంకులు పొంగిపొర్లుతున్నా నిర్లక్ష్యం చేయడం, కొన్ని ప్రాంతాలకు అధికంగా, మరికొన్ని ప్రాంతాలకు తక్కువగా ఇవ్వడంపై 'నీటి కుట్రలు?' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. ఇది హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. దీంతో జల మండలి ఎండీ సంబంధిత అధికారులతో సమీక్షించారు. కొన్ని ప్రాంతాలకు అధికంగా, మరికొన్నిటికి తక్కువగా సరఫరా చేస్తూ బోర్డును, ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేసేలా వ్యవహరించిన నలుగురు సిబ్బందిపై వేటు వేశారు. ఇలాంటి మరో 20 మందిని గుర్తించినట్లు తెలిసింది. వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎండీ సుదర్శన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. జలాశయాల నుంచి రోజూ 2,610 మిలియన్ లీటర్ల నీటిని తీసుకొస్తున్నామని, అన్ని ప్రాంతాలకు సమృద్ధిగా సరఫరా చేయాలని ఉద్యోగులు, సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. సరఫరాలో ఇబ్బంది తలెత్తితే ముందుగానే నివాసితులకు సమాచారమిచ్చి సమస్య పరిష్కారమవగానే ఆ లోపాన్ని భర్తీ చేయాలని సూచించామన్నారు.. 24 గంటల్లో ట్యాంకర్ సరఫరా చేసేవిధంగా వ్యవస్థను అభివృద్ధి చేశామని, ఎవరికైనా ఆ వ్యవధిలోపు సరఫరా కాకుంటే వాటర్ బోర్డు టోల్‌ఫ్రీ నంబర్ 155313కి ఫిర్యాదు చేయాలని, కస్టమర్ కేర్ సిబ్బంది నుంచి సంబంధిత మేనేజర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టు చేసినా స్పందిస్తామని చెప్పారు. నీటి కొరత అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు.

రైతులను మోసం చేసే మిల్లర్లు, ట్రేడర్ల

ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయండి

కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్టులో పెట్టండి.. ధాన్యాన్ని తక్కువ ధరకు కొంటే ఉపేక్షించే ప్రసక్తే లేదు

- నీటి సరఫరాకు ఆటంకం కలిగించే వారిపై వేటు: సీఎం రేవంత్
- ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యత ఐఏఎస్‌లకు



హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించే ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రైతులను మోసం చేసే మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసే మిల్లర్లు, ట్రేడర్ల ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ నిలిపివేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని సీఎం ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ధాన్యం కొనుగోళ్లు, తాగునీటి సరఫరాపై సీఎం సమీక్ష జరిపారు. తేమ ఎక్కువగా ఉందంటూ కొన్ని చోట్ల వ్యాపారులు, మిల్లర్లు ధాన్యం ధరకు కోత పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని.. కాబట్టి ధాన్యాన్ని మార్కెట్లకు తెచ్చే ముందు ఆరబెట్టాలని రైతులకు సీఎం విజ్ఞప్తి చేశారు. నేరుగా కల్లాల నుంచి వడ్లను మార్కెట్లకు తరలిస్తే తేమ శాతం ఎక్కువగా ఉంటుందని.. ఒకటి రెండు రోజులు ధాన్యాన్ని ఆరబెట్టి మంచి రేటు పొందాలని సీఎం సూచించారు. ధాన్యం ఆరబెట్టేందుకు మార్కెట్ యార్డుల్లోనే తగిన ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వడ్ల దొంగతనం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని జిల్లాల్లో కలెక్టర్లు తమ పరిధిలోని మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా, కనీస మద్దతు ధర అమలయ్యేలా చూడాలని.. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సంబంధిత విభాగాల అధికారులు జిల్లాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. తాగునీటి సరఫరా నివిఒత్తం ఉమ్మడి జిల్లాలకు నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ధాన్యం కొనుగోళ్లను కూడా పర్యవేక్షించాలని సీఎం పేర్కొన్నారు. వడగండ్ల వానలు వచ్చినా ఇబ్బంది లేకుండా అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎన్నికల సమయం కావడంతో కొన్ని చోట్ల రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు తప్పుడు ఫిర్యాదులు, ఉద్దేశపూర్వక కథనాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. అటువంటి వాటిపై వెంటనే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అలాగే.. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలమట్టాలు పడిపోవడంతో ప్రజలు కేవలం నల్లా నీటిపైనే ఆధారపడుతున్నారని.. కాబట్టి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు వచ్చిన చోట యుద్ధప్రాతిపదికన నీటి సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. ఏరోజుకారోజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సారథ్యంలో మిషన్ భగీరథ, మునిసిపల్, ఇరిగేషన్, విద్యుత్తు శాఖ అధికారులు తాగునీటి సరఫరాపై సమీక్ష జరపాలని సూచించారు. హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాకు ఢోకా లేకుండా చూడాలని, మరింత డిమాండ్ పెరిగినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైతే నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీ నుంచి నీటిని హైదరాబాద్‌కు తెచ్చుకోవాలని, అందుకు తగిన ఏర్పాట్లు వెంటనే చేయాలని ఆదేశించారు. ఇటు సింగూర్ నుంచి నీటి సరఫరా చేసేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. కృష్ణా బేసిన్లో నీటి లభ్యత లేనందున ఎగువన నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తాగునీటిని తెచ్చుకునేలా కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సీఎం అధికారులకు సూచించారు.

ఉద్యోగం నుంచి తీసేయండి..

హైదరాబాద్‌లో ఇటీవల సిబ్బంది అత్యుత్సాహంతో ఒకచోట తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఈ సందర్భంగా సీఎం దృష్టికి వచ్చింది. దీంతో.. ఉద్దేశపూర్వకంగా తాగునీటి సరఫరాకు ఆటంకం కలిగించిన వారిని వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. కావాలని ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అటువంటి ఉద్యోగులపై ఉదాసీనంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

గిగ్ వర్కర్ల గుర్తింపునకు

కొత్త యాప్

- ఎన్నికల కోడ్ ముగియగానే ప్రారంభానికి చర్యలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి ప్రభుత్వ స్పందన

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల గుర్తింపు కోసం ప్రత్యేకంగా ఓ అప్లికేషన్(యాప్)ను సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయా వర్కర్లు ఈ యాప్‌లో తమ వివరాలు నమోదు చేసుకుని గుర్తింపు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించింది. "గిగ్ వర్కర్లకు భద్రతేది ?" శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం ఈ మేరకు స్పందించింది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల హక్కులను పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. విధి నిర్వహణలో మరణించే కార్మికులపై ఆధారపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని సంబంధిత యాజమాన్యాలను ఆదేశిస్తున్నామని వివరణ ఇచ్చింది. అలాగే, రాజస్థాన్ తరహాలో గిగ్ కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు 8 వారాల్లో ఒక విధానాన్ని రూపొందించే బాధ్యతను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)కు అప్పగించామని వెల్లడించింది. సీజీజీ అధ్యయనం తర్వాత గిగ్ వర్కర్లపై అంతరాష్ట్ర వాటాదారులతో సంప్రదింపులు జరుపుతామని తెలిపింది. గిగ్ వర్కర్ల సంక్షేమానికి ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుని చట్టం రూపొందిస్తామని, అందుకు అవసరమైన ప్రతిపాదనలనూ సిద్ధం చేస్తున్నామని సర్కారు పేర్కొంది. సీజీజీ ప్రతిపాదనల పరిశీలనకు కార్మికశాఖ డైరెక్టర్, రంగారెడ్డి, హైదరాబాద్ జాయింట్ కమిషనర్లు, అలాగే ఆ రెండు జిల్లాల కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్లతో ఓ కమిటీ వేస్తామని చెప్పింది. గిగ్ వర్కర్ల ప్రమాద మరణ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రారంభించారని గుర్తు చేసింది. గిగ్ వర్కర్ల యూనియన్లతో సమావేశమై కార్మికుల వివరాలు సమర్పించాలని కోరామని ప్రభుత్వం వెల్లడించింది.

సీట్ల మార్పును

రెండ్రోజుల్లో సరిచేద్దాం!

- ఎన్డీయే పక్షాల నిర్ణయం
- చంద్రబాబు నివాసంలో భేటీ



అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పరస్పర మార్పును రెండ్రోజుల్లో కొలిక్కి తేవాలని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు నిర్ణయించాయి. పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థుల స్థానాల్లో సమన్వయ లోపాన్ని సరిచేయాలని నిశ్చయించాయి. ఎన్నికల ప్రచార శైలి, భవిష్యత్ కార్యాచరణ, అధికార పక్షం కుట్రలు ఎదుర్కోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానించాయి. 25 లోక్‌సభ, 160 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యం కావాలని పేర్కొన్నాయి. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి అరుణ్ సింగ్, సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ రెండు గంటల పాటు చర్చించారు. పలు చోట్ల సీట్లు మార్చాలని బీజేపీ నేతలు ప్రస్తావించగా.. మారుస్తూ పోతే గందరగోళానికి దారి తీస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే అనపర్తి స్థానాన్ని తీసుకుని బీజేపీకి తంబళ్లపల్లె ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఉంగుటూరు ఇవ్వాలని ఆ పార్టీ కోరగా.. ఆ సీటు జనసేనకు ఇచ్చామని.. అభ్యర్థిప్రచారంలో ఉన్నారని బాబు బదులిచ్చారు. ఇప్పటికే పవన్ ఒక ఎంపీ, మూడు అసెంబ్లీ స్థానాలు త్యాగం చేశారని.. జనసేన సీట్ల విషయంలో మార్పులు వద్దని బాబు అన్నారు. ఉండి సీటు తమకివ్వాలని బీజేపీ నేతలు అడిగారు. అక్కడి తమ సిటింగ్ ఎమ్మెల్యే రామరాజును మార్చే ఉద్దేశం లేనప్పటికీ.. నరసాపురం లోక్‌సభ స్థానాన్ని రఘురామకృష్ణంరాజుకు మీరు ఇవ్వనందున అలా సర్దుబాటు చేయాలన్న ఆలోచన వచ్చిందని బాబు వివరించారు. ఇంకో పార్టీ అభ్యర్థికి ఇవ్వలేమని స్పష్టం చేశారు. నరసాపురం పార్లమెంటు సీటు రఘురామరాజుకు కేటాయిస్తే.. ఇప్పటికే మీరక్కడ ప్రకటించిన అభ్యర్థి శ్రీనివాస వర్మ కోసం ఉండి స్థానం కేటాయించడం సమ్మతమేనన్నారు. ప్రకటించిన అభ్యర్థిని మార్చాలంటే తమ పార్టీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకోవాలని ఆమె చెప్పారు. రెండ్రోజుల్లో ఈ విషయమై స్పష్టత ఇస్తే అనపర్తి వెనక్కి తీసుకుని ఉండి స్థానం ఇచ్చేందుకు సిద్ధమని బాబు స్పష్టం చేశారు. అలా సాధ్యం కాకపోతే ఉండిలో రఘురామను నిలిపి అనపర్తికి ప్రత్యామ్నాయంగా బీజేపీకి తంబళ్లపల్లె కేటాయిస్తామని చెప్పారు. ఢిల్లీ పెద్దలతో మాట్లాడి రెండ్రోజుల్లో సీట్ల సర్దుబాటును కొలిక్కి తెచ్చేద్దామని బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.

లోకేశ్ ఫోన్ ట్యాపింగ్!

- ఐ-ఫోన్ వ్యవస్థ హెచ్చరిక
- ఇంకొందరు టీడీపీ నేతల ఫోన్లపైనా నిఘా
- దీనివల్లే హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు
- కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు అక్కడా ట్యాపింగ్‌కు పాల్పడిన జగన్ సర్కారు!
- టీడీపీ నేతల ఆగ్రహం



అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ మొబైల్ ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతోంది. ఐ-ఫోన్ సాంకేతిక వ్యవస్థ ఈ మేరకు ఆయనకు వర్తమానం పంపింది. ఆయన చాలాకాలంగా ఐ-ఫోన్ వాడుతున్నారు. మిగిలిన ఫోన్లతో పోలిస్తే ఆపిల్ కంపెనీ తయారు చేస్తున్న ఐ-ఫోన్లు భద్రతాపరంగా మెరుగ్గా ఉంటాయన్న అభిప్రాయంతో ఇటీవలి కాలంలో ప్రతిపక్ష నేతలు వాటినే వాడుతున్నారు. ఫోన్ల భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు సంబంధిత ఫోన్ వినియోగదారుకు ఆ సమాచారాన్ని పంపే సాంకేతిక వ్యవస్థను ఆపిల్ కంపెనీ వాడుతోంది. దాని నుంచే లోకేశ్‌కు గురువారం రాత్రి అత్యవసర హెచ్చరిక పంపింది. అదే హెచ్చరికను ఈ-మెయిల్ ద్వారా కూడా పంపింది. 'గుర్తు తెలియని సాఫ్ట్‌వేర్లతో మీ ఫోన్‌ను హాకింగ్, ట్యాపింగ్ చేయడానికి ప్రయత్నం జరుగుతోంది. అప్రమత్తంగా ఉండండి. ట్యాపింగ్, హాకింగ్‌కు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోండి' అని అందులో పేర్కొంది. ఈ సందేశం వచ్చిన వెంటనే లోకేశ్ సంబంధిత సాంకేతిక నిపుణులను సంప్రదించి వారి సూచనలను పాటిస్తున్నారు. గత నెలలో కూడా ఆయనకు ఇదే మాదిరి హెచ్చరిక సందేశం వచ్చింది. ఒక నెలలోనే రెండోసారి మళ్లీ అదే ప్రయత్నం జరగడం విశేషం. జగన్ ప్రభుత్వమే ఆయన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని టీడీపీ వర్గాలు ఆరోపించాయి. 'ఆపిల్ కంపెనీ తయారు చేసే ఐ-ఫోన్లను సాధారణ సాఫ్ట్‌వేర్లతో ట్యాపింగ్ చేయడం సాధ్యం కాదు. ఇజ్రాయెల్‌కు చెందిన కంపెనీలు తయారు చేస్తున్న పెగాసెస్ వంటి అత్యున్నత స్థాయి సాఫ్ట్‌వేర్లతో మాత్రమే వాటి ట్యాపింగ్ సాధ్యపడుతుంది. పెగాసెస్ సాఫ్ట్‌వేర్‌ను వైసీపీ ప్రభుత్వం ఇజ్రాయెల్ నుంచి కొనుగోలు చేసి వాడుతోందని మేం అనుమానిస్తున్నాం' అని టీడీపీ ముఖ్యుడొకరు తెలిపారు. ఒక్క లోకేశ్ ఫోనే కాకుండా మరికొందరు టీడీపీ నేతల ఫోన్లను కూడా దొంగచాటుగా వినే ప్రయత్నం జరుగుతోందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ సందేహం చాలా కాలం నుంచి ఉండడంతో కొంతకాలంగా టీడీపీ తన కార్యకలాపాలన్నీ హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తోంది. అక్కడ కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో జగన్ సర్కారు అక్కడ కూడా ట్యాపింగ్ చేయగలిగిందని.. ఇప్పుడు తెలంగాణలో ప్రభుత్వం మారాక ఆ అవకాశం పోయిందని టీడీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే ముఖ్యమైన రాజకీయ కార్యకలాపాలన్నీ ఆ పార్టీ హైదరాబాద్ కేంద్రంగానే నిర్వహిస్తోంది. కాగా, గుర్తు తెలియని ఏజెన్సీల ద్వారా పెగాసెస్ సాఫ్ట్‌వేర్ సాయంతో లోకేశ్ ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు ఐ- ఫోన్ సందేశాలు వచ్చాయని మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. 'రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, నిఘా చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఈసీ దృష్టికి అనేక మార్లు తెచ్చాం. వారి స్థానాల్లో తటస్థంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించి, స్వేచ్ఛాయుత ఎన్నికలకు అవకాశం కల్పించాలి' అని కోరారు.

వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్

హైదరాబాద్/రాంనగర్(హనుమకొండ), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్‌కుమార్‌ను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. వరంగల్ అభ్యర్థిని నిర్ణయించేందుకు ఆ జిల్లా పార్టీ నేతలతో శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్ భేటీ అయ్యారు. ఇటీవల పార్టీకి రాజీనామా చేసిన మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్యను సైతం ఈ భేటీలో పాల్గొనాల్సిందిగా కేసీఆర్ ఆహ్వానించారు. వరంగల్ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం శ్రీహరి కుమార్తె కావ్యను ప్రకటించినప్పటికీ.. ఆమె కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో తాజాగా మరో అభ్యర్థిని ప్రకటించాల్సివచ్చింది. దీంతో వరంగల్‌కు చెందిన ముఖ్యనేతలతో చర్చించి.. అందరి అభిప్రాయాలు తీసుకున్న అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపల్లి సుధీర్‌కుమార్‌ను కేసీఆర్ ప్రకటించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌కు చెందిన సుధీర్ కుమార్.. ప్రస్తుతం హనుకొండ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సుధీర్ కుమార్.. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు ప్రధాన అనుచరుడు. ఈ సందర్భంగా ఎంపీగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు, సహకరించిన పార్టీ జిల్లా నేతలకు సుధీర్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురూ 'గులాబీ' తోటలోనివారే..!

వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో ఉన్న ముగ్గురు అభ్యర్థులూ బీఆర్ఎస్‌కు చెందిన వారే కావడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీఆర్ఎస్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేశ్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం దక్కించుకున్నారు. కాంగ్రెస్ గుర్తుతో పోటీ చేస్తున్న కడియం కావ్య కూడా బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కావడం విశేషం. ఆమెకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చినప్పటికీ.. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆమె విముఖత వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరి వరంగల్ స్థానంలో ఆ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. బీఆర్ఎస్ అధిష్ఠానం తాజాగా మారపల్లి సుధీర్‌కుమార్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది.

అమెరికాకు వైఎస్ విజయలక్ష్మి!

- అన్నా చెల్లెళ్ల యుద్ధంతో సంకటం
- తన తరఫున ప్రచారం చేయాలన్న జగన్
- దానివల్ల షర్మిలకు నష్టమని తల్లి భావన



అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వైఎస్ విజయలక్ష్మి అమెరికా వెళ్లిపోయారు. మనసు కూతురు షర్మిల వైపే లాగుతున్నా.. కుమారుడు జగన్ ఒత్తిడి భరించలేక.. ఎటు ఉండాలో తేల్చుకోలేక విదేశాలకు వెళ్లిపోయినట్టు సమాచారం. ఎన్నికలు ముగిసిన తర్వాతే ఆమె తిరిగి స్వదేశం చేరుకుంటారని తెలుస్తోంది. ఏపీ సీఎం జగన్‌కు.. ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు మధ్య 'పొలిటికల్ వార్' జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇది తల్లి విజయలక్ష్మికి సంకటంగా మారింది. జగన్ సీఎం అయ్యేందుకు తల్లీకూతుళ్లిద్దరూ కష్టపడ్డారు. అధికారంలోకి రాగానే జగన్.. ఆ ఇద్దరినీ పక్కనపెట్టారనే విమర్శలు వచ్చాయి. సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారానికి హాజరైన విజయలక్ష్మి.. ఆ తర్వాత అడపాదడపా మాత్రమే ఆయనతో కనిపించారు. గౌరవాధ్యక్ష పదవి నుంచి 'తప్పుకునేలా' పార్టీ ప్లీనరీలోనే ఆమె చేత ప్రకటన చేయించారు. అన్నతో విభేదించి షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టినప్పుడు.. విజయలక్ష్మి ఆమెతోనే ఉన్నారు. అప్పుడు హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఆ తర్వాత 'వైఎస్సార్ జీవన సాఫల్య' పురస్కారాల సమయంలో మాత్రమే ఏపీలో ఆమె వేదికపై కనిపిస్తున్నారు. షర్మిల ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి.. జగన్‌పై యుద్ధం ప్రకటించగానే విజయలక్ష్మికి ఇక్కట్లు మొదలయ్యాయి. తల్లి మద్దతు తనకే ఉందనిపించుకునేందు జగన్ రకరకాలుగా ప్రయత్నించారు. కడప జిల్లాలో షర్మిలకు లభిస్తున్న మద్దతు, వివేకా హత్య ఉదంతం.. వీటన్నింటి నేపథ్యంలో జగన్ తరఫున ప్రచారం చేయడం సరికాదని, ఇది కూతురికి నష్టం చేస్తుందని విజయలక్ష్మి భావించినట్లు చెబుతున్నారు. ఈ సంకటం నుంచి బయటపడలేకే ఆమె అమెరికాలో బంధువుల వద్దకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఫన్ మెసేజింగ్‌కు టిప్స్

మెసేజింగ్‌లో కొత్త పుంతలు తొక్కే వాట్సాప్ తాజాగా ప్రాక్టికల్ టిప్స్ అందించింది. వాట్సాప్‌నకు సంబంధించిన రిచ్ ఫీచర్లను చాలా సులువుగా అందిపుచ్చుకోవడం నుంచి డిసప్పియరింగ్ మెసేజెస్, చాట్ వాల్‌పేపర్స్ కస్టమైజేషన్ వరకు వివిధ పనులకు ఈ టిప్స్ ఉపయోగపడనున్నాయి. అవేంటంటే...

- డిజెపియరింగ్ మెసేజెస్ మొదటిది. 24 గంటలు అంటే ఒక రోజు నుంచి వారం, 90 దినాల వరకు పంపిన మెసేజ్‌లు వాటంతట అవే అదృశ్యమయ్యేలా చూడటం సెండర్ చేతిలోనే ఉంటుంది. అయితే రిసీవర్ మెసేజ్ చూసినప్పటి నుంచి గడువు కౌంట్‌లోకి వస్తుంది.
- వన్ టు వన్ కాల్స్‌లో 32 మంది వరకు పాల్గొనవచ్చు. ఆడియో, వీడియో కాల్స్ మధ్య పెద్దగా కష్టపడకుండానే టోగెల్ చేసే అవకాశం యూజర్‌కు ఉంది. అందుకు డిఫాల్ట్‌గా కెమెరాకు తోడు దానికి స్విచ్ అయ్యే ఆప్షన్ అవతలివైపు వ్యక్తికి ఉండాలి.
- పర్సనలైజ్ చాట్ వాల్‌పేపర్ మరొకటి. విజువల్ అప్పీల్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. వీటికి తోడు వాట్సాప్ టెంప్లేట్స్, పర్సనల్ ఇమేజ్‌లను ఎంచుకునే వీలు ఉంటుంది. డిమ్మింగ్‌తో రీడబిలిటీని పెంచుకునే వీలు డార్క్‌మోడ్ యూజర్లకు ఉంటుంది.
- ప్రైవసీ సెట్టింగ్స్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ స్టేటస్, ప్రొఫైల్ ఇన్ఫర్మేషన్, విజిబిలిటీ, రీడ్ రిసీట్స్, గ్రూప్ ఇన్వైట్స్ తదితరాల విషయంలో ప్రైవసీ కంట్రోల్ విషయంలో కస్టమైజింగ్ సెట్టింగ్స్ చేసుకోవచ్చు. సెట్టింగ్స్ మెనూతో ఈ కంట్రోల్స్‌ను పొందవచ్చు.
- డేటా వినియోగం, మానిటరింగ్‌లోనూ యూజర్ సమర్థంగా పనిచేసుకోవచ్చు. స్టోరేజ్ మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ యూసేజ్ వీక్షణ, అడ్జస్ట్ మీడియా, ఆటో డౌన్‌లోడ్ సెట్టింగ్స్, మీడియా అప్‌లోడ్ క్వాలిటీ పెంపు, పారదర్శకతకు అవకాశం ఉంటుంది.





పేమెంట్‌తోనే విండోస్ 10 అప్డేట్స్!

మైక్రోసాఫ్ట్ - విండోస్ 10 యూజర్లకు 2025 అక్టోబర్ 14 నుంచి సపోర్టు ఉండదు. అయితే ఇంకా అదే ఆపరేటింగ్ సిస్టమ్ కావాలనుకునే వారికి ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ ఆప్డేట్స్(ఈఎస్‌యూ) ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ కింద మొదటి ఏడాది 61 డాలర్లు చెల్లించాలి. రెండో ఏడాది రెట్టింపు అంటే 122 డాలర్లు, మూడో ఏడాదికి 244 డాలర్లు చెల్లించాలి. వ్యక్తులకైనా, బిజినెస్ సముదాయాలకైనా ఇదే ఫీజు వర్తిస్తుంది. నిర్దేశిత తేదీ తరవాత విండోస్ 10 డివైజ్‌కు ఈఎస్‌యూ లైసెన్స్ తప్పనిసరి. మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ఆధారిత అప్డేట్ సొల్యూషన్స్ అంటే ఇన్‌ట్యూన్ లేదా విండోస్ ఆటోప్యాచ్‌కు మాత్రం అయిదు డివైజ్‌ల వరకు 25 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. విండోస్ 365 ద్వారా విండోస్ 11 క్లౌడ్ పీసీలకు కనెక్ట్ అయితే లైసెన్స్ ఫీజు ఉండదు. అది 365 చందాలోనే కలగలుస్తుంది. దీంతో ముఖ్యంగా స్కూల్స్ ప్రయోజనం పొందనున్నాయి. వాటికి మొదటి ఏడాది ఒక డాలరు, రెండో ఏడాది రెండు డాలర్లు, మూడో ఏడాది నాలుగు డాలర్లుగా ఫీజు ఉంటుంది. ఈఎస్‌యూ అనేది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. అయితే విండోస్ 11కు మారేందుకు యూజర్లు హార్డ్‌వేర్‌పరంగా కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అందుకు అనుగుణంగానే ఈ తాత్కాలిక పరిష్కారాన్ని మైక్రోసాఫ్ట్ అమలు చేయనుంది.



అకౌంట్స్ నిషేధంలో కొత్త రికార్డు

వాట్సాప్ - ఇండియాకు చెందిన అకౌంట్ల నిషేధంలో కొత్త రికార్డు నెలకొల్పింది. స్పామ్ మెసేజ్‌లు, ఫేక్ న్యూస్‌ని అందించేవి పెరుగుతున్నాయని ఈ పరిణామం చెబుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అసలీ ధోరణి ఆందోళనకరమని కూడా అంటున్నారు. ఒక్క ఫిబ్రవరి నెలలోనే ఇండియాలో 7.6 మిలియన్ల అకౌంట్లను వాట్సాప్ నిషేధించింది. ఐటీ రూల్స్ 2021ని అతిక్రమించినందున ఈ చర్య చేపట్టాల్సి వచ్చిందని, తొలగించిన వాటిలో ఎక్కువగా స్పామ్ మెసేజ్‌లు, ఫేక్ న్యూస్‌ని అందించేవే ఉన్నాయని వివరించింది. తొలగించిన వాటిలో 14,24,000 క్రియాశీలంగా ఉన్న అకౌంట్లు కావడం గమనార్హం. ప్రతి నెల విడుదల చేసే నివేదికలో భాగంగా ఈ విషయాలను వాట్సాప్ పొందుపరిచింది.

ఇదిలా ఉండగా చాట్ సంభాషణలను వాట్సాప్ ఆరంభిస్తున్నట్టు డబ్ల్యుఏబేటాఇన్ఫో వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్ బేటా టెస్టర్లకు అందుబాటులో ఉందని కూడా తెలిపింది.





ఒప్పోలో 'ఏఐ ఎరేజర్'

ఒప్పో ప్రత్యేకించి ఏఐ ఎరేజర్‌ని విడుదల చేసింది. ఇదో ఫొటో ఎడిటింగ్ టూల్. ఫొటో అనవసరమైన మెటీరియల్‌ను తొలగించడమే కాకుండా నేపథ్యాన్ని సహజంగా మలుచుకునేందుకు ఉపయోగపడుతుంది. ఒప్పో విడుదల చేసిన మొట్టమొదటి ఏఐ టూల్ ఇది. వన్‌ప్లస్ మేజిక్ ఎరేజర్ మాదిరిగానే ఇది పనిచేస్తుంది. ఒప్పో రెనో 11 సిరీస్ స్మార్ట్ ఫోన్లకు దీన్ని త్వరలో విడుదల చేయనుంది. అలాగే ఒప్పో స్మార్ట్‌ఫోన్లలో అర్హమైన వాటికీ ఎరేజర్‌ను అందుబాటులోకి తేనుంది. ఈ ఫొటో ఎడిటింగ్ టూల్‌కి జనరేటివ్ ఏఐ టెక్నాలజీ సపోర్ట్ ఉంటుంది. ఇదే అనవసరమైన మెటీరియల్ తొలగింపులో సహాయపడుతుంది. కలర్ ఓఎస్ 14తో రన్ అయ్యే ఒప్పో స్మార్ట్‌ఫోన్లలో ఇది ఉంటుంది. ఇటీవల మార్కెట్లోకి తెచ్చిన వన్‌ప్లస్ 12, వన్‌ప్లస్ 11ఆర్‌లలో ఈ టూల్ ఉంది. ఫొటో యాప్‌తో టూల్‌ని యాక్సెస్ చేసుకోవచ్చు. దీన్ని ఉపయోగించుకునేందుకు మాత్రం యాక్టివ్ ఇంటర్నెట్ కనెక్షన్ అవసరం. సరిగ్గా ఇలాంటి టూల్ గెలాక్సీ ఎస్23/24, గెలాక్సీ ఏఐ ఫీచర్స్ కలిగిన వన్‌యూఐ 6.1 లోనూ ఉంది.



బీబీకే ఎలక్ట్రానిక్స్ ఫోన్‌లకు ఫింగర్‌ప్రింట్ సెన్సర్స్



బీబీకే ఎలక్ట్రానిక్స్ గొడుగు కింద ఉన్న వన్‌ప్లస్, ఒప్పో, రియల్‌మి స్మార్ట్‌ఫోన్లకు బయోమెట్రిక్ అథెంటికేషన్ స్థానే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్లను రానున్నాయి. సదరు కంపెనీల నుంచి మున్ముందు వచ్చే ఫోన్లలో ఈ మార్పు ఉంటుంది. 'వైబో'లో పోస్టు పెట్టిన టిప్‌స్టర్ దీనికి డిజిటల్ చాట్ స్టేషన్ అని పేరు పెట్టారు. ఈ సెన్సర్లు ప్రత్యేకించి అల్ట్రాసోనిక్ సౌండ్ వేవ్స్‌ను ఉపయోగించుకుంటాయి. దాంతో చాలా వివరంగా 3డి మ్యాప్ సాధ్యమవుతుంది. ఈ పద్ధతిలో మోసగించడానికి ఆస్కారం తక్కువ. వాటర్ రెసిస్టెన్స్‌కు వీలుకల్పిస్తుంది. అలాగే ఆప్టికల్ ప్రత్యామ్నాయాలతో పోల్చుకుంటే ఈ సెన్సర్ల ఉత్పత్తి ఖరీదైన వ్యవహారం కూడా. శాంసంగ్ గెలాక్సీ ఎస్23, ఐకూ 12 ప్రొ, మెయిజు 21/22 ప్రొ ఇప్పటికే అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ సెన్సర్లను ఉపయోగిస్తున్నాయి. రాబోయే షావోమీ 15 సిరీస్‌లో స్నాప్‌డ్రాగన్ 8జన్ 4 చిప్‌సెట్ పవర్ ఉంటుందన్న పుకార్లు వినవస్తున్నాయి. గూడిక్స్ సింగిల్-పాయింట్ అల్ట్రాసోనిక్ ఫింగర్‌ప్రింట్ స్కానర్‌ని ఇన్‌కార్పొరేట్ చేసుకుంటుందని కూడా నివేదికలు చెబుతున్నాయి. మొత్తమ్మీద గుర్తించదగ్గ మార్పు చోటుచేసుకుటోందని చెప్పవచ్చు.



పర్ఫెక్ట్ ఈమెయిల్‌కు ఏఐ సహకారం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూనే ఉంది. ఫలితంగా యూజర్లకు అదనంగా ప్రయోజనాలూ సమకూరుతున్నాయి. ముఖ్యంగా గూగుల్‌కు చెందిన 'జెమిని ఏఐ' ఇప్పుడు జీమెయిల్‌లో పర్సనల్ ఈమెయిల్ సెక్రటరీ అవతారం ఎత్తింది. దీన్ని పర్సనల్ ఈమెయిల్ సెక్రటరీగా ఎలా మలుచుకోవచ్చో చూద్దాం.

- వర్క్‌స్పేస్ ఇంటిగ్రేషన్ అందులో మొదటిది. జీమెయిల్ ఇన్‌బాక్స్ నిండిందంటే అది ఉత్పాదకతను చంపుతోందని అర్థం. అయితే జెమినీ ఈ విషయంలో సహాయపడుతుంది. లాస్ట్ మెయిల్‌ని సమ్మరైజ్ చేయమని అని అడిగితే చాలు, దానికి సంబంధించి షార్ట్ వెర్షన్‌ను సమ్మరీ రూపంలో తెలియజేస్తుంది. అదే విధంగా పొందికగా సమాధానం కూడా రూపొందిస్తుంది. ఆఫీస్ బాస్ కాదంటే మరొకరు పంపినవి అందులో ఏమైనా ఉన్నాయా అంటే అవి కూడా షార్ట్‌లిస్ట్ చేస్తుంది. అలా ముఖ్యమైన మెయిల్స్‌ను చాలా తేలికగా గుర్తించవచ్చు. చదవని లేటెస్ట్ మెయిల్ ఏదని కూడా యూజర్ అడిగి తెలుసుకోవచ్చు.
- కొన్ని ఆహ్వానాలను మన్నించలేకపోవచ్చు. అయితే మర్యాదగా తప్పించుకోవడం ఉత్తమ మార్గం. ఆ విషయంలో అందమైన మెసేజ్‌ను జెమినీ ఏఐ సహకారంతో రూపొందించుకోవచ్చు. వాటికి చిరాకుపడాల్సిన పని కూడా ఉండదు.
- ప్రమోషనల్ ఈమెయిల్స్ డ్రాఫ్టింగ్‌లో జెమినీకి చెందిన నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ సహకరిస్తుంది.
- ఈమెయిల్ న్యూస్ లెటర్స్‌తో సభ్యులను ఎంగేజ్ చేయడం నిజంగా పెద్ద తలనొప్పి వ్యవహారం. ప్రొడక్ట్ లేదా సర్వీస్‌పై బోరు కొట్టకుండా మేటర్ రాయడంలోనూ తోడ్పడుతుంది. గత నెల సాధించిన విజయాలు, ప్రొడక్ట్‌తో ఒనగూరే ప్రయోజనాలను పొందపరుస్తూ న్యూస్ లెటర్ డ్రాఫ్టింగ్ పనిని పూర్తి చేసుకోవచ్చు.

మాస్టరింగ్

జెమిని సహకారంతో పర్ఫెక్ట్ ఈమెయిల్స్‌తో పబ్బం గడుపుకోవడం ఒక ఎత్తు. సరిగ్గా అదే ఉపయోగించి అత్యున్నత స్థాయిలో పని పూర్తయ్యేలా చూసుకోవడం మరొక ఎత్తు. అందులో భాగంగా...

- ఇంటర్వ్యూ కాదంటే మరొక విషయమై అడిగినప్పుడు జెమిని ఏఐ తనదైన స్టయిల్లో సమాధానం ఇస్తుంది. ఆ సమాధానం సంతృప్తి కలిగించకుంటే 'రీజనరేట్'పై క్లిక్ చేస్తే ముందు ఇచ్చిన దానికి ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.
- ప్లేస్‌హోల్డర్స్‌తో ఈమెయిల్‌ని కస్టమైజేషన్ చేసుకోవచ్చు. రొటీన్ రిప్లయ్‌లో మనకు కావాల్సిన సమాచారాన్ని కూడా జొప్పించి డ్రాఫ్ట్‌ని అందంగా రూపొందిస్తుంది.
- బాస్‌కు ఇవ్వబోయే సమాధానం బాగోకుంటే, మరింత జవాబుదారీతనం, పొలైట్‌గా రూపొందించు అని అడిగితే మారుస్తుంది. రైట్ టోన్‌లో సమాధానాన్ని తయారుచేస్తుంది.
- కాల్ - టు - యాక్షన్ మరొకటి. మంచి జీమెయిల్ లక్షణం ఇది. అంటే మన జీమెయిల్‌కు సమాధానాన్ని రాబట్టగలగడం అని చెప్పుకోవచ్చు. ఇది కూడా సాధ్యమే.
- సబ్జెక్టులో బలం లేదంటే ఆకట్టుకునే విధంగా ఉంటేనే రిసీవర్ ఓపెన్ చేస్తాడన్నది తెలిసిన సత్యం. అందుకు ఈమెయిల్ కోసం పది సబ్జెక్టు లైన్లు ఇవ్వమని అడగొచ్చు. 50 కేరక్టర్లకు మించకూడదని కూడా చెప్పవచ్చు. అలా జెమినీ ఏఐతో జీమెయిల్‌ని సమర్థంగా ఉపయోగించుకుని ప్రయోజనం పొందవచ్చు.

ఆసస్ ల్యాప్‌టాప్ జెన్‌బుక్ డ్యుయో

ఆసస్ - డ్యూయల్ టచ్ స్క్రీన్ ల్యాప్‌టాప్ 'జెన్‌బుక్ డ్యుయో (యుఎక్స్8406)'ని ఈ నెల 16న ఇండియన్ మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ప్రీ బుకింగ్స్‌ను కూడా మొదలుపెట్టింది. ఫిబ్రవరిలో జరిగిన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో దీన్ని మొదట ప్రదర్శించింది. ఈ ల్యాప్‌టాప్‌లో ఇంటెల్ కోర్ 9 ప్రాసెసర్ ఉంది. 75 వాట్స్ బ్యాటరీ బ్యాకింగ్ ఉంది. డ్యూయల్ 14- ఇంచీల ఫుల్, హెచ్‌డి, ఓలెడ్ డిస్‌ప్లే, డిటాచబుల్ కీబోర్డ్, బిల్ట్ ఇన్ మెటల్ కిక్ స్టాండ్ ఉన్నాయి. 16జీబీ ర్యామ్, ఒక టీబీ మేరకు స్టోరేజీతో వస్తోంది. సింగిల్ చార్జింగ్‌తో 13 గంటలు పనిచేసుకోవచ్చు. 49 నిమిషాల సేపు చార్జింగ్‌తో 60 శాతం బ్యాటరీ ఫుల్ అవుతుంది. వైఫైకి తోడు బ్లూటూత్ కనెక్టివిటీ, 1080పి వెబ్ కెమెరా కూడా ఉన్నాయి. దీని ధర ఇంకా ప్రకటించ లేదు. అయితే ఆరంభ ధర రూ.1,59,990 ఉండొచ్చని అంటున్నారు.



ఇన్‌స్టాలో ఆడియో స్టోరీస్ డౌన్‌లోడింగ్ ఆప్షన్

ఇన్‌స్టాగ్రామ్‌లో స్టోరీలను ఆడియోతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాపీరైట్ కారణంగా ఆడియోను కలపడం కొద్దిగా క్లిష్టమైన వ్యవహారమే. అయినప్పటికీ అలా డౌన్‌లోడ్ చేసుకునేందుకు మార్గం ఉంది. అదెలాగంటే...

- డివైజ్‌లో ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ని ఓపెన్ చేయాలి.
- ప్రొఫైల్ టాప్‌లో స్టోరీలు కనిపిస్తాయి. అక్కడ సొంత స్టోరీని టాప్ చేయాలి. తదుపరి మూడు చుక్కల మెనూని టాప్ చేయాలి.
- మెనూ ఆప్షన్స్ నుంచి 'సేవ్ వీడియో'ని ఎంచుకోవాలి. అప్పుడు ఒక ప్రాంప్ట్ కనిపిస్తుంది. ఆడియో లేకుండా స్టోరీ డౌన్‌లోడ్ అయిందని తెలుపుతుంది.
- ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లోని మెసేజెస్ సెక్షన్‌లోకి వెళ్లాలి. ఎవరైనా యూజర్‌తో కాన్వర్సేషన్‌ను ఓపెన్ చేయాలి.
- చాట్ పరిధిలోనే కెమెరా ఐకాన్‌పై టాప్ చేయాలి. అలా ఫొటో లేదా వీడియోను పంపేందుకు ప్రక్రియను ఆరంభించాలి.
- డివైజ్ గ్యాలరీ నుంచి సేవ్ చేసిన వీడియోను ఎంచుకోవాలి.
- స్టిక్కర్ ఐకాన్‌పై టాప్ చేయాలి. అక్కడ మ్యూజిక్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- వీడియోకు అవసరమైన ట్రాక్‌ను సెర్చ్ చేసుకోవాలి. అది లభించగానే నిడివికి తోడు కట్ చేయాలని భావిస్తున్న భాగాన్ని ఎంచుకోవాలి. ఆపై 'డన్'ని టాప్ చేస్తే సరిపోతుంది.
- స్క్రీన్ లెఫ్ట్ కార్నర్‌లో 'కీప్ ఇన్ చాట్' ఆప్షన్‌ని టిక్ చేయాలి. అలా రిప్లే, వాయిస్ వన్ ఆప్షన్లను కూడా ఎంచుకోవాలి.
- సెండ్ బటన్‌ను టాప్ చేసి ఎవరికైనా పంపుకోవచ్చు.
- వీడియోను పంపిన తరవాత దాన్ని టాప్‌తో హోల్డ్ చేస్తే ఇతర ఆప్షన్స్ అక్కడ కనిపిస్తాయి. అందులో నుంచి సేవ్‌ని సెలక్ట్ చేసుకుంటే సరిపోతుంది. అక్కడితో సరి, విజయవంతంగా ఆడియోతో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ అయినట్టు లెక్క.



డిజి యాత్ర కొత్త యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి



డిజి యాత్ర ఫౌండేషన్ తమ యాప్‌లో మేజర్ మార్పులు చేసింది. అందువల్ల విమానాశ్రయాల్లో దీన్ని ఉపయోగించేవారు, పాత యాప్ తొలగించి కొత్తది డౌన్‌లోడ్ చేసుకోవాలి. వాస్తవానికి దీని విషయంలో కొంతకాలంగా గందరగోళం చోటుచేసుకుంది. ఆ నేపథ్యంలో కొత్తగా రూపొందిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నిర్వాహకులు సూచిస్తున్నారు.

ఇందులో భాగంగా మొదట పాత డిజి యాత్ర యాప్‌ను తొలగించాలి. తదుపరి గూగుల్ ప్లే స్టోర్ లేదంటే యాపిల్ ప్లే స్టోర్ నుంచి డిజి యాత్ర యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై 'న్యూ' అని ఉంటుంది. తరవాత అకౌంట్‌ని రీక్రియేట్ చేసుకోవాలి. క్రెడెన్షియల్స్‌ని సేవ్ లొకేషన్‌లో సేవ్ చేసుకోవాలి.

కొత్తదాంట్లో ట్రావెల్ వివరాలను స్టోర్ చేసుకోవచ్చు. అలాగే యాప్ పరిధిలోనే డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అసలీ మార్పు వెనుక కారణాలను యాప్ నిర్వాహకులు వెల్లడించలేదు. డొమైన్ మార్చినట్టు మాత్రం చెబుతున్నారు. కొత్త యాప్ డెవలపర్ పేరు 'డిజి యాత్ర ఫౌండేషన్' అని ఉంటుంది. ఫిషింగ్ అటాక్స్‌కు గురికాకుండా ఉండేందుకు పేరును జాగ్రత్తగా పరిశీలించుకుని మరీ కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం మంచిది.

ఫిషింగ్ మెసేజెస్‌పై గూగుల్ వార్నింగ్!

గూగుల్ - ఫిషింగ్ స్కామ్స్, తెలియకుండా డివైజ్‌ల్లో ఇన్‌స్టాల్ అయ్యే మాల్వేర్‌ల నుంచి రక్షణకుగాను గూగుల్ మెసేజెస్ నుంచి వార్నింగ్ మెసేజ్‌లు వచ్చే ఏర్పాటుపై పని చేస్తున్నట్టు సమాచారం. లింక్‌ని క్లిక్ చేసినప్పుడు నష్టం పొంచి ఉంటే ఈ ఫీచర్ పనిచేస్తుంది. అలా జరిగినప్పుడు వార్నింగ్ మెసేజ్ అందుతుంది. అప్పుడు ఆ మెసేజ్‌పై ఉన్న బాక్స్‌పై టిక్ చేయడం ద్వారా అదనపు రక్షణ పొందవచ్చు. 'పైయూనికావెబ్' ఒక టిప్‌స్టర్ ఈ విషయాన్ని రాశాడు. 'డూ యూ ట్రస్ట్ ద సెండర్' అని వార్నింగ్ వస్తుంది. ఇదో రెండు అంచెల ప్రక్రియ కాగా సదరు లింక్‌పై క్లిక్ చేయవచ్చా కాదా అన్నది యూజర్ తెల్సుకోవచ్చు. అప్పటికీ ముందుకు వెళ్లాలని అనుకుంటే బాక్స్‌లో 'ఐ అండర్‌స్టాండ్ దిస్ లింక్ మే బి హార్మ్‌ఫుల్' అని వస్తుంది. వద్దు అనుకుంటే కేన్సిల్ బటన్‌ని టాప్ చేస్తే సరిపోతుంది. ఫీచర్ ఆర్‌సీఎస్ మోడ్‌లో ఉన్నందున స్టాండర్డ్ ఎస్ఎంఎస్ కూ పని చేస్తుంది. ఈ ఫీచర్ త్వరలోనే ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి ఉందని సమాచారం.





గూగుల్ విడ్స్ ఏఐ వీడియో యాప్!

గూగుల్ కొత్తగా విడ్స్ పేరిట ఏఐ పవర్డ్ వీడియో క్రియేషన్ యాప్‌ని పరిచయం చేస్తోంది. వర్క్‌స్పేస్‌లో భాగంగా దీన్ని కలపనుంది. ఈజీ ఎడిటింగ్ టూల్స్, మల్టిపుల్ స్టాక్ వీడియోలు, ఇమేజ్‌ల సమాహారం ఇది. వీడియో, రైటింగ్, ప్రొడక్షన్, ఎడిటింగ్ అసిస్టెంట్‌గా విడ్స్ ఉపయోగపడుతుంది. గూగుల్ డాక్స్, షీట్స్, స్లయిడ్స్ పక్కన ఇది ఉంటుంది. స్టోరీ టెల్లింగ్ మీడియమ్‌గా పనిచేస్తుంది. సేల్స్‌పర్సన్, హెచ్‌ఆర్ ఆన్‌బోర్డింగ్ వీడియోస్, ట్రెయినింగ్ వీడియోస్ సహా పలు ప్రయోజనాలకు అవసరమయ్యే వీడియోలను రూపొందించుకోవచ్చు. ఈజీ టు యూజ్ ఇంటర్‌ఫేస్, కొలాబిరేటివ్ ఫీచర్స్, వీడియో షేరింగ్ ఆప్షన్స్ కూడా ఇందులో ఉంటాయి.

- **దీని కోసం మొదట టెక్స్ట్ ప్రాంప్ట్ రాసుకోవాలి. ఐడియా సహా లక్ష్యం, ఆడియెన్స్, లెంథ్ వంటి వివరాలు అందులో ఉండాలి.**
- **@ ఉపయోగించి ప్రాంప్ట్‌తో సంబంధిత డాక్యుమెంట్‌ని అటాచ్ చేయాలి. గూగుల్ డ్రైవ్ నుంచి ఫైల్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.**
- **గూగుల్ విడ్ దానంతట అదే స్టయిల్‌బోర్డ్‌ని జనరేట్ చేస్తుంది. యూజర్ తన ప్రాధాన్యాలకు అనుగుణంగా ఎడిట్ లేదా రీఅరేంజ్‌మెంట్స్ అప్పుడు చేసుకోవచ్చు.**
- **తదుపరి నెక్స్ట్ పేజీకి డైరెక్ట్ అవుతారు. అక్కడ వీడియో స్టయిల్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.**
- **మొదట రూపొందించిన డ్రాఫ్ట్‌కు అనుగుణంగా వాటన్నింటినీ విడ్స్ కలిపి ఇస్తుంది. దానికి వాయిస్ ఓవర్‌ను జతచేయవచ్చు. అయితే ఇది ఇంకా రూపకల్పన దశలోనే ఉంది. జూన్‌లో విడుదలయ్యే అవకాశం ఉంది.**



ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శనివారం 13 ఏప్రిల్ 2024

diksuchi@andhrajyothy.com

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా

హైదరాబాద్, గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కు చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్(ఎస్‌పీజీఎస్)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎడ్యుకేషనల్ లోన్ సౌకర్యం ఉంది. మెరిట్ స్కాలర్‌షిప్స్, ప్లేస్‌మెంట్స్ కూడా ఉన్నాయి.

స్పెషలైజేషన్‌లు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్.

అర్హత వివరాలు: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా సైన్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్స్‌ఏటీ/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in, escihyd.org

విదేశాల్లో చదువుకు కీలకం
లెటర్ ఆఫ్ రికమండేషన్

మంచోడని మన గురించి నలుగురూ చెప్పుకోవాలని అనుకోవడం సర్వ సాధారణం. సగటు మానవుడి సాధారణ కోర్కెగా కూడా దీన్ని చెప్పుకోవచ్చు. అయితే దీనికి సంబంధించిన ఆధునిక రూపమే లెటర్ ఆఫ్ రికమెండేషన్(ఎల్ఓఆర్). ఇక్కడ కాన్సెప్ట్ మంచోడని కాదు, విదేశీ విద్యా సంస్థలో సీటుకు అర్హుడు అని సిఫార్సు చేయాల్సి ఉంటుంది. అది తను చదువుకున్న సంస్థకు చెందిన ప్రొఫెసర్ల వంటి వారు అన్నమాట. మరీ ముఖ్యంగా విదేశాల్లో చదువుకోవాలంటే అవసరమైన పత్రాల్లో ఇది కీలకమైనది అని కూడా చెప్పవచ్చు.



విదేశాల్లో చదవాలని భావించే అభ్యర్థి కేరెక్టర్, డెడికేషన్, అకడమిక్ ఆప్టిట్యూడ్‌కి సంబంధించి విలువైన విషయాలను ఈ లెటర్ తెలియజేస్తుంది. కాలేజీ ప్రొఫెసర్లు, ఎంప్లాయర్లు మెంటార్లు, విభాగాధిపతులు ఇచ్చే ఈ లెటర్లతో అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది, పోటీతత్వం కూడా తెలుస్తుంది. స్ట్రక్చర్డ్ ఫార్మేట్‌కు తోడు సరైన ఉదాహరణలతో ఉండే లెటర్ ఒక వ్యక్తి స్థిరత్వం తదితరాలను తెలియజేస్తుంది. అకడమిక్ కెరీర్‌లో అభ్యర్థి సాధించిన గ్రేడ్స్, క్రెడిట్స్‌కు మించిన విషయాలు ఈ లెటర్‌లోనే వెల్లడి అవుతాయని కూడా చెప్పవచ్చు. కోరుకున్న కోర్సులో సీటు లభించేందుకు తోడ్పడుతుంది. అభ్యర్థికి ఉన్న విశ్వసనీయత, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా సీటు పొందడానికి ఉన్న అవకాశాలు పెరుగుతాయి. పొందికగా తీర్చిదిద్దిన లెటర్ ఆఫ్ రికమండేషన్ నిజానికి విదేశాల్లో చదవాలని ఆకాంక్షించే అభ్యర్థి లక్ష్యసాధనలో ఇతోధికంగా తోడ్పడుతుంది.

ఎవరితో... ఎందుకు

లెటర్ ఆఫ్ రికమండేషన్‌ను ఎవరితో రాయించుకోవాలి అన్నది ఒక ప్రశ్న. వివిధ వర్గాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని మదించుకుని మరీ ఆ వ్యక్తిని ఎంపిక చేసుకోవాలి. అలా సిఫార్సు చేయించుకోదగ్గ వ్యక్తుల్లో ప్రొఫెసర్ల నుంచి డిపార్ట్‌మెంట్ హెడ్ లేదా డీన్, ఉద్యోగం చేసి ఉంటే ఎంప్లాయర్, పరిశోధన పర్యవేక్షకుల వరకు అందరూ వస్తారు. మెంటార్లు, కోచ్‌లు, గైడెన్స్ కౌన్సెలర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. అభ్యర్థి నాయకత్వ పటిమ, టీమ్ వర్క్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన విషయాలను విస్తారంగా, విపులంగా, వివరంగా వీరు మాత్రమే ప్రస్తావించగలుగుతారు.

అకడమిక్, నాన్ అకడమిక్ అంశాల సమ్మిళితంగా ఉన్న రికమండేషన్ లెటర్, అభ్యర్థికి ఉన్న సామర్థ్యాలను సమగ్రంగా తెలియజేయగలుగుతుంది. రికమండ్ చేసే ప్రతి వ్యక్తి తనదైన కోణంలో అభ్యర్థి సదరు కోర్సు చేసేందుకు ఎలా, ఎందుకు అర్హుడో తెలియజేస్తారు. లెటర్ మాత్రం వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యాసంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

కరెక్ట్ ఫార్మేట్

ఈ లెటర్‌కు సంబంధించినంతవరకు కోర్ ఎలిమెంట్ అంతా ఒక్కటే. ఒక అభ్యర్థి సీటు పొందేందుకు అవసరమైన సిఫార్సు అందులో ఉంటుంది. అయితే కోర్సును బట్టి చిన్నపాటి మార్పులు లెటర్ రాసే తీరులో ఉంటుందని గమనించాలి. ఫార్మేట్, సిఫార్సు చేసే వ్యక్తి - అందుకునే వ్యక్తి కాంటాక్ట్ సమాచారం తదితరాలు యథాతథం. లెటర్‌ను ఉద్దేశించిన వ్యక్తిని గౌరవప్రదంగా సంబోధించడం సహా సాధారణ విషయాలకు తోడు అందులోని కంటెంట్ అభ్యర్థితో తనకు ఉన్న సంబంధాన్ని తెలియజేయాలి. తనకు ఎంత కాలం నుంచి తెలుసు, ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరకంగా అభ్యర్థి వ్యక్తిగత విషయాలకు సంబంధించి తనది భరోసా అన్న విధంగా ఉండాలి.

లెటర్ బాడీలో అభ్యర్థి అర్హతలు, సాధించిన విజయాలు, సంబంధిత అనుభవం, కోర్సులో చేర్చుకునేందుకు అర్హుడు అంటూ తెలియజేసే ఉదాహరణలు ఉండాలి. ఇదంతా చదివితే అభ్యర్థికి ఉన్న బలాలు, నైపుణ్యాలు, కేరక్టర్ తెలియడమే కాదు, ఎంపిక చేసేందుకు దోహదపడాలి. అభ్యర్థి విశ్వసనీయతను పెంచాలి. అలాగే లెటర్ చివరి పేరాలో ముందు చెప్పిన అంశాలను క్రోడీకరించాలి. ఇంకేమైనా సమాచారం అవసరమైతే అది కూడా అందించేందుకు తాను సిద్ధమని కూడా తెలియజేయాలి. లెటర్ రాసిన వ్యక్తి సంతకం, కాంటాక్ట్ సమాచారం చివర్లో ఉండాలి. ప్రొఫెషనల్ సైన్-ఆఫ్‌తో మొత్తం పద్ధతిగా ఉండాలి.

లెటర్ రికమండేషన్ వ్యక్తిని ఉద్దేశించి అంటే పర్సనలైజ్డ్ వ్యవహారంగా ఉన్నప్పుడు మాత్రమే పోటీలో ఎల్ఓఆర్ యూనిక్‌గా కనిపిస్తుంది. చివరగా అది అభ్యర్థిత్వానికి ఒక విద్యా సంస్థ ఓకే చెప్పడానికి బలమైన ప్రాతిపదికగానూ మారుతుంది.

ఈ ఆరూ ముఖ్యం

- లెటర్ ఆఫ్ రికమండేషన్స్ ఎన్ని సమర్పించినప్పటికీ అవి అభ్యర్థిలో ఉండే వివిధ కోణాలను చెప్పగలగాలి. విజయాలు, పర్సనాలిటీ అకడమిక్ లేదా ఎక్స్‌ట్రాకరిక్యుల్ సక్సెస్‌ను తెలియజేయగలగాలి. ఉదాహరణకు పరిశోధన నైపుణ్యాలు ఒక లెటర్‌లో ఉంటే మరొక దానిలో తరగతి గదిలో అభ్యర్థి కనబరిచిన సామర్థ్యాలను తెలియజేయాలి.
- రికమండ్ చేసే వ్యక్తికి మీరు తెలిసినప్పటికి సంబంధిత బేసిక్ సమాచారాన్ని అభ్యర్థి అందించాలి. సీవీ, అకడమిక్ జీపీఏలు, ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్, లెటర్ సబ్మిషన్‌కు డెడ్‌లైన్ తదితరాలు తెలియజేయాలి. అప్పుడే సదరు రికమెండర్ తన సిఫార్సును చక్కగా డ్రాఫ్ట్ చేయగలరు.
- ఆ లెటర్‌లో ప్రత్యేకించి కొన్ని సందర్భాలు, ఉపాఖ్యానాలు కూడా ఉండాలి. అభ్యర్థి లక్షణాలను తెలియజేసే విధంగా అవి ఉండాలి. లక్షణాలు, నైపుణ్యాలు తదితరాలను కేవలం ధ్రువీకరణలతో సరిపెట్టకూడదు. వాటికి సరైన ఉదాహరణలనూ జోడించాలి. రీసెర్చ్ ప్రాజెక్టుల్లో అనుభవాలు లేదంటే చోటుచేసుకున్న చర్యలను కూడా కలిపితే అభ్యర్థి క్రెడిబిలిటీ పెరుగుతుంది.
- ఆ లెటర్‌లో అభ్యర్థికి సంబంధించిన బలాలకు తోడు అకడమిక్ ప్రోగ్రెస్, డెవలప్‌మెంట్‌కూ తగు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ అంశాల్లో కచ్చితత్వాన్ని అడ్మిషన్ కమిటీ ఎవాల్యుయేట్ చేస్తుంది. బలహీనతలను ఎలా అధిగమిస్తారన్నది కూడా చూస్తుంది.
- లెటర్ డ్రాఫ్టింగ్‌లో సమతుల్యత పాటించాలి. అస్సలు ఏమీ లేకపోవడం లేదంటే పెద్ద ఎత్తున విషయాలను కుమ్మరించడం... రెండూ పనికిరావు. ప్రొఫెషనల్ అయినప్పటికీ పర్సనలైజ్డ్ సిఫార్సులకు అడ్మిషన్ కమిటీ ప్రాధాన్యం ఇస్తుంది. అందుకని ప్రతి లెటర్ దేనికది యూనిక్‌గా ఉండాలి. బేసిక్ ఫార్మాట్ నుంచి పక్కకు తప్పకుండానే కంటెంట్ తదితర విషయాల్లో తగు జాగురూకత పాటించాలి. మొత్తమ్మీద బ్యాలెన్స్ తప్పకుండా చూసుకోవాలి.
- ప్లగారిజాన్ని తప్పించాలి. మరొక లెటర్‌కు కాపీ కారాదు. ఒరిజినల్ అనిపించాలి. కాపీని సులువుగా పట్టేస్తారు. ముందునుంచీ చెబుతున్నట్టు లెటర్ ఒరిజినల్‌గా ఉండేలా చూడాలి. అభ్యర్థిని తీసుకునేలా ఉండాలే తప్ప ఒక డూప్లికేట్ మాదిరిగా అనిపించి అసలుకే మోసం తెచ్చేలా ఉండకూడదు. అంటే కాపీ, పేస్ట్ పని మంచిది కాదని గుర్తించాలి.

లిటిల్స్



ఉడుత భక్తి!

ఒక వెదురు చెట్టులో ఉడత నివాసం ఉండేది. ఆ ఉడుతకి జాలి గుణమెక్కువ. ఎవరే ఇబ్బంది పడినా స్పందించేది. తనకు సాయం చేసినవారి పట్ల భక్తి భావంతో ఉండేది. ఉడతాసాయం చేసేది. వెదురు బొంగులమీద గెంతుతూ ఆడుకునే ఉడతను చూసి ఓ గద్ద అసూయ పడింది. పైగా ఆ ఉడుతను కాళ్లతో రక్కి తినందే నిద్రపోకూడదని మనసులో అనుకుంది. ఎప్పటిలాగే మధ్యాహ్నం సమయంలో ఉడుత ఆడుకుంటూ వెళ్లి నీళ్ల నిలిచిన చిన్న గుంత దగ్గరికి పోయింది. ఒక్క క్షణంలో గద్ద ఉడుత మీదకు రివ్వున వచ్చింది. అది చూసి చావే గతి అనుకుంది. ఆ తర్వాత ఏమైందో దానికి గుర్తులేదు.



ఉడుత కళ్లు తెరిచి చూడగానే కాకుల గుంపు ఒకటి కనిపించింది. 'అసలు నేనెందుకు ఇక్కడున్నా?' అన్నది. 'మాకు ఉడుతలంటే ప్రేమ. ఎవరికీ ఏ హాని తలపెట్టకూడదని మాకు మా పెద్దలు చెప్పారంటూ ఓ కాకి కాస్త ఉడుత ముందుకు వచ్చి చెప్పింది. 'మీ మేలు మర్చిపోలేను' అంటూ ఉడుత తన ఇంటికి వెళ్లిపోయింది. ఒక రోజు ఉడుత చెట్లపై ఆడుకుంటోంది. ఆ సమయంలో ఓ వేపచెట్టు దగ్గరకు వెళ్లింది. అక్కడ గద్దలన్నీ గుంపు కూడాయి. 'కాకులపై రాత్రిపూట దాడి చేద్దాం. ఈ అడవిలో మనమే రాజులం' అంటూ గద్దలు మాట్లాడుకుంటున్నాయి. ఈ విషయం విని.. కాకులకు ఈ విషయం చెప్పింది ఉడుత. కాకులన్నీ జాగ్రత్తగా ఉండాలని, గద్దలను ఎదుర్కునేందుకు వ్యూహం పన్నాయి. ఒకేసారి గద్దలు కాకుల గుంపుపై రాత్రిపూట దాడి చేశాయి. అనుకున్న పథకం ప్రకారమే.. కాకులు గద్దలను ఎదుర్కున్నాయి. పైగా కాకులు నల్లగా ఉండటంతో చీకట్లో గద్దలకు ఏమీ అర్థం కాలేదు. దాదాపు అన్ని గద్దలు నేల కూలాయి. ఆ తర్వాత గద్దలు కాకుల జోలికి రాలేదెన్నడూ.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



ప్రపంచంలోనే తొలి థియేటర్ ట్రైనింగ్ సంస్థగా 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'గా పేరుంది. 1959లో సంగీత నాటక అకాడమీ విభాగంగా ఈ సంస్థ ఆరంభమైంది. 1975లో స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ విభాగం నిధులతో ప్రస్తుతం పనిచేస్తోంది. తగు జాగ్రత్తలతో ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించిన సిలబస్, శిక్షణతో పకడ్బందీగా సంస్థను నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం ఈ సంస్థ డ్రమటిక్ ఆర్ట్స్‌లో మూడేళ్ళ కాలవ్యవధి కలిగిన డిప్లొమాకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులను యాక్టింగ్, డిజైన్, డైరక్షన్‌కు తోడు థియేటర్ సంబంధ డిసిప్లిన్స్‌లో ప్రొఫెషనల్స్‌గా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన కోర్సు ఇది. ఈ ఏడాది జూలై 24 నుంచి కోర్సు ఆరంభమవుతుంది. సీట్లు 32 కాగా వీటిలో మూడింటిని విదేశీ విద్యార్థులకు కేటాయించారు. హిందీ ఇంగ్లీష్ మాధ్యమాల్లో బోధన ఉంటుంది.

అర్హత: ఏ డిసిప్లిన్‌లో అయినా మూడేళ్ళ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆరు వేర్వేరు థియేటర్ ప్రొడక్షన్స్‌లో పాల్గొని ఉండాలి. అందుకు తగు ప్రూఫ్‌ని సమర్పించాలి. హిందీ/ ఇంగ్లీష్ భాషలు తెలిసి ఉండాలి. ఈ ఏడాది జూలై 1 నాటికి వయసు 18-30 మధ్య ఉండాలి. రిజర్వుడు వర్గాలకు నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

ఎన్ఎస్‌డీలో డిప్లొమా



ఎంపిక: ఇది రెండు దశలుగా ఉంటుంది. ప్రిలిమినరీ ఎగ్జామ్ ఉంటుంది. ఇందులో ఎంపికైన వారికి ఫైనల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ఉంటుంది. దేశంలోని వివిధ నగరాల్లో వేర్వేరు తేదీల్లో ఈ రెండూ జరుగుతాయి. హైదరాబాద్‌లో మే 27న జరుగుతుంది. వివరాలు ఎన్ఎస్‌డీ వెబ్‌సైట్‌లోనూ ఉంటాయి. తుది ఎంపిక న్యూఢిల్లీలో ఉంటుంది. జూన్ 23 నుంచి 27 వరకు అంటే అయిదు రోజులు ఉంటుంది. దీనికి పిలిచిన అభ్యర్థులకు వారి సొంత ఊరి నుంచి ట్రావెల్ ఎక్స్‌పెన్సస్‌కు తోడు డీఏ చెల్లిస్తారు. నిపుణులతో కూడిన కమిటీ వీరి ప్రతిభను పరిశీలించి తుది ఎంపిక జరుపుతుంది. ఫిజికల్ ఫిట్‌నెస్ తప్పనిసరి. అందుకు మెడికల్ టెస్ట్ కూడా ఉంటుంది.

కోర్సు వివరాలు: కోర్సు కాల వ్యవధి మూడేళ్ళు కాగా ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్ 20 వారాల పాటు ఉంటుంది. మొదటి మూడు సెమిస్టర్లు కామన్. చివరి మూడు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ ఉంటుంది. ఇందులో డిజైన్, డైరక్షన్‌లో మాత్రం అయిదుగురు విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది. కోర్సుకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.9,500 చెల్లిస్తారు.

దరఖాస్తు: ఫీజు రూ.50. **దరఖాస్తుకు ఆఖరు తేదీ:** మే 10

సంస్థ చిరునామా: NATIONAL SCHOOL OF DRAMA, Bahawalpur House, Bhagwandas Road, New Delhi-110001

వెబ్‌సైట్: www.nsd.gov.in http://www.onlineadmission.nsd.gov.in

ఎన్‌పీసీఐఎల్, ముంబయిలో ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

ముంబయిలోని కేంద్రప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) కింది విభాగాల్లో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 30 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 400 పోస్టులు. (ప్రస్తుత ఖాళీలు 396, బ్యాక్‌లాగ్ ఖాళీలు 4)

విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక: గేట్ 2022/ 2023/ 2024 స్కోర్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 30

వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

జాబ్ కార్నర్

సీఎంఎస్ఎస్‌లో మేనేజర్లు

న్యూఢిల్లీలోని సెంట్రల్ మెడికల్ సర్వీసెస్ సొసైటీ ఒప్పంద ప్రాతిపదికన కింది 15 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఖాళీలు
1. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): 1
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్): 1
3. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): 2
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ అస్యూరెన్స్): 1
5. మేనేజర్(ప్రొక్యూర్‌మెంట్): 2
6. మేనేజర్(లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చైన్): 2
7. మేనేజర్(ఫైనాన్స్): 2
8. మేనేజర్(క్వాలిటీ అస్యూరెన్స్) 2
9. ఆఫీస్ అసిస్టెంట్: 1
10. వేర్‌హౌస్ మేనేజర్(ఫార్మాసిస్ట్): 1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఐసీడబ్ల్యూఏ, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టుల 45 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టులకు రూ.1,00,00; మేనేజర్, వేర్‌హౌస్ మేనేజర్ పోస్టులకు రూ.50,000; ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు రూ.30,000.

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 20

వెబ్‌సైట్: cmss.gov.in



ఎన్ఐఓహెచ్‌లో క్లర్క్‌లు

అహ్మదాబాద్(గుజరాత్)లోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్ రెగ్యులర్ ప్రాతిపదికన అయిదు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
1. అప్పర్ డివిజన్ క్లర్క్: 1
2. లోయర్ డివిజన్ క్లర్క్: 4

విద్యార్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీతోపాటు టైపింగ్ నైపుణ్యాలను కలిగి ఉండాలి.

వయసు: 18-27 సంవత్సరాల మధ్య ఉండాలి.

జీతం: నెలకు అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టుకు రూ.25,500 - రూ.81,100; లోయర్ డివిజన్ క్లర్క్‌కు రూ.19,900 - రూ.63,200

ఎంపిక: రాతపరీక్ష, టైపింగ్ టెస్ట్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: www.nioh.org/recruitment

హెచ్ఏఎల్‌లో పోస్టులు

లఖ్‌నవూలోని హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ పార్ట్‌టైమ్/ విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టుల సంఖ్య: 5

విద్యార్హత: ఎంబీబీఎ/ బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/ బీయూఎంఎస్, పీజీ/ డిప్లొమాతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 65 సంవత్సరాలకు మించకూడదు

దరఖాస్తుకు చివరితేదీ: ఏప్రిల్ 18

వెబ్‌సైట్: https://www.hal-india.co.in/career

డైలీ సుడోకు - 280

7		4			6			
		9	2					
	2	8		7	3			
8						9		2
		7	8		4	1		
9		3						4
			7	3		6	4	
					5	3		
			6			8		9

సుడోకు - 279 సమాధానం

3	8	4	9	5	1	6	2	7
9	5	6	2	7	4	1	3	8
2	1	7	8	6	3	9	5	4
1	9	8	5	4	2	7	6	3
4	6	2	7	3	8	5	9	1
5	7	3	6	1	9	4	8	2
7	2	9	4	8	6	3	1	5
8	4	1	3	9	5	2	7	6
6	3	5	1	2	7	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.